- తెలంగాణ యక్షగానం - భాషా వైశిష్ట్యం
- నల్లగొండ జిల్లా దళిత నవలా సాహిత్యం - వస్తు విశ్లేషణ
- నన్నయ మహాభారతంలో శ్రామిక జన ప్రస్తావన
- తెలంగాణ జాతికి పట్టుగొమ్మ - బతుకమ్మ
- విశ్వనాథ వారి 'త్రిశూలం' - పరిశీలన
- నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము
- సైలెంట్ డెత్ నాటకం - అత్యాధునిక తరం
- శ్రీ శివరామ భజన కీర్తనలు

మూసీ
MUSI

• Samputi : 28 • Sanchika : 11 • Pages : 64 • Rs. 20
• September 2025

బతుకమ్మ మరియు
దేవీ శరన్నవరాత్రి శుభాకాంక్షలు

Scanned with OKEN Scanner

వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 11
సెప్టెంబర్ - 2025
'విశ్వావసు' భాద్రపద మాసం

ISSN 2457-0796

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

Type Setting at :
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

ఈ సంచికలో ...

తెలంగాణ యక్షగానం - భాషా వైశిష్ట్యం ... డా. కె. సురేశ్ - 7

నల్లగొండ జిల్లా దళిత నవలా సాహిత్యం- వస్తు విశ్లేషణ ... ఎడ్ల మహేశ్ - 11

నన్నయ మహా భారతంలో శ్రామిక జన ప్రస్తావన ... డా. బూర్ల చంద్రశేఖర్ - 15

తెలంగాణ జాతికి పట్టుగొమ్మ - బతుకమ్మ ... యం. సంతు - 19

తెలుగు భాషాశాస్త్ర వికాసానికి నాయని కృష్ణకుమారి సేవలు
- గౌడిపేరు సురేశ్, డా. ఈశ్వరమ్మ - 25

పక్షపాతం / నిష్పాక్షిపత : తెలుగు పరిశోధనలో కీలక సంఘర్షణ
... ఆచార్య గంపా వెంకటరామయ్య - 29

విశ్వనాథ వారి 'త్రిశూలం' - పరిశీలన ... డా.తత్త్వాది ప్రమోద్ కుమార్ - 35

నీతిశాస్త్రము - తాళపత్ర గ్రంథము ... డా. గంద్ర లక్ష్మణ రావు - 39

సైలెంట్ డెత్ నాటకం : అత్యాధునిక తరం ... బుక్కే ధనక నాయక్ - 41

శ్రీ శివరామ భజన కీర్తనలు ... సుప్పని సత్యనారాయణ - 45

నీటి సంక్షోభం - నాటికల ప్రతిధ్వని ... డా. వై. సుభాషిణి, కె. అశ్విని - 49

గూడ అంజయ్య రాసిన బీరుపూరి కథ - సామాజిక విశ్లేషణ ... పి. మృదుల - 54

కవిత్వం

గురువులారా వందనం! ... జి. లింగేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్ - 6; కొండ ... డా. ఎన్. గోపి- 13; ఐతరేయోపనిషత్తు ... జక్కని వేంకటరాజం - 14; కొత్తలోకం కావాలి ... ధూళిపాళ అరుణ - 28; మాతృభాష సేవ మరువకండి ... పసుపులేటి నరసింహారావు- 48; ఆజాద్ - నలిమెల భాస్కర్ - 62; సృష్టిబంధం - మునుగూరి పురుషోత్తం - 62.

సమీక్ష

ఆచార్య గోనానాయక్ మూడు దశాబ్దాల కృషి 'భారతీయ గిరిజన వీరులు' - బి. మదన మోహన రెడ్డి - 57

స్ఫూర్తిదాయక జీవన గాథ కావేరి ఛటోపాధ్యాయ 'ఆటుపోట్ల కావేరి'...డా. వై. రామకృష్ణారావు-29

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

Printed, Published and Owned by :
B. MANOHARI, 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
Office : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Editor : **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11   హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

సంపాదకీయం

వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**

క్షేత్రం

క్షితి అంటే భూమి. క్షితి మీద ఉండేది క్షేత్రం. భూమి మీద ఎన్నో క్షేత్రాలున్నాయి. ఆ యా క్షేత్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కొన్ని ప్రదేశాల్లోనే క్షేత్రాలు ప్రత్యేకంగా ఏర్పడినాయి. మిగిలినవన్నీ వ్యవసాయ, ఆవాస తదితర క్షేత్రాలుగా గుర్తింపు పొందినాయి. ప్రత్యేక క్షేత్రాలకు ప్రయాణం చేసే జన సాంద్రత ఎక్కువ. ఆ క్షేత్రంలో జరిగే ఉన్నత, ఉత్తమ కార్యక్రమాల వల్ల కూడా ఆ క్షేత్రాలకు గుర్తింపు వస్తుంది.

భూమికి ముఖ్యంగా ఉండేది గురుత్వ ఆకర్షణ. ఈ ఆకర్షణ ఒక్కో ప్రదేశంలో ఒక్కో రకంగా విస్తరిస్తుంటుంది. కొన్ని ప్రదేశాల్లో ఈ ఆకర్షణ శక్తి అధికంగా ఉండడం వల్లనే ఆ ప్రాంతాలకు అందరూ వెళ్ళడం జరుగుతుంది. వ్యక్తిలోనూ, క్షితిలోనూ ఈ ఆకర్షణ శక్తిని పెంచే ప్రయత్నం నిరంతరం చేస్తూ ఉండాల్సిందే. ఆ వ్యక్తుల చుట్టూ, ఆ క్షేత్రాల చుట్టూ జన సంచారం అధికంగా ఉంటుంది. ఈ విధమైన అయస్కాంత శక్తి అధికంగా ఏర్పడడానికి ఆ ప్రాంతాల్లో ఒక శుద్ధమైన వాతావరణాన్ని ఏర్పరచాలి. పంచభూతాలూ అక్కడ శుభత్వాన్నే ఇవ్వాలి. విగ్రహాదులను ప్రతిష్ఠించి, వేరు వేరు జలద్రవ్యాలతో అభిషేకం చేయడం, అగ్ని ప్రతిష్ఠించి హోమాదులు నిర్వహించడం, వాయువు ద్వారా సువాసనలు కలిగే విధంగా చూడడం వంటి ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. అనేక వృక్షజాతుల ద్వారా శుభవాయువులు (ఆక్సీజన్) వీచే ఏర్పాటు జరగాలి. అప్పుడే ఆ ప్రాంతం పవిత్రమై శుద్ధమవుతుంది. శుద్ధమైన క్షేత్రానికి శక్తి పెరుగుతుంది. పెరిగిన శక్తి వల్లనే అందరికీ అది పవిత్రమై జనాకర్షకమవుతుంది.

వ్యక్తిలోనూ ఇదే. క్షితి పాలు ఎక్కువ. మిగిలిన నాలుగు భూతాలూ సమపాళ్ళలో ఉంటాయి. ఈ వ్యక్తిలోని క్షితి సంబంధ తత్త్వం కూడా శుద్ధత వల్లనే ఆకర్షణ శక్తిని పెంచుకుంటుంది. దేహం వరకే కాకుండా ఇది మనస్సంబంధం. మనస్సులో ఉండే భావాలలో క్రమంగా ఇతర భూతాలు శుద్ధం అవుతూ ఉంటే వ్యక్తిలోని ఆకర్షణ బాగా పెరుగుతుంది. వారు ఆదర్శ జీవనులవుతారు. తరువాతి తరాలకు మార్గదర్శకులవుతారు. ఆ ఆకర్షణ శక్తి పెంచుకోవడానికి ఆహార విహారాల్లో మార్పు రావాలి. యోగ ప్రాణాయామాది సాధనలూ కావాలి. ఉపవాసాది దీక్షలూ అవసరమే. మనస్సు లోక వ్యవహారం నుండి శక్తి వ్యవహారంపైకి దృష్టి సారించాలి. అప్పుడే అది కూడా శక్తి వంతమవుతుంది. వారి చుట్టూ ఉన్నవారికి కూడా దాని శక్తి అందుతుంది.

ప్రత్యేమైన క్షేత్రాల్లో వ్యక్తి కొంత సేపు రోజూ గడపడం వల్ల వ్యక్తి ఆ శక్తి వస్తుంది. ఒక అయస్కాంత క్షేత్ర పరిధిలో ఇనుప ముక్కను రోజూ కొంతసేపు ఉంచడం వల్ల క్రమంగా ఈ ఇనుప ముక్క అయస్కాంతంగా మారడం సహజమే కదా. అదేవిధంగా అయస్కాంతం చుట్టూ ఒక క్రమ పద్ధతిలో ఇనుపముక్కను తిప్పడం (ప్రదక్షిణం) వల్ల కూడా అదేవిధమైన అయస్కాంతత్వం ఇనుప ముక్కకు వస్తుంది కదా! ఈ వైజ్ఞానిక విశేషమే క్షేత్రాలలోనూ వర్తిస్తుంది. భూమి, నవ గ్రహాలు కూడా తమకన్నా శక్తివంతమైన సూర్యుని చుట్టూ తిరగడం వల్లనే కదా వాటికి కావలసిన శక్తి లభిస్తున్నది. తమకన్నా ఉన్నత శక్తి సాన్నిహిత్యంలో మెలిగినా, దాని చుట్టూ తిరుగుతూ ఉన్నా క్రమంగా వ్యక్తి శక్తివంతుడవడంలో సందేహం లేదు. దీనికి ఒక క్రమపద్ధతి ఉండాలి. శుద్ధత చాలా అవసరం. పూర్వపు వాసనలున్న దేహం తొందరగా దైవ మార్గానికి చేరలేదు. వాసనలన్నీ వదిలిపోతే తప్ప శరీరం ఉన్నత స్థితిని పొందలేదు. ఆకర్షణ శక్తిని పెంచుకోలేదు. దానికే భారతీయ పద్ధతి ఎన్నో మార్గాలను సూచించింది. వాటిలోని వైజ్ఞానికతను దర్శించి తమ శరీరాన్ని ఉన్నత క్షేత్రాలుగా మలుచుకుని ఆదర్శప్రాయులు కావడం వ్యక్తి నిరంతర విధి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

గురువులారా! వందనం!!

శా. అజ్ఞానమ్మునురూపుమాపుగురువై యందించువిజ్ఞానమే
జిజ్ఞాసన్ వికసింపజేసిమదిలోలి జీవాత్మలక్ష్యంబుగన్!
విజ్ఞానమ్మునునింపుచుండునుసదా విశ్వానదైవమ్ముగా!
సుజ్ఞానోక్తులబోధజేయు నెపుడున్ శుద్ధాంతరంగంబుతో

శా. సద్యోజాతుడిగావిరించిహరియైసాక్షాత్ త్రిమూర్త్యాత్ములై
విద్యాబుద్ధులనందజేసిమిగులన్ విశ్వానశోభిల్లగా
విద్యాభారతి స్థానమైనబడిలో విద్యోన్ముఖోత్సాహులై
విద్యాబోధనచేయునట్టిగురువావేవేలదండాలయా

శా. నిత్యాన్వేషణ జ్ఞానతత్పరుడవైనీయంతరంగమ్ములో
సత్యాసత్యవిచక్షణమ్ముదెలిపీసచ్ఛాత్రులైసాగగా;
కృత్యాలెన్నియజేసిబోధనములోకృత్యానువర్తుండునై
నిత్యాధ్యాయుడవైననొజ్జయెసదానేర్పించు క్రొంగొత్తగా

శా. సద్వాగ్వైభవధారచేగురువులేసద్బోధగావించుచున్
సద్విద్యల్ వెలయింపజేయుచుసదాసంస్కారముల్ నేర్పగా
సద్విద్యాప్రదులైనవారికృపచేసత్కీర్తిసాధించియున్
సద్విద్యార్థులుగానుమారిభువిలోసన్మార్గులైవర్ధిల్లునే!

శా. ప్రజ్ఞావంతులుపండితోత్తములుగాప్రజ్ఞానిధుల్ సర్వదా
అజ్ఞానమ్ముసుపార ద్రోలిమదిలోయందించివిజ్ఞానమే
ఆజ్ఞల్వీడకశిష్యబృందముసదాయాజ్ఞల్నిపాటించినా
సుజ్ఞానామృతధారలొందిమిగులన్ శోభిల్లువిశ్వమ్మునా

శా. విద్యోద్యానమునందువెల్లివిరిసీవిద్యా ప్రసూనమ్ములై
విద్యావైభవశేముషీకుశలురైవిఖ్యాతినార్జించగా
విద్యార్థీనినుతీర్చిదిద్దుగురువులేవిశ్వానదైవమ్ముగా
విద్యాబోధనవృత్తితత్పరులుగావిద్యానుసంధానులై

(సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని)

జి. లింగేశ్వర శర్మ
సిద్ధిపేట, ఫోన్ : 96033 89441

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

వ్యాససంగ్రహం – (Abstract) : (200 పదాలకు మించకుండా)

1. వ్యాససంగ్రహం : 1) రెండు–మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు–మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

తుకారాం అభంగం

నారాయణా నారాయణా
సత్య సంకల్పాల దాత
పూర్ణమయా పూర్ణచంద్ర పరిపూర్ణ
పూర్ణము జేయు నా మనోరథముల

అలంకార శోభప్రభ నీదు
ముఖ బింబమయ్యా దేవా
భావమందు ఉదయించే చూడ
నీ వదన దివ్య సుందర రూపమయ్యా

అంతరంగ మందు నిలిచే
అంతరంగుడవయ్యా
అందరి మదిలోన కదిలే
కల్పనలను విందువయ్యా
పరబ్రహ్మ బ్రహ్మాండ నాథ
వ్యాపించవే నా మనోరథముల

తుకా పలికే నడవదు వినా
నీవు లేక జీవితమయ్యా
నీవే సర్వస్వము నీవే నా లోకము
నీతోనే నా ప్రాణము నా మోక్షము

అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 7 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

తెలంగాణ యక్షగానం – భాషా వైశిష్ట్యం

✍ డా. కె. సురేశ్, సహ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా,
ఫోన్ : 9441705076

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి చిహ్నంగా, ప్రదర్శన కళారూపంగా తెలంగాణ యక్షగానం వాసికెక్కింది. పౌరాణిక, రామాయణ, మహాభారత, భాగవత, కాల్పనిక గాథలు ఎన్నిటినో ప్రజలకు చేరవేసింది. ఇది సంగీత, సాహిత్య, నృత్యాభినయాలతో కూడిన సమాహార కళారూపం. ఈ కళ ప్రజలను అలరించి, వినోదాన్ని పంచుతూ, విజ్ఞాన కాంతులను ప్రసరింపజేసింది. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక చింతన పెంపొందించే కళగా ప్రత్యేకంగా విరాజిల్లింది. తెలంగాణలో యక్షగానాన్ని భాగవతం, వీధి బాగోతం లేదా బాగోతం అని పిలుస్తారు.

తెలంగాణ యక్షగానాలకు భాషా వైశిష్ట్యం దృష్ట్యా ఎంతో ప్రత్యేకత ఉంది. గ్రాంథిక, వ్యావహారిక, మాండలికాది భేదాలు అడుగడుగునా కనిపిస్తాయి. ముద్రిత గ్రంథమైనా, అముద్రిత గ్రంథమైనా నటుని నోటికి వచ్చేవరకు అవి ఎన్ని కొత్త పుంతలు తొక్కుతాయో, అందులో ఎన్ని విశేషాలు చేరుతాయో ప్రయోగ ప్రదర్శనలో చూడవలసిందే గాని ఆ విషయాలు గ్రంథాలలో లభ్యం కావు. ఆ విధంగా తెలంగాణ యక్షగానాల్లో తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయానికి, మాండలికాలకు, అన్య దేశ్యాలకు అదే విధంగా వృత్త పద్యాలు, జాతి, ఉప జాతులు, కందార్థాలు, గీతార్థాలు, రగడలు, గద్యరీతులు, వివిధ ప్రాసాలంకారాలకు ప్రాధాన్యమిచ్చిన భాషా విశేషాలలో కొన్ని పరిశీలిద్దాం.

గ్రాంథిక భాష

యక్షగానాల్లో పద్య, గేయ, వచనాల్లో పూర్వాంధ్ర గ్రాంథిక సంప్రదాయాన్ని అనుసరించి సలాక్షణికమైన గ్రాంథిక భాష కనిపిస్తుంది. నటుని నోట ఇందులో ఏవైనా మార్పులు రావచ్చు గాని గ్రంథంలో మాత్రం అంతటా గ్రాంథిక భాష కనిపిస్తుంది.

చం. తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటినందన నీకు మొక్కెదన్
ఫలితము సేయుమయ్య నిను ప్రార్థన జేసెద నేకదంతమా
వలపతి చేతి ఘంటమున వాక్కున నెప్పుడు బాయకుండు మీ
తలపులలోన నీవె గతి దైవవినాయక లోక నాయకా
(పద్మవ్యూహం)

ప్రతి యక్షగానం ప్రారంభంలో విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతి స్తోత్రం, దైవస్తుతి వృత్త పద్యాలలో గ్రాంథికభాషలో రచించడం సర్వసాధారణం. అంతేకాకుండా ప్రధాని, నటకుడు, సమన్వయకర్త, పాత్రోచిత సంభాషణలు, నాయికానాయకుల మరియు ప్రధాన పాత్రలతో మాట్లాడేటప్పుడు గ్రాంథిక భాషను ఉపయోగించడం ఎక్కువగా కనిపిస్తుంది.

ఉ. ధీరులు పార్థివోత్తములు దిక్పతిముఖ్యుల నోర్చునట్టి గం
భీరులు రాజసింహబల భీకరమూర్తులు భానుతేజవి
స్ఫారులు భండనద్విజయసాధ్యులు పంచమవిర్ణకాంశులై
చేరితినిందు మీస్థితియు జెప్పుడి నామములున్ దయాళులై?
(విరాట పర్వము – కీచక వధ)

ప్రధాని రాజును సంబోధిస్తూ అతని గుణశౌర్యాలను వర్ణిస్తూ, నామధేయము, క్షేమ సమాచారములు తెలుపమని పలికిన మాటలను గ్రాంథిక భాషలో మనము చూడవచ్చు.

ప్రాథమిక దశలో వచ్చిన తెలుగు నాటక సాహిత్యంలో కూడా గ్రాంథికమే ఎక్కువ. రాను రాను వ్యవహారికం చోటు చేసుకున్నది. అయితే ఈ యక్షగానాలలో మాత్రం గ్రాంథిక, వ్యావహారిక, మాండలికాలు ఆయా సందర్భాల్లో ఉపయోగించడం జరిగింది.

వ్యావహారిక భాష

కుతుబ్షాహీల రాజ్యపతనం తర్వాత క్రీ.శ.1724లో నిజాం నవాబుల పరిపాలన ప్రారంభమైంది. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి, 1948 సెప్టెంబర్ 17వ తేదీన పోలీసుచర్య జరిగే వరకు ఇప్పుడున్న తెలంగాణ ఇంచుమించుగా వారి చేతిలోనే ఉంది. ఆ కాలంలో కృష్ణాపత్రిక జాతీయోద్యమ మహాశక్తిగా రంగంలోకి ప్రవేశింపగా, సురవరం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో గోలకొండ పత్రిక రంగంలోకి వచ్చింది. తెలంగాణలోని భాషా, సాహిత్య, సాంస్కృతిక వికాసానికి ఈ పత్రిక అద్దం పట్టింది. ఈ మధ్యకాలంలో యక్షగానం ఒక అపూర్వ సాంస్కృతిక ప్రసార సాధనంగా తనవంతు బాధ్యతను నిర్వర్తించింది. అందరికీ రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల్లోని కథల్ని అందించాలి. అది కొనసాగించడానికి ప్రజానీకం ఆలోచించింది. దాసర్లు మరియు బుడిగజంగాలు పూర్తికాలం యక్షగానాలను ప్రదర్శించుటలో నిమగ్నమై తమ జీవితాలను కళకు అంకితం చేసారు.

మరికొందరు తమ వృత్తిధర్మాన్ని నిర్వర్తించుకుంటూనే ప్రోత్సహించారు. ఇంకా కొంతమంది ఔత్సాహిక కళాకారులు యక్షగానాలను నేర్చుకొని కృతకృత్యులయ్యారు. ఈ విధంగా యక్షగాన ప్రక్రియ నూతన ఉత్సాహంతో పరవళ్ళు తొక్కుతూ రంగప్రవేశం చేసింది. నాటి తెలుగు వ్యావహారిక భాషలో ఉర్దూ పదాల ఆధిక్యంతో పాటు ఇతర భాషా పదప్రయోగాలు అక్కడక్కడ కనిపిస్తాయి. అది పౌరాణికంగానీ, చారిత్రకంగానీ, సాంఘికంగానీ, కాల్పనికం గానీ కథ ప్రారంభంలో యిది ఉండడం సర్వసాధారణం అయిపోయింది. రచయిత రచించకున్నా నటులు, శిక్షకులు తప్పనిసరిగా ఇది పలికించేవారు. ఉదాహరణకు ఒక ప్రచురిత యక్షగానంలోని ఈ కింది మాటలను పరిశీలిద్దాం.

వ. ఒరే సేవకా హే కందుకూర్ గావ్ మే సబీ లోగ్ అచ్చా హై.

సే. అయ్యా అయ్యా తమరు ఆనతిచ్చిన ప్రకారంగా మెదలుచూ, బాలాది వృద్ధ సమేతంగా క్షేమంగానే ఉన్నవారము.

వ. అచ్చా దేఖో.. యే గావ్ మే రోషిని బహుత్ హై .. క్యా హెూ రహీ హై.

సే. అయ్యా ఇచ్చట భాగవతులు యక్షగానం ఆడుచున్నారు.

వ. అచ్చా కోన్సా భాగవత్ కేల్తా హై.

సే. అయ్యా ఇచ్చట ఇంతకుముందు ఆడినట్టి చరిత్రము కుమ్మరి వీరమ్మ జీవితకథ. ఇప్పుడు జరగబోవుచున్నది జగదేకవీరునికథ యక్షగానము.

మంత్రి సేవకుల మధ్య జరిగిన ఈ సంభాషణలో ఇక్కడ వెలుతురు ఎక్కువగా ఉన్నదేమన్న ప్రశ్న వెంబడే భాగవతులు ఆడుతున్నారనే సమాధానం వచ్చేసింది. అంటే ప్రాథమిక దశలో కేవలం పాత్రలు అడగడమే గాక నిజాం ప్రభుత్వం పదాధికారులు ఎవరినో పంపించి అడగడం ఒక సంప్రదాయంగా ఉండేదని, తమ ప్రభువుకు వ్యతిరేకంగా ఏ ప్రదర్శనైనా జరిగిన పక్షంలో దాని నిరోధించే వారని జనపదాల్లోని వృద్ధులు చెప్పడం జరిగింది. నాటకంలోని ఇతివృత్తాన్ని గూర్చి చెప్పడం నాటక లక్షణానుసారంగా జరిగిందనిపించినా, ఇక్కడ మాత్రం సమకాలీన రాజకీయ, సామాజిక ప్రభావం వల్ల మరో కొత్త సాంప్రదాయ అంశం యక్షగానంలో ప్రవేశించింది.

గద్య రీతులు

తెలంగాణ యక్షగాన సాహిత్యంలో గేయానికి ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఆయా సమయ సందర్భాలలో రచయితలు గద్యాన్ని ప్రవేశపెట్టారు. గద్యం లేని చోట్లలో కూడా నటులు దేశ, కాల పరిస్థితులను అనుసరించి తమ సొంత వాక్యాలు చేర్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముద్రిత గ్రంథాలు మరియు మౌఖిక ప్రచారంలో సుదీర్ఘమైన గద్యాలు ఉన్నప్పటికీ, వాడుకలో ఉన్నటువంటి కొన్ని వాక్యాల విషయం ఇక్కడ ప్రస్తావిద్దాం.

దృశ్య కావ్యాల్లో సంబోధనలు ఉండటం ఎంత సహజమైనా, యక్షగాన సంబోధనలో ఒక ప్రత్యేకత ఉంది. నాటకంలో ఎదుటి పాత్రను పేరుతో పిలవడం, వరుస పెట్టి పిలవడం, శత్రువు అయితే ధిక్కరించి పిలవడం సహజమే. తెలంగాణ యక్షగానాల్లో ఈ పిలుపుల్లో కూడా ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

రాజా రాజకంఠీరవ/ రాజా కల్పభూజా/ మంత్రీ సుజన తంత్రీ/ దేవా మహానుభావా/ శూరా సకలగుణ సువిచార/ కలికీ చిలకలకొలికీ/ కొమ్మా ముద్దుగుమ్మా/ చానా మందయానా/ వారీ సూత్రధారీ/ సారథీ గుణవారథీ/ నారీ మరునికటారీ/ బాలా గుణజాల/ ఇంతీ మరుని పూబంతి/ రాణి పువ్వు బోణి మొ॥

తెలంగాణ యక్షగానంలో ఇటువంటి జంట సంబోధలని ఎన్నో ఉదహరించవచ్చు. ఈ జంట పదాల్లో మొదటిది వ్యక్తి పేరుగానీ, వృత్తిని గానీ, అధికారాన్ని గానీ తెలిపేదికాగా రెండవది ఆ వ్యక్తికి సంబంధించిన విశేషణమై ఉంటుంది.

కందార్థాలు

జాతి పద్యాలలో కందానికో ప్రత్యేకత ఉంది. తెలుగులో కందాన్ని అందంగా తీర్చిదిద్దిన వారు తిక్కన, కవి చౌడప్పలు. అటువంటి కందం తన విశిష్టతను బట్టి యక్షగాన సాహిత్య ప్రక్రియలో సముచిత స్థానాన్ని ఆక్రమించుకుంది. ప్రారంభ ప్రార్థన పద్యం నుండి చివరి వరకు ఏ సందర్భంలోనైనా యక్షగాన రచయితలు కందాన్ని నిస్సంకోచంగా ప్రయోగించారు. దూకుడుగా సాగినట్టు అనిపించినా ప్రథమార్థ పాదంలోని చివరి గురువు వల్ల కందం వేగం తగ్గి రాగాలాపనకు వీలు కలిగింది.

'ప్రహ్లాద చరిత్రము' యక్షగానంలో ప్రహ్లాదుని తల్లి లీలావతి తన కొడుకును బుజ్జగిస్తూ, తండ్రి మాట వినమని, శ్రీహరి నామస్మరణ మానుమని చెప్పిన సందర్భంలో కందార్థాలను సమయోచితంగా రచించడం జరిగింది.

కం. బాలుడ ప్రహ్లాదుడ యిక
చాలించర విష్ణుభక్తి సరసము తోడన్
మేలెంచు ధనుజనాథుని
మ్రోలను నిలుచుండి నీవు ముద మలరంగా!
రాక్షస విద్య పదవీచేలంగా
కథనమందున్న మహా ఘనుడవై దివిజుల
మదమణిచే విద్యను మరివేగా చదవరా

కం. అమ్మరో వినువేగంబున
సమ్మతి లేనట్టి మాట సత్యంబగునే
ముమ్మారు ఎంత చెప్పిన
నమ్మను నీ మాట నేను నళిన దళాక్షీ!
నారాయణని మరువ మీనాక్షి

చలమెంత జేసిన సామీకే దెలుసు
కులమేల స్థలమేల గురువులెందుకు తల్లి

ద్వితీయార్థంలోని యతిస్థానం దగ్గర నుండి మూడు నాలుగు పాదాల రాగమాలిక ఒకటి కందాన్ని అనుసంధానించుకుని వస్తుంది. ఈ రెండిటిని కలిపి కందార్థంగా ప్రయోగించడం జరిగింది. ఈవిధంగా కందమేగాక రాగ, లయానుగుణంగా పరుగులు తీసే దరువులను కలిపి కందార్థాలను యక్షగానంలో ప్రవేశపెట్టారు.

శబ్దాలంకారాలు

తెలంగాణ యక్షగాన సాహిత్యంలో శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు సమయోచితంగా ప్రయోగించబడ్డాయి. ప్రాసానుప్రాసలు పద్యాలలో, గేయాలలో గుప్పించి, కృతకాలంకారాలు సృష్టించి యక్షగానాలు నిర్మించడం, యక్షగాన రచన ప్రారంభమైన దశ నుండి కూడా కనిపిస్తుంది. అర్థం మీద కన్నా శబ్దం మీదనే ప్రత్యేక దృష్టి పెట్టి కొనసాగించిన రచనలు కూడా లేకపోలేదు. శబ్దాన్ని ఆశ్రయించేవి శబ్దాలంకారాలుగా, అర్థాన్ని ఆశ్రయించేవి అర్థాలంకారులుగా పరిగణింపబడతాయి. కొన్ని అనుప్రాస అలంకారాలను ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

'విజయ విలాసం' అనే యక్షగానంలో అర్జునుని మోహించిన ఊర్వశి, అతని వెంట పడగా అర్జునుడు తిరస్కరించే సందర్భంలోని సంభాషణ.

ఊర్వశి : నెట్టబోకు వొట్టునీకు పట్టు నా కొంగు/ పట్టుబట్టి బిగదట్టి మన్మథుని/ గట్టినట్టి భూపాల చెయ్యి పట్టకున్నను తాళ

ఈ గేయ పంక్తులలో ద్విరుక్తటకారము వృత్త్యనుప్రాస అలంకారంలో గిలిగింతలు పెడుతుంది.

అదేవిధంగా 'రుక్మిణి కళ్యాణం' యక్షగానంలో శ్రీకృష్ణునిపై అనురాగం పెంచుకున్న రుక్మిణిని అతనికే ఇచ్చి చేయడానికి తండ్రి భీష్మరాజు సమ్మతించగా అన్న రుక్మి మాత్రం చెల్లెల్ని, తన స్నేహితుడైన శిశుపాలునికి ఇవ్వడానికి ఇష్టపడతాడు. ఆ సందర్భంలో జరిగిన సంభాషణలో భాషా పటాటోపం కనిపిస్తుంది.

రు. పగమాను కోజాల మగువ నివ్వజాల/ ఏ దేశమున రాజులు చెప్పినా గాని ఇక నేను వినజాలను/ వింటివా జనక గంటి వేమనక తుంటరి వాడు/ మన జంటాకు సరియౌనా

భీ. శ్రీలక్ష్మి రమణుడు బాల శ్రీకృష్ణుడై/ లీలలు జూయించెరా పావన జగదీశ్వరుడని పించెరా/ శ్రీనివాసుడు మనుజేశ్వరుడై/ యాదవమణి కులమున జన్మించెన్

రు. శంకరవిభుండు పంకజనాభుండు/ మంకు గొల్లడవ్వునా/ కృష్ణుండు తాను అంతా ధన్యుండాయెనా/ పరమాత్ముడైతే గొల్లభామల ఇండ్లల్లో / చేరిరతికేళి కూడి చరించెను

పైన ఉదహరించిన సంవాదాలలో ఒక్కొక్క దానిలో ఒకటి రెండు హల్లులు ఎక్కువ పర్యాయాలు వచ్చాయి. మొదటి పంక్తిలో గకార, టకారాలు రెండవ దానిలో లకార, శకారాలు మూడవ పంక్తిలో కకారం ఆవృతమై వీనుల విందును కలిగిస్తాయి.

మాండలిక భాష

యక్షగానాల్లోని మాండలిక భాష తెలంగాణ అంతటా ఒకే విధంగా ఉండదు. ఒక మండలంలో కనిపించే పదాలు మరొక మండలంలో భిన్నంగా ఉన్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ఆయావృత్తుల పాత్రలను నాటకంలో ప్రవేశపెట్టినపుడు కావాలనే ఈ పదాల్ని ప్రయోగించి రచన చేయడం జరిగింది. వాటిలో కొన్ని పదాలు మాత్రమే ప్రస్తావిస్తాను.

"బేరాలు, గద్దరించి, బండమాట, దొడ్లోకి, ముత్తెమంత, బేరంబులాడ, ఇవ్వాళను, కొంబోయెనో, బుగులు, ఆత్రం, తుమ్మమొద్దు, ముర్కితనువు, పప్పుపలారము, పోరలు, గల్లోల్లం, కడుపు జేసుకున్న, అన్నెం పున్నెం, దెంకెల్లి వచ్చిరి, ముండమోపు, అద్దమ్మ రాతిరి, జెర్ర సేపాయనండి, బింకమణచి, గుంజెదను, మందలించు, రద్ది బుద్ధి, గొంతు బిసికి, చిల్లులు చిల్లులు గాబొడచి, బుక్కవెట్టిపాయె, ఒక్కగుద్దుకె సంపుతాను, సాటియారాండ్లు, లొట్టెదంత కల్లు, నాజోలికి రాకు, తోలుకపోవుట, తటుక్కున, లెంకుట, ముండకొడక, నిమ్మలముగ, కుట్టుపట్టుట, జగడం, పైత్యం, జిద్దు....."

ఈ మాటలకి పదాలు యక్షగానాల్లో ఆయా సందర్భానుగుణంగా నిక్షిప్తమైనవి. వెలికిదీస్తే ఇంకా ఎన్నో లభిస్తాయి. ఈ పదాల్లో కొన్ని ఆ మండలానికి పరిమితం కావడం వెనుక ఉన్న సామాజిక, వ్యవసాయక పరిస్థితులను తెలియజేస్తాయి. అంతేగాక వీటి మీద ఉన్న అన్య భాషా ప్రభావాన్ని చారిత్రక దృష్టితో అందజేస్తాయి.

అన్య దేశ్యాలు

తత్సమ, తద్భవ, దేశ్యాల మాదిరిగానే అనేక చారిత్రక సామాజిక కారణాల వల్ల తెలుగు సాహిత్యంలో అన్యదేశ్యాలు చోటు

ISSN 2457-0796

చేసుకున్నాయి. భాష కావ్యభాషగా పరిణామం చెందిన దశలో గ్రంథాలలో చోటు చేసుకున్న అన్యదేశ్యాలు అవి తెలుగుపదాలే అన్నంతగా కలిసి పోయాయి. సంస్కృత, తమిళ, కన్నడ, మలయాళం కూడా తెలుగులో చోటు చేసుకున్నాయి. తెలంగాణ జిల్లాలపై శాసనపరంగా అధికారం చలాయించిన ఉర్దూ భాషా పదాలు గ్రంథాలలో ప్రవేశించి అన్యదేశ్యాలుగానే పరిగణింప పడుతున్నాయి. అయితే ఉర్దూ భాష పదాలు ఎక్కువగా మనకు కనిపిస్తాయి.

బాలనాగమ్మ యక్షగానంలో మాయల ఫకీర్ పాత్ర సంభాషణలు దాదాపుగా ఉర్దూ మాటలతోనే పలికించడం విశేషం. ఆ గేయ పంక్తులలోని పదాలు తెలంగాణ పల్లె ప్రజల వ్యవహారికంలో మాట్లాడుతూ సులభంగా అర్థమయ్యే భాషాపదాలు. పాత్రపరంగా, సందర్భోచితంగా మాయల ఫకీరు తాను అపహరించి తెచ్చి పరిచారికగా మార్చిన 'సంగు' అనే మహిళతో పలికిన మాటలు.

ఫకీరు : సంగు సంగు భంగు లావొ/ భంగు పై అంగార్ లావొ/ బోషిడి పులావ్ లావొ / పొట్టేలు మాంసం కలుపుకొని..

సంగు : అయ్యా తెస్తి అడిగినట్లు తిట్టబోకు సాయబు

భంగు అనగా గంజాయి చుట్ట కాల్చుకోవడానికి, అంగార్ అనగా నిప్పుతెమ్మని, తినడానికి పలావ్ పొట్టేలు మాంసంతో తీసుకురమ్మని ఆజ్ఞాపించడం. పరిచారిక సంగు వినయంతో తీసుకొస్తానని తెలుగులో సమాధానం ఇవ్వడం పాత్రోచిత సంభాషణకు నిదర్శనం.

"అజీ మహరాజ్, మీకీ జోహార్, అభీతక్, షహర్, బడాఖుషీ, ఏక్ మాట, బులాయా, జల్ది, శానా శానా, సలాంలేకుం, రాణిసాబ్, మతలబు, తయ్యార్, బొమ్మన్, కామూష్, గడ్బడ్, బంచోత్, తహసిల్దార్, సిరస్తాదార్, పోతేదార్, మాసుల్దార్, సుబేదార్, మన్నెదార్, దేశ్ ముఖ్, ఢంకా, నిషానీ, హజారో, పైదల్, దిల్మేఖుషీ, ఖబర్దార్, ఇజాబ్, బంటుల్కి, ఖజానాఖాళీ, అబే ఉల్లుకే పట్టే, సీదాబోల్, కిస్వాస్తే, మియ్యాసాహెబ్, బహద్దూర్, తెల్లకాగజ్, బడేబడే.."

అనేక యక్షగానాల్లో కనిపించే ఈ పదాలన్నీ ఉర్దూభాష తెలుగు మీద వేసిన ప్రభావాన్ని తెలియజేస్తాయి.

ముగింపు

యక్షగానాలు ప్రప్రథమంగా ఎటువంటి వ్యాకరణ భద్రత లేకుండా ఒక ఆటవిక జాతివారి జానపద కళారూపంగా వెలుగు చూసింది. క్రమంగా ఒక కథాగేయ ప్రక్రియగా, పరిణామ వికాసంలో సంవాదం, దరువులు, కీర్తన పద్ధతిలో రచనలు కొనసాగాయి. వీటితో పాటు ద్విపదలు, కందములు మొదలైన దేశి ఛందస్సులు చోటు చేసుకున్నాయి. జానపదుల కథాగానాల్లో సంగీతం, సాహిత్యాల కన్నా భావ ప్రకటన పట్ల శ్రద్ధ చూపుతారు. వీటిలో కథాక్రమం, కథలో సందర్భానుసారంగా వచ్చే పాత్రను బట్టి రచనా విధానం, భాష మారుతుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక వికాసానికి తోడ్పడిన తెలంగాణ యక్షగానం పండిత పామరులను అలరించింది. ఆ భాషా సౌందర్యాన్ని, మాధుర్యాన్ని నేటితరం కొంతైనా ఆకలింపు చేసుకుంటే, తెలంగాణ వారసత్వ కళారూపాన్ని ఆస్వాదించి, ఆనందం పొందేటట్లు భావితరాలకు అందించ గలుగుతారు.

ఆధార గ్రంథాలు

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర., ఎస్వీ జోగారావు
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర., సురవరం ప్రతాపరెడ్డి
3. తెలంగాణలో యక్షగానం రచన -ప్రయోగం., పొద్దుటూరి ఎల్లారెడ్డి
4. భక్త ప్రహ్లాద యక్షగానం
5. రుక్మిణి కళ్యాణం యక్షగానం
6. బాలనాగమ్మ యక్షగానం

❖ ❖ ❖ ❖ ❖

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.



సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

నల్లగొండ జిల్లా దళిత నవలా సాహిత్యం – వస్తు విశ్లేషణ

ఎడ్ల మహేశ్, తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 913 341 2673

పరిచయం

రాసినోడిదే చరిత్ర అన్నట్టుగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో గత 125 ఏళ్లుగా కొందరు చెప్పిన విషయాలే, నిఖార్సైన నిజాలుగా చలామణిలో ఉన్నాయి. సింహాలు తమ చరిత్ర తాము రాసుకోనంత వరకే గుంజనులు చెప్పే కాకమ్మ సోది కబుర్లు పాఠ్యపుస్తకాలై, పోటీపరీక్షల్లో ప్రశ్నలై వెలుస్తాయి. ఇప్పుడు సోయి తెచ్చుకుని తెలంగాణ తన మూలాలను తాను తవ్వుకుంటుంది. అందులో దొరికిన ఆణిముత్యాల్ని వెలుగులోనికి తెస్తున్నది. దేశి భాష నుండి అచ్చ తెలుగు వరకు ఆ తరువాత అనేక సాహిత్య ప్రక్రియలకు పురుడు పోసింది తెలంగాణే. పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'ముంగిలి' వెలువరించేంతవరకు తెలంగాణ సాహిత్యానికి, తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు లేదు. ఈ 'ముంగిలి', 'మత్తడి' గ్రంథాలలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నట్లయితే తెలంగాణ సాహిత్య ప్రతిభ, గరిమ అర్థమవుతుంది.

తెలంగాణ నవలా చరిత్రను కూడా ఇదే విధంగా రికార్డు చేశారు. విశాలాంధ్ర వారైతే వట్టికోట ఆళ్వారుస్వామి 1955లో వెలువరించిన 'ప్రజల మనిషి' నవలే, తొలి తెలంగాణ నవలగా ప్రచారంలోనికి తీసుకువచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదని సాహిత్యకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన నవలా వికాసాన్ని కుదించినట్లయితే, తమ ప్రాంతానిదే పైచేయి అవుతుందని వలసాధిపత్య ఆలోచనయ్యిండొచ్చు.

తెలంగాణ నవలా సాహిత్యాన్ని చూసుకున్నట్లయితే ఇక్కడి నుండి విరివిగానే నవలలు వెలువడ్డాయి. **"నిజానికి మొట్టమొదటి తెలుగు నవల రాసింది తెలంగాణ బిడ్డ. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ తాలుకా బేతవోలుకు చెందిన తడకమల్ల కృష్ణారావు రాసిన 'కంబుకందర చరిత్ర' మొట్టమొదటి నవల. ఈ నవల 1866 లో వెలువడింది. అయితే ఈ విషయాన్ని మరుగున పరిచి 1872లో వెలువడ్డ నరహరి గోపాలకృష్ణశెట్టి రాసిన 'రంగరాజ చరిత్ర' తొలి తెలుగు నవలగా ప్రచారం చేశారు. అంతకు ముందు కందుకూరు వీరేశలింగం రాజశేఖర చరిత్ర (1878) తొలి నవలగా చాలా కాలం చలామణి అయ్యింది."** (శ్రీహరి, రవ్వా. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, (సంప). పుట–114).

ప్రాంతాల మధ్యనే కాక, చరిత్ర కలిగిన సాహిత్యాన్ని కూడా వెలుగులోనికి రానీయకుండా కుట్ర జరిగిందని దీనిని గమనిస్తే అర్థమవుతుంది. సాహిత్య పరిశోధకులు, మేధావులు ఈ అంశాలను లోతుగా పరిశీలన చేయకపోయి ఉంటే అబద్ధమే నిజమని నమ్మేవారు. అందుకే తెలంగాణ మేధావులు నిజాన్ని నిగ్గు తేల్చి, భవిష్యత్ తరాలకు అందించడం ఒక వరంగా భావించాలి. ఈ గ్రంథాలు అలభ్యం అంటే అదీ కాదు. కేవలం కొందరి పక్షపాత, మంద బుద్ధికి ఇది నిదర్శనం.

మారిన పరిస్థితుల్లో కొత్త అస్తిత్వాలను, తమ ఉనికిని వెతుక్కునే క్రమంలో నల్లగొండ జిల్లాలో అనేక నవలలు వచ్చాయి. దళిత జీవన చిత్రీకరణ, అది పోరాట రూపం తీసుకునే క్రమాన్ని ఈ నవలలు వర్ణిస్తాయి. నల్లగొండ జిల్లాలో చైతన్యం భౌతిక పరిధిని దాటి బౌద్ధిక పరిధికి విస్తరించిందని చెప్పవచ్చు. కులం ప్రాతిపదికగా ఏర్పడిన భారత సమాజంలో వర్గ ప్రాధాన్యం కన్నా, కుల ప్రాధాన్యతను గుర్తించాల్సి ఉంటుందనే చైతన్యం పాదుకున్నది.

అయితే నల్లగొండ జిల్లా నవలా సాహిత్యంలో వచ్చిన వస్తువులను గురించి పరిశీలన చేస్తే విభిన్నమైన వస్తువులు మన కళ్ల ముందుంటాయి. నవలలు రాసే విషయంలో నల్లగొండ జిల్లా దళిత నవలా రచయితలు ముందంజలోనే వున్నారు. నా పరిశోధన పరిధిని దృష్టిలో ఉంచుకొని నా పరిశీలనకు వచ్చిన నవలల్ని ఇక్కడ పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను. దానితో పాటుగా కొన్ని నవలల్లో ఉన్నటువంటి వస్తువును గురించి ఈ వ్యాసంలో విశ్లేషణ చేస్తాను. 2000 – 2019 మధ్య కాలంలో నల్గొండ జిల్లా నవలా రచయితలు, ఈ ఇరవై ఏళ్ళలో 7 గురు రచయితలు సుమారుగా 15 నవలలు వెలువరించారు. వారిలో బోయ జంగయ్య రెండు (జగడం, పుట్టుమచ్చ), వేముల ఎల్లయ్య రెండు (కక్క , సిద్ధి), కదిరె కృష్ణ ఒకటి (పొద), భూతం ముత్యాలు ఐదు (సూర, పురుడు, ఇగురం, మొగలి, మా లచ్చువమ్మ), గడ్డం మోహన్ రావు ఒకటి (కొంగవాలు కత్తి), కడియం డేవిడ్ ఒకటి (అతడు అబ్రహం), గుండెపంగు వరకుమార్ మూడు (మైల, నేను బానిసనా (పోలీసు దు:ఖం), ఊరవతల) వంటి నవలలు వెలువరించారు.

నల్లగొండ జిల్లాకు చెందిన దళిత రచయితలు రాసినా వారి నవలల్లో ప్రధాన వస్తువు అంటరానితనం, వివక్ష, అసమానతలు, అవమానాలు, ఛీత్కారాలు, వెనుకబాటుతనం మొదలైన ఇతివృత్త నేపథ్యంతో వచ్చినవే. ప్రధానంగా ఈ పత్రంలో ఒక ఐదు నవలల్ని తీసుకొని వాటిలో ఉన్నటువంటి వస్తువు విశ్లేషణ చేసే ప్రయత్నం చేస్తున్నాను.

సిద్ధి నవల (2014) – వస్తు విశ్లేషణ (వేముల ఎల్లయ్య)

సిద్ధి నవల నల్లగొండ జిల్లా భాషలో రాయబడి, మాదిగ సంస్కృతి, గ్రామీణ దళితులపై అగ్రవర్ణాల దాడులు, మత మార్పిడుల

వాస్తవాలను ప్రతిబింబిస్తుంది. దళిత స్త్రీ చైతన్యాన్ని వాస్తవికంగా చూపుతూ, అణచివేత, అవమానం, అంటరానితనం కారణంగా కొందరు మతం మార్చుకునే పరిస్థితిని వివరించింది. కథానాయకి సిద్ధి భర్త పాపయ్య నిరక్షరాస్యుడు. గ్రామ పటేల్ మతమార్పిడి చేసుకున్న కుటుంబాలపై దాడులు చేయించి, జాతర పేరుతో ఆధిపత్యం చూపిస్తాడు. సిద్ధి కుమారుడు సైదులు చదువు పూర్తి తర్వాత సమాజ సేవకుడిగా ఎదుగుతాడు. ఇది దళిత స్త్రీ జీవనంలో కష్టాలను, అగ్రకులాల ఆలోచన తీరును వ్యతిరేకిస్తూ రచించిన నవల. ఒక దళిత మహిళను ప్రధాన వస్తువుగా చిత్రీకరించిన నవల. గ్రామాల్లో దొరలు, పటేళ్లు తమ అధికారాన్ని ప్రదర్శింపజేయడం కోసం చిన్న కులాల మధ్య కుంపట్లు పెట్టి మళ్లీ ఆయనే పరిష్కారం పేరుతో పెద్ద మనుషుల్లా వ్యవహరించి ఇద్దరికీ శిక్ష విధిస్తాడు. ఖర్చు కింద పంచాయతీకి కొంత పైకం చెల్లించమనే విధానాన్ని చూపించారు. ఇందులో గ్రామ భౌగోళికం, దళిత కుటుంబాల్లోని సమస్యలు, మూఢనమ్మకాలు, మతమార్పిడులు విపులంగా చెప్పారు వేముల ఎల్లయ్య.

పొద నవల(2010)- వస్తు విశ్లేషణ (కదిరె కృష్ణ)

పొద నవల కులవ్యవస్థను అబద్ధమని, అది దళిత, బహుజన కులాలకు మిగిల్చిన గాయాలను తేటతెల్లం చేస్తుంది. అగ్రవర్ణ ఆధిపత్యం, నిమ్నజాతులపై వివక్ష, చాంధసవాదం, కులాల మధ్య చిచ్చుపెట్టడం, విద్యా ప్రాముఖ్యత, ఐకమత్యం వంటి అంశాలు ప్రధానంగా వచ్చాయి. కులాల చరిత్ర, ఈ దేశ మూలవాసుల జీవితం, బ్రాహ్మణుల ప్రవేశం, మనుధర్మశాస్త్రపు బానిసత్వం వంటి విషయాలు వివరించబడ్డాయి. ఈ నవల దళితుల విముక్తికి మరియు పూలే, అంబేద్కర్ వంటి నేతల భావజాలం, అనుసరణను ప్రోత్సహించింది. చదువు ప్రాముఖ్యతని, దాని వలన కలిగే ప్రయోజనాలను వివరించి చెప్పే నవల. కులాలు ఎలా ఏర్పడ్డాయో కూడా వివరంగా తెలియచెప్పిన నవల. తెలంగాణ గ్రామాల్లోని నిమ్న కులాల జీవితాలను ఆవిష్కరించారు. ఇది చదువుతుంటే దళితులు ఎంత దుర్భరమైన జీవితాలను గడిపారో తెలుస్తుంది. మన పూర్వీకులు కనికరం లేని కాలంలో జీవనం సాగించారనే బాధ తన్నుకొస్తుంది.

సూర నవల(2004)- వస్తు విశ్లేషణ (భూతం ముత్యాలు)

సూర కథ దళిత విద్యావంతుడు సూరని చుట్టూ తిరుగుతుంది. పట్నంలో చదువుకున్న తర్వాత సూరడు పల్లెకీ వచ్చి పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో పాఠశాలలు నెలకొల్పి ప్రజలకు విద్యా చైతన్యం కల్పిస్తాడు. వర్ణాంతర వివాహం చేసుకుని, మూఢనమ్మకాలపై పోరాడతాడు. గ్రామాల్లో ఉన్న భూతవైద్యం, చేతబడి, పసరు మందులు, మాయమాటలు, బలిపూజలు వంటి అంధవిశ్వాసాలపై యువతలో అవగాహన కల్పించి నిర్మూలించడానికి కృషి చేస్తాడు. గో బ్యాక్ టు ది విలేజెస్‌ని సమర్థించే దిశగా నవల రచన సాగడం కథా వస్తువుకు బలాన్ని చేకూర్చింది. సూర నవలలో అంబేద్కర్ సిద్ధాంతాన్ని, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళతాడు. దళితుల స్థితి గతులను, వారి ఆహారపు అలవాట్లను, సంస్కృతి సంప్రదాయలను చిత్రించింది. రచయిత భూస్వాముల, పెత్తందార్ల నియంతృత్వ పోకడలను కళ్ళకు కట్టినట్లుగా చూపించారు.

ఊరవతల నవల (2019)-వస్తు విశ్లేషణ (గుండెపంగు వరకుమార్)

ఊరవతల నవల మాదిగ వృత్తిదారుల జీవనాన్ని ఆవిష్కరించింది. ఆధునీకరణ వల్ల వృత్తులు కోల్పోయిన దళితులు జీవనోపాధి కోసం కొత్త మార్గాలు వెతుక్కోవాల్సిన పరిస్థితిని చూపింది. బిచ్చం పాత్ర ద్వారా నిజాయితీ, కష్టపడి బ్రతకడం, కులాంతర, మతాంతర వివాహాల ప్రోత్సాహం, అంబేద్కర్ భావజాలం ప్రాధాన్యత చిత్రించబడ్డాయి. గూడెం నుంచి ఊరుగా మారిన సమాజ జీవన మార్పును వివరించింది. ఇందులో బిక్షం పాత్ర ద్వారా దళితుల సమస్య, వారిలోని అనైక్యత, ఈర్షబుద్ధి, ఆశ్రిత కులాల స్థితిగతులు అంబేద్కర్ భావజాలాన్ని చిత్రించారు. మాదిగ దానిలో ఉపకులాలైన బైండ్ల, డక్కలి, చిందు కులాల వారి జీవితాలను వర్ణించారు. దళితుల్లో కుడా కులాల వారీగా అసమానతలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు. సమానత్వం అనేది ఉపకులాలను దగ్గరికి తీసుకున్నప్పుడే వస్తుందని తద్వారా దళితులంత ఏకమైన తిరుగుబాటు బావుటా ఎగురవేయాలని నవల తెలుపుతుంది.

జగడం నవల (2003)- వస్తు విశ్లేషణ (బోయ జంగయ్య)

జగడం దళితుల ఆత్మగౌరవం, అంబేద్కర్ భావజాలంపై ఆధారపడిన రాజకీయ నవల. రాజం అనే కథానాయకుడి జీవిత ప్రయాణం, అవమానాలు, కష్టాలు, విద్యా సాధన, నిజాయితీ, సమాజసేవ ప్రధానాంశం. జోగిని వ్యవస్థను విమర్శిస్తూ, దళిత స్త్రీలపై పెత్తందారుల లైంగిక దోపిడీ, ప్రభుత్వ నిర్లక్ష్యం, విముక్తి మార్గాలను ప్రస్తావించింది. రాజం, జోగిని విమలను వివాహం చేసుకుని సమానత్వ భావనను ఆచరణలో పెట్టాడు. సామాజిక పరిస్థితుల చిత్రీకరణకు రచయిత ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. సామాజిక, సాంఘిక రంగాలలో ప్రభావితం చేసే విధంగా దళితుల ఆత్మగౌరవాన్ని చిత్రించిన నవల జగడం. బోధించు, సమీకరించు, పోరాడు అనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భావజాలం పునాదిగా రాజయ్య అనే దళిత వ్యక్తి రాజం అనే మహోన్నత వ్యక్తిగా, శక్తిగా పొందిన పరిణామ క్రమమే ఈ జగడం అని రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి జగడం నవల ముందుమాటలో వివరించారు.

ముగింపు

ఈ నవలలు అన్నీ దళితుల జీవితాల వాస్తవాలను, గ్రామీణ శోషణ, కులవ్యవస్థ, మతమార్పిడులు, మూఢనమ్మకాలు, వర్ణాంతర

వివాహాలు, మహిళా అణచివేత, విద్యా ప్రాముఖ్యత, ఐకమత్యం వంటి అంశాలను ప్రతిబింబిస్తాయి. రచయితలు వాస్తవిక చిత్రణతో పాటు అంబేద్కర్ భావజాలం, సామాజిక మార్పు అవసరాన్ని హృదయపూర్వకంగా ప్రస్తావించారు.

ఉపయుక్త గ్రంథసూచి

1. అంజయ్య పున్న, 1991. నీలగిరి కవుల సంచిక. నల్లగొండ జిల్లా కవులు రచయితలు. చందూరు : సాహితీ మేఖల.
2. ఎల్లయ్య, వేముల. 2014. సిద్ధి. హైదరాబాద్ : ప్రజాశక్తి బుక్ హౌస్
3. కృష్ణ, కదిరె. 2010. పొద. హైదరాబాద్.
4. చెంచయ్య వి, 2017. సాహిత్యంలో వస్తు రూప శిల్పాలు. తిరుపతి: అభినవ ప్రచురణలు.
5. జంగయ్య, బోయ. 2003. జగడం. నల్లగొండ
6. ముత్యాలు, భూతం. 2004. సూర. నల్లగొండ : గుంపు సాహితీ సంస్థ.
7. వరకుమార్, గుండెపంగు. 2019. ఊరవతల. సూర్యాపేట : గుండెపంగు సాహితీ సంస్థ.

కొండ

డా. ఎన్. గోపి

ఫోన్ : 939102 8496

ఆ ప్రాంతాని కంతటికీ
అదే ఒక కొండ
వంద గ్రామాల ప్రజలు
అది మా కొండే అనుకుంటారు

మనం దానివైపు నడుస్తుంటే
అది మనకు ఎదురొచ్చి పలకరిస్తుంది
మిత్రుడు మాకు సముద్రముంది
మీకేముంది అన్నాడు

విర్రవీగకు
అది గడ్డ కడితేనే
ఇది ఏర్పడింది అన్నాను
సముద్రం మేఘాలను పైకి విసిరేస్తే
వాటిని జాగ్రత్తగా కాపాడి
వర్షం కురిపించేది మా కొండే

యాభై ఏళ్ల తర్వాత వెళ్తే
నన్ను గుర్తుపట్టి పలకరించింది
నా కళ్లకు గంతలు కట్టండి
దాని వీపు మీద స్వారీ చేస్తాను
నాకు కవిత్వం నేర్పింది కొండే
సృష్టి కాలం నుంచి
అదక్కడే ఉంది
దానికి చెవి ఆనించి వింటే
ప్రాక్తన సంగీతం వినిపిస్తుంది

కొండకు గుండె ఉంది
దాని కన్నీటి చారలు
ఇప్పటికీ కనబడుతాయి
పొద్దున్నే కొండ దర్శనమైతే
సూర్యున్ని చూసినట్టే
కొండా! కొండా!
ఎప్పటికీ నువ్వే మా అండ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

ఐతరేయోపనిషత్తు (ముత్యాల సరాలలో...)

జక్కని వేంకటరాజం

(గత సంచిక తరువాయి భాగం)

ద్వితీయాధ్యాయము

పితృశరీరము నందు రేత
స్సుగను జీవుడు మొదలు నుండును
దేహమందలి అవయమ్ముల
సారమేయది యగుచునున్నది

అట్లు జీవుడు మొదట పురుషుని
వీర్యమందున నుండ గలిగియు
తల్లి గర్భము జేరగానది
మొదటి జన్మమ్మగుచు నున్నది

స్త్రీకి గర్భమునందు చేరిన
వీర్యమొక అంగమ్మ తనకగు
గాన స్త్రీయే గర్భమందలి
పిండమును పోషించుచుండును

గర్భమును రక్షించు తల్లిని
కూడ రక్షణ చేయవలయును
తల్లి గర్భము నుండి పుట్టిన
జీవునికది ద్వితీయ జన్మము

జన్మమొందిన పుత్రుడే తన
తండ్రి జేసిన పుణ్య కర్మల
ప్రతినిధుల తానుండ వలయును
తండ్రి వార్ధక్యమ్ముతో మర -

ణించి మరలను జననమొందును
ఇట్టి జననము కొడుకు దేహము
తోడ నుండగ జరుగగా - ఆ
జీవునికది తృతీయ జన్మము.

గర్భమందున నున్న యపుడే
వామదేవ మహర్షి తలచెను
'వాక్కు మొదలగు దేవతల జ
న్మమ్ము గూరిచి తెలిసికొంటిని.

నేనెఱుంగుదు నెన్నొ జన్మల
చేతనుడ నేనగుట వలనను
ఇపుడు ఈ సంసార బంధము
నుండి విడుదల యగుచు నుంటిని'.

వామదేవుండిట్లు తెలిసియు
జడ శరీరము నుండి వెడలెను
స్వర్గమందున సకల భోగము
లనుభవించెను, ముక్తి నొందెను.

తృతీయాధ్యాయము

ఇతడు పరమేశ్వరుడని మనము
ఎవరి నారాధించవలయును?
జీవుడెవ్వని మూలముగ - రూ
పమును చూచును, శబ్దమును విను?

గంధమును నాసికతొ వాసన
జూచుచుండును, వాక్కు బల్కును?
జిహ్వతోడను రుచులు దెలియును
ఎట్టివాడా పరమ పురుషుడు?

పరమపురుషుని ఉనికి లేకను
జీవుడా విషయమ్ము లెంతయు
నింద్రియమ్ములతోడ నెరుగడు
అంత ఆ ఈశ్వరుని కరుణయె!

మనసులో జ్ఞాన, మజ్ఞా
నములు, విజ్ఞానమును, ప్రజ్ఞా
నమును, మేధయు, దృష్టి, ధృతియును
మతియు, బుద్ధియు, జాతి, స్మృతి, సం-

కల్పము, క్రతువు, అసువు, కామము
లన్నియును జీవాత్మ కంగము
లగుచు నంతఃకరణములుగా
యుండి వృత్తులు చేయుచున్నవి.

అన్నియును జీవాత్మ కంగము
లగుచునున్నను మనసు లోపల
చక్కగా పరమేశ్వరునికిని
నామధేయములగుచునున్నవి.

దేవతాత్మకములగు ఇంద్రియ
ములును, ప్రత్యక్షములగు పంచ
భూతములు, అంతటను గల పురు
గులును, ఇతరములైన అండజ -

ములు, జరాయువు నుండి జన్మించు
ప్రాణులు మున్నగునవి మరియును
స్వేదమందున కలుగు ప్రాణులు
వృక్షములు, గుల్మములు, గోవులు

పురుషులును, గజమ్ములును, జంగమ
ములును, పక్షులు, స్థావరమ్ములు
అన్నియును పరమేశ్వరుని ఆ
ధారముగానె గలవిగ అతని -

యందునుండిన వగుచు నున్నవి
లోకములు నడిపించునది ప్ర
జ్ఞాన రూపము బ్రహ్మమే యది
గొప్పనగు నన్నింటి కంటెను.

జీవుడెఱిగియు నిట్టి విధముగ
సర్వకామమ్ములను బొందియు
విడిచి దేహము ముక్తుడై తను
మృత్యు రహితుండగుచు నుండును.

ఐతరేయోపనిషత్తు సమాప్తము.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (15) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

నన్నయ మహాభారతంలో శ్రామిక జన ప్రస్తావన

డా. బూర్ల చంద్రశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కరీంనగర్. ఫోన్ : 98495 82926

పరిచయం:

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికులితిహాసమనియు
పరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిగొనియాడుచుండ..."
(శ్రీమదాంధ్రమహాభారతం - ఆది -1- 32)

ఇలా వ్యాస మహాభారతంలో నన్నయ దర్శించినట్లుగానే, నన్నయ రచించిన మహాభారతంలో పండితులందరూ పై విధమైన అంశాలనెన్నింటినో దర్శించారు. ఇంకా దర్శిస్తూనే ఉన్నారు. నన్నయ మహాభారతాన్ని ఆధునిక కోణంలో చూసినా ఎన్నో జీవితానికి ఉపయోగపడే విషయాలు ఇప్పటికీ కనడుతాయి. అలాగే సాహిత్యానుశీలనం చేస్తే కూడా భాషా, సాహిత్యపరమైన అంశాలెన్నో చూడవచ్చు. అంతే కాకుండా చారిత్రక విషయాలైన వివిధ ప్రదేశాలు, వ్యక్తులు, సంఘటనలే కాకుండా భౌగోళిక, సహజ వనరులకు సంబంధించిన నదులు, పర్వతాలు, మొదలగు ఎన్నో ఆసక్తికర విషయాలు మనకు కనిపిస్తాయి.

మహాభారతం చదివినప్పుడు నాకు పైన తలిపిన విషయాలే కాకుండా శ్రమ, శ్రామిక సంబంధమైన విషయాలు, పదాలు, సందర్భాలు కనిపించాయి. కాకపోతే బహుస్వల్పంగా ఉన్నాయవి. అలాంటి కొన్ని విషయాలు ఈ వ్యాసంలో ప్రస్తావించదల్చుకున్నాను.

మానవ జీవితానికి ముఖ్యమైనవి కూడు, గుడ్డ, గూడు. ఈ మూడు ఉత్పాదక శక్తుల నుండి సమకూరేవే. కాని ప్రాచీన తెలుగు సాహిత్యంలో వీటి గురించిన ప్రస్తావన కాని, వీటికి సంబంధించిన జీవిత విశేషాలు కాని పరిపూర్ణంగా లభించినట్టు కబడడం లేదు. దానికి ఏ కారణమైనా ఉండవచ్చు కాని వారి చరిత్ర లిఖితం కాలేదన్నది అక్షరసత్యం. కావ్యాలలో అక్కడక్కడ కొన్ని శ్రామికులకు, శ్రమకు సంబంధించిన ఛాయలు కనబడుతాయి. మహాభారతంలో ఆదిపర్వంలో చేనేతపని వారి గురించిన ప్రస్తావన కనబడుతుంది కాని అది ఆధ్యాత్మిక విషయ బోధనగా మాత్రమే తెలుస్తుంది.

"అని యిట్లురగపతుల సితాసిత తంతు సంతాన పటంబు ననువయించుచున్న వారినిద్దఱ స్త్రీలను, ద్వాదశార చక్రంబుం బరివర్తించుచున్న వారి నార్వుర గుమారుల..."

(అర్థం : తెల్లని నల్లని దారాలతో కూడిన వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు స్త్రీలు, 12 ఆకులు గల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు కుమారులను చూశాడు). (శ్రీమదాంధ్రమహాభారతం-ఆది-1- 108).

ఉదంకుడు తెస్తున్న కుండలాలను తక్షకుడు తస్కరించి నాగలోకం వెళ్లగా, అతన్ని వెంబడిస్తూ ఉదంకుడు నాగలోకం వెళ్లిన సందర్భంలో పై సన్నివేశం అతనికి కనబడుతుంది. ఇందులో వస్త్రాన్ని నేసే నేత శ్రామికులు కనడుతారు. అలాగే దారాలు, వస్త్రం, 12 ఆకుల చక్రం మొదలగు చేనేత పనివారి వస్తువులు, పరికరాలు కనబడుతాయి. అయితే వాటికి అర్థం నన్నయ ఆధ్యాత్మికపరంగా వేరే చెబుతాడు కాని ఇక్కడ చేనేత పనికి సంబంధించిన విషయ ప్రస్తావన ఉన్న దనేది ముఖ్యం.

అలాగే సభాపర్వంలో మయుడు పాండవులకు మయసభ నిర్మించి ఇచ్చినప్పుడు, ఆ సభాప్రవేశ కార్యక్రమానికి అనేక మంది మహర్షులు, రాజులు వస్తారు. అప్పుడు నారదుడు కూడా వస్తాడు. ధర్మరాజు నారదున్ని సాదరంగా ఆహ్వానించిన సందర్భంలో, నారదుడు ధర్మరాజును కుశల ప్రశ్నలు వేస్తాడు. ఈ ప్రశ్నల ద్వారా ఒక పరిపాలనాదక్షత గలిగిన రాజుకు ఉండవలసిన లక్షణాలు ఏంటో మనకు తెలుస్తాయి. దాదాపుగా 30కి పైగా ప్రశ్నలు అడుగుతాడు నారదుడు. అందులో రాజకీయ, ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాలే ఎక్కువ. ఈ ప్రశ్నల్లో కొన్ని ప్రజలకు, ఉద్యోగులకు, రైతులకు, అనాథలకు, వృద్ధులకు సంబంధించినవి ఉంటాయి వాటిని చూద్దాం.

ధర్మరాజును విశ్వాసపాత్రులైన మంత్రులను, సైన్యాధ్యక్షులను నియమించుకున్నావా అంటూ ప్రభుత్వోద్యోగుల ప్రస్తావన తెస్తాడు నారదుడు.

"ఉత్తమ మధ్యమాధమ నియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ భృత్యకోటికి ననూనముగా దగు జీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయికాలము దప్పకుండన్."
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 37)

అని వ్యక్తుల వ్యక్తిత్వాన్ని బట్టి, విజ్ఞాన స్థాయిని బట్టి ఉత్తమ, మధ్యమ, అధమ యోగ్యతలు తెలుసుకొని వాళ్ళను ఉత్తమ, మధ్యమ, అధమ స్థానాల్లో (పదవులు) నియమించావు కదా. వారికి సకాలంలో జీతాలిస్తున్నావు కదా అని అంటాడు. ఒకవేళ జీతాలు సకాలంలో ఇయ్యకపోతే...

"తమతమ కనియెడు తరి జీ
తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దములేని వాని కవ
శ్యము నెగ్గొనరించు నతడు శక్రుండైనన్."
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 38)

అని ఉద్యోగులు తిరగబడుతారని, సేవకుల సుఖ దు:ఖాలను పట్టించుకోని దేవతల రాజైన దేవేంద్రుడికి కూడా తిప్పలు తప్పవని పై పద్యంలో చెబుతాడు. అంటే ఇక్కడ రాజోద్యోగులు ఆర్థికంగా, మానసికంగా హాయిగా ఉన్నప్పుడే పరిపాలన సజావుగా సాగుతుందనే విషయం సుబోధకం. అందులో ముఖ్యంగా శ్రామికులను ఆర్థికంగా హింసిస్తే అది రాజుకే మంచిది కాదనే పరోక్ష హెచ్చరిక ఉన్నట్టు తెలుస్తుంది. ఇది నేటికి ప్రభుత్వానికి, ఉద్యోగుల మధ్య నిత్యం కనిపిస్తున్న విషయమే. అంతేకాక శ్రామికులకు అప్పుడప్పుడు ప్రోత్సాహక బహుమతులు, సత్కారాలు కూడా ఇవ్వాలని అప్పుడే రాజభక్తి కలిగి, రాజుపై అధిక విశ్వాసముంచి, రాజుకోసం ప్రాణాలకు తెగించి యుద్ధంలో పోరాడుతారని తెలుపుతాడు. (కులభృత్యులైన ... సత్కారమర్థితో చేయుదే?)

"అనఘా నీ ప్రస్తవమున
నని నీల్గిన వీరభటుల యనుపోష్యుల నె
ల్లను బ్రోతె భోజనాచ్ఛా
దనముల వారలకు నెమ్మి దఱుగక యుండన్."
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 40)

అలాగే యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలను కూడా పోషిస్తున్నావా లేదా?, ఆహారానికి, ఆర్థికానికి లోటు లేకుండా చూసుకుంటున్నావా అని అడుగుతాడు. ఇది ఒక దూరదృష్టి ఉన్న రాజుకుండవలసిన ముఖ్యలక్షణం అని నారదుని పాత్ర ద్వారా చెప్పిస్తాడు కవి. ఒకవేళ ప్రజలు సంతుష్టులు కాకపోతే, పేదరికంలో మగ్గితే, రాజు పీఠానికే ముప్పు అని పరోక్షసందేశం. నేటికాలపు జి.డి.పి., ద్రవ్యోల్బణం మొదలగు విషయాలు, కారణాలు సూచిస్తున్నట్లు తెలుస్తుంది. దీనిని బట్టి ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వ కాలంలోనే కాదు రాజరికపు కాలంలో కూడా ఈ శ్రామికాందోళన భయం ఉందని తెలుస్తుంది. ఉద్యోగ పెంక్షన్, నేటి రేషన్, వృద్ధాప్య పెంక్షన్, కుటుంబ పెంక్షన్ పథకంలాగా ఇది అనిపిస్తుంది. ఇప్పటికీ యుద్ధంలో మరణించిన వీర సైనికులకు పరంవీరచక్ర, అశోకచక్ర సత్కారాలు చేస్తూ, వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పిస్తుంది ప్రభుత్వం. సంక్షేమ ప్రభుత్వ భావన ఇలాంటివన్ని దృష్టిలో పెట్టుకొనే దేశాలు రాజ్యాంగం రచించుకుంటా యని తెలుస్తుంది. వెయ్యి సంవత్సరాల క్రితం ఉన్న రాజకీయ, ఆర్థిక, పరిపాలనా శాస్త్రాలు నేటికి ఎలా ఉపయోగపడుతున్నవో మహాభారతంలోని ఈ సందర్భం ద్వారా తెలుస్తుంది.

"హీనులగు కర్షకులకును
భూనుతధాన్యంబు బీజములు వణిజులకున్
మానుగ శతైకవృద్ధిన
నూనముగా ఋణములిత్తె యుత్తమ బుద్ధిన్."
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 44)

ఇక్కడ హీనులగు కర్షకులు అని తెలపడంలో పేదవారైన రైతులు అని తెలుస్తుంది. అంటే ఆ కాలంలో కర్షకులలో సన్నకారు రైతులు, మోతుబరి రైతులు అని రెండు రకాలవారున్నారని మనం ఊహించ వచ్చు. కడుపేద రైతుకు కూడా విత్తనాలు సరఫరా చేయడం, తద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, వణిజులకు (Businessmen) ఋణాలిచ్చి వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం రాజుకు అనివార్యం అని పై పద్యం ద్వారా తెలుస్తుంది. వ్యవసాయం, వ్యాపారం రెండూ రాజ్యానికి మూల స్తంభాలనే ఆర్థిక సూత్రం ఇక్కడ మనకు తెలుస్తుంది.

పంగుల మూకాంధుల విక
లాంగులను నబాంధవుల దయం బ్రోతె? భయా
ర్తుం గడిఁది శత్రునైనను
సంగరరంగమునగాతె శరణం బనినన్.
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 45)

కుంటివాళ్ళను, మూగవాళ్ళను, గుడ్డివాళ్ళను, అంగవిహీనులను, అనాథలను పోషిస్తున్నావా! అని ధర్మరాజును నారదుడు అడుగుతాడు. ఆనాటి కాలంలో యుద్ధాలు ఎక్కువగా ఉండేవి కనుక యుద్ధంలో గాయపడ్డ లేదా అవిటివాళ్ళయిన వాళ్లకు చేయూతనివ్వడం రాజు ధర్మం అని తెలుస్తుంది. అలాగే యుద్ధంలో మరణించిన వారి కుటుంబ పోషణ చూసుకోవడం కూడా రాజు బాధ్యత అని 'అబాంధవులు' అనే పద ప్రయోగం వల్ల తెలుస్తుంది. అనాథ అని

ఈ పదానికి అర్థం. నేటి కాలపు వృద్ధాశ్రమాలు, వికలాంగుల ఆశ్రమాలు, అంధుల పాఠశాలలు, వీళ్ళకు ఇచ్చే పెన్షన్ల లాగానే అప్పుడు కూడా వీరిని చూసుకోవడానికి ఒక వ్యవస్థ ఉండేదని తెలుస్తుంది. ఆ వ్యవస్థలన్నీ బాగుంటేనే రాజు బాగుంటాడని, రాజ్యం బాగుంటుందని నిగూఢమైన అర్థం కనబడుతుంది. రాజు కోసం, రాజ్యం కోసం, ప్రజల కోసం పనిచేసే వారికి, వారి కుటుంబం ఎప్పుడూ భద్రంగా ఉంటుందనే భావంలో ఉండేవారని తెలుస్తుంది.

కృత మెఱిఁగి కర్త నుత్తమ
మతుల సభల సంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుదె? కృత మెఱిఁగెడు
పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించున్.
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 46)

నేటి సమాజంలో మంచి పనులు చేసిన వారిని గుర్తించి, వారికి అవార్డులు, రివార్డులు ప్రదానం చేయడం ఆనవాయితీ. ఇది ఆ కాలం నుండే ఉంది అని తెలుస్తుంది. పై పద్యంలో పనిలో శ్రేష్ఠత కలిగిన వారిని గుర్తించి, వారికి కృతజ్ఞతా పూర్వకంగా బుద్ధిమంతుల సభలో సన్మానం చేస్తున్నావా లేదా అని ప్రశ్నిస్తున్నాడు. అంటే కృతజ్ఞత ప్రకటించడం కూడా, అందులో పదిమందిలో ప్రకటించడం కూడా రాజు ముఖ్య కర్తవ్యం అని భావించవచ్చు. అప్పుడే సమాజం కోసం, రాజు కోసం పనిచేయడానికి మిగతావారు కూడా ముందుకు వస్తారు కదా. అలాగే వారికి ఇచ్చిన పనుల్లో శ్రేష్ఠతను చూపిస్తారు. తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

ఆయంబునందు నాలవ భాగమొండె
మూఁ డవ భాగమొండె, నం దర్ధమొండె
గాని మిక్కిలి సేయఁగాదు వ్యయం బని
యవధరించితె బుద్ధి నవనినాథ!
యాయుధాగారధనాధ్యక్ష్యములయందు
వరవాజివారణావళులయందు
బండారములయందుఁ బరమవిశ్వాసుల
భక్తుల దక్షులఁ బంచితయ్య?
గురుల వృద్ధశిల్పివరవణి గ్బాంధవ
జనుల నాశ్రితులను సాధుజనులఁ
గరుణఁ బేదఱికము వొరయకుండఁగఁ బ్రోతె
సకలజనులు నిన్ను సంస్తుతింప.
(శ్రీమదాంధ్రమహాభారతం - సభ -1- 47)

రాజ్యానికి వచ్చే ఆదాయం ఎంత శాతం ఖర్చు చేయాలో చెబుతూనే, గురువుల్ని, వ్యాపారుల్ని, బంధువుల్ని, సజ్జనుల్ని పేదరికంలోకి వెళ్లకుండా చూసుకునే బాధ్యత కూడా ఉంటుంది అని చెబుతాడు. దీనిని బట్టి మేధావుల్ని, శాస్త్రవేత్తల్ని, దేశాభివృద్ధికై ఆర్థిక లావాదేవీలు జరిపే వారిని, సమాజ శ్రేయస్సును కాంక్షించే వారిని ప్రభుత్వమే పోషించాలి, ప్రోత్సహించాలి అనే భావం కనబడుతుంది. ఒకవేళ వారిని పట్టించుకోకపోతే దేశంలో పేదరికం పెరిగిపోతుందని, పేదరికం వల్ల దేశం సంక్షోభంలోకి వెళుతుంది అని గుర్తు చేస్తున్నాడు. నేటికీ మనం ప్రపంచంలో మేధావుల్ని,



ప్రజల్ని పట్టించుకోని దేశాలు ఎంత అధోగతికి చేరాయో చూస్తూనే ఉన్నాం. ప్రపంచ స్థాయిలో నేడు మనం BPL (Below Poverty Line) గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో, భారతదేశం పూర్వకాలంలోనే దేశంలో పేదరికం ఉండకూడదు అనే భావనను సాహిత్యం ద్వారా ప్రచారం చేసిందంటే ఎంతో గర్వకారణంగా అనిపిస్తుంది.

ఇలా ధర్మజుని, నారదుని సంభాషణల ద్వారా నన్నయ ఎన్నో గొప్ప విషయాలు మనకందించాడు. అలాగే అరణ్యపర్వంలో సురభి దేవేంద్రుని సంవాదంలో కూడా కర్షక జీవితానికి సంబంధించిన కొన్ని భావనలు కనబడతాయి.

...బలంబు గల బలీవర్దంబులతో బలహీనంబులయిన వానిం బూన్చిన నవి దుర్వహభారవహన మహాలాంగలాకర్షణంబుల యం దసమర్థంబు లైన నడిచియుం బొడిచియు ములుకోలలం గుట్టియు దుర్బలబలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద... (శ్రీమదాంధ్రమహాభారతం - అరణ్య -1- 84)

ఎద్దులు కాడికట్టడం, నాగళ్లతో పొలాలు దున్నడం, ఎద్దులను ముల్లుగర్రతో పొడవడం మొదలగు విషయాలతో పాటు పశువుల పట్ల సానుభూతి, జీవకారుణ్యం ఉండాలనే భావం కనిపిస్తుంది.

అలాగే ద్రౌపది ధర్మరాజు సంభాషించుకునే సందర్భంలో ధర్మరాజుకు కర్తవ్యం గుర్తు చేస్తూ, నువ్వు గింజలో నూనె ఉన్నా మనిషి ప్రయత్న పూర్వకంగా సాధించకుంటే రాదని తెలుపుతూ,

కడు నిమ్ముగా దున్ని బీజములు సల్లి కర్షకుం దున్నc
దడయక వర్షంబు గురిసి కావించుc దత్ఫలసిద్ధి
నడుమc బర్జన్యుc దనుగ్రహింపనినాc డేమి సేయుc
గడcగి చేయంగలవానిc జేయును గాక కర్షకుcడు.
(శ్రీమదాంధ్రమహాభారతం - అరణ్య -1- 235)

రైతు పొలం దున్ని విత్తనాలు వేసినంత మాత్రాన సరిపోదు దానికి వర్షం కురిస్తేనే ఫలసిద్ధి కలుగుతుంది. రైతు కేవలం మేఘుడినే నమ్ముకుని ఉండలేడు కదా, తన ప్రయత్నం తాను చేస్తాడు కదా, అలాగే నీవు చేయవలసింది అని అంటుంది. కర్మలను వీడి స్తబ్దంగా ఉండకూడదని రైతును ఉదాహరిస్తూ చెబుతుంది. కర్షకుని కున్న నిష్కామ కర్మ భావన ఆదర్శమనే ఇక్కడ తెలుస్తుంది. ఈ పద్యంలో రెండు చోట్ల కర్షకుడు అనే పదం వాడాడు నన్నయ.

...నే నయోధ్య కరిగి నీ కఱపిన పలుకు లెల్ల ఋతుపర్ణుసభం బలికిన నొక్క పురుషుండు కుఱుచచేతులవాcడు ఋతుపర్ణునొద్ద నూఱుగద్యాణంబుల జీవితంబువాcడు...

(శ్రీమదాంధ్రమహాభారతం - అరణ్య - 2 - 159)

నలదమయంతుల కథా సందర్భంలో అయోధ్య రాజైన ఋతుపర్ణుని దగ్గర నలుడు నూరు గద్యాణాల (నాణేలు) జీతానికి ఉద్యోగం చేస్తున్నట్టు తెలుస్తుంది. దీని వల్ల అప్పుడు పని చేసేవారికి జీతభత్యాలు నాణేల రూపంలో చెల్లించేవారని తెలుస్తుంది.

'గిరినిరరములc బుట్టిన
సరోవరం బిదియు సర్వసామాన్యముగా
కరుదుగ నొక్కని యదియే?
పరcగc గుబేరుండు దీనిc బడసెనె మొదలన్?
(శ్రీమదాంధ్రమహాభారతం - అరణ్య - 3 - 364)

పై పద్యం ద్రౌపది భీముడిని సౌగంధికా కమలాలని తీసుకురావాలని చెప్పిన సందర్భంలోనిది. రాచరిక కాలంలో (Monarchy) ఉన్న భీముడి మాటల్లో ప్రజాస్వామ్య భావనలు (Democratic), ఆర్థిక భౌతిక వాదం, పెట్టుబడిదారీ వ్యతిరేక భావనలు ఉన్నాయా అన్న భావన కలుగుతుంది. భీముడు సౌగంధికా కమలాలను తేవడానికి అరణ్యంలో సహజంగా ఏర్పడి, కుబేరుని ఆధీనంలో ఉండే కొలనుకు వెళ్తాడు. అక్కడ ఆ కొలనుకు రక్షణగా ఉన్నవారు, కుబేరుని అనుమతితో పువ్వులను తీసుకోవాలి అని చెబుతారు. అప్పుడు భీముడు 'సహజ వనరులు అందరివి అవి ఏ ఒక్కరి సొత్తు కాదు. ఎవరైనా వాటిని అనుభవించవచ్చు. అంతేకానీ వాటిపైన ఎవరికి ఆధిపత్యం లేదు' అని నిక్కచ్చిగా చెబుతాడు. ఈ మాటలు కర్షక, శ్రామిక, సమసమాజ, సామ్యవాద భావనలలాగా అనిపిస్తాయి.

ముగింపు :

ఇంకా ఇలాంటి భావనలే కాక, అక్కడక్కడ ఉత్పత్తి కులాలవారు, సామాన్య ప్రజలు వాడుకునే వ్యావహారిక పదాలను కూడా చూడవచ్చు. ఉదాహరణకు ప్రొద్దువోక, ఎల్లప్రొద్దు, ప్రోలు, లాంగలి మొదలగు గ్రామీణ కర్షక జీవితానికి సంబంధించిన ఎన్నో పదాలు మనకు కనబడుతాయి. ఇవేకాక ఆధునిక ప్రపంచ పరిపాలన సంబంధమైన ఎన్నో శాస్త్రాలకు తీసిపోని భావనలు, లౌకిక సంబంధమైన ఎన్నో విషయాలు మనం నన్నయ మహాభారతంలో చూడవచ్చు. వివిధ రంగాలలో ఉన్న జిజ్ఞాసులకు, పరిశోధకులకు ఆకరగ్రంథం ఇది. ఇందులో నుండి అవసరమున్న విషయాలను స్వీకరించి వ్యక్తిగత, సామాజికాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. సుబ్రహ్మణ్యం, జి.వి.(సంపాదకులు) 2008. 'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్రమహాభారతము' (1,2,3,4.) ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానము, తిరుపతి.

2. www.andhrabharati.com

❖ ❖ ❖ ❖ ❖

ఆలోకనం

(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (19) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

తెలంగాణ జాతికి పట్టుగొమ్మ – బతుకమ్మ

యం. సంతు, పరిశోధక విద్యార్థి, కాశీహిందూ విశ్వవిద్యాలయం, వారణాసి. ఫోన్ : 709 519 3082

క్రీ.పూ. 3 వేల సంవత్సరాల కాలంలో ఉత్తర భారతాన హరప్పా, మొహంజొదారో నాగరికతలు విస్తరించిన కాలంలో దక్షిణ భారతాన ఆదిమ మానవుడు కొత్త, పాత రాతియుగంలో ఉన్నాడని చరిత్ర పరిశోధకులు నమ్ముతున్నారు. తెలుగువారు నివసిస్తున్న ఈ ప్రాంతం, అత్యంత ప్రాచీన కాలంలో జనవాస యోగ్యంగా లేదు. అగ్నిపర్వతాల మయమైనదని తెలుస్తోంది. రామాయణ కాలం నాటికి దండకారణ్యంతో అవతరించబడినదని చారిత్రకుల భావన. వ్యాస భారత కాలం నాటికి ఆంధ్రులు దక్షిణాపథవాసులుగా ప్రసిద్ధి పొందారని చెప్పవచ్చు. ఐతరేయ బ్రాహ్మణము నందలి శునశ్శేపుని కథలో ఆంధ్రజాతి పేర్కొనబడటమే నిదర్శనము. మహాభారత సంగ్రామంలో ఆంధ్రులు, కళింగులు యుద్ధంలో పోరాడారని, ఆ తరువాత పాండవుల వంశజుడైన జనమేజయుని ఆగ్రహానికి గురియై, వింధ్యను దాటారని తెలుస్తుంది. వీరిలో వింధ్యను దాటిన ఆంధ్రులు తెలంగాణ ప్రాంతంలో స్థిరపడ్డారని తెలుస్తోంది. భారత, భాగవత పురాణాలు గ్రంథరూపం దాల్చిన ఇదే కాలంలోనే బౌద్ధయుగం కొనసాగింది. బౌద్ధ యుగంలో ఈ దేశానికి మంజీర దేశమనియు, వజ్రదేశమనియు, నాగ భూమి అనే పేర్లుండేవి. నేటి తెలంగాణా ప్రాంతంలో నిజామాబాద్ జిల్లా గుండా ప్రవహిస్తున్న గోదావరి నది ఉపనదియైన మంజీరా నది పేరు మీదగా ఈ ప్రాంతాన్ని "మంజీరా దేశంగా" వ్యవహరించబడి యుండవచ్చు. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామాల్లో ప్రసిద్ధ శివలింగాలు ఉన్నందున ఆంధ్రదేశం త్రిలింగ దేశంగా త్రిలింగ శబ్ద సంకేతంతోనే ఇక్కడి ప్రజలు తెలుగువారిగా పిలువబడుతున్నారని పండితుల అభిప్రాయం. ఆర్యులు రాక ముందు మన తెలుగుగడ్డపై నాగజాతి వారు నివసించే వారిని విశ్వసనీయంగా చెప్పుకో వచ్చు. ప్రాచీన బౌద్ధగాథల్లో ఆంధ్రదేశాన్ని నాగభూమిగా వర్ణించారు. నేడు కోయభాష మాట్లాడే ఆదిమవాసులు ప్రాచీన నాగవంశాల వారి వారసులే అని టేకుమళ్ళ రామచంద్రరావు గారు కోయల ఆచార వ్యవహారాలన్నీ, తెలుగు వారివే అని నిరూపించారు. అలా నేటి తెలంగాణలోని తెలుగు లేదా తెనుగు కులస్థులు జీవిస్తున్నారు.

జానపద కథా గేయాల్లో ఈ తెలుగు లేదా తెనుగు కుల ప్రసక్తి అధికంగా ఉంటుంది. శ్రీకృష్ణుడు, పరమశివుడు కూడా ఈ కుల పురాణాల్లో తెలుగు కులస్థుల వేషాన్ని ధరించి పండ్లను అమ్మేవారని ఒక నానుడి. ఈ తెలుగు కులస్తులు బ్రాహ్మణులలో ఒక శాఖ వారు. వారి పేరుతో ఈ ప్రాంతీయులను "తెలగాణ్యులు" గా ఈ ప్రాంతం తెలంగాణగా పిలవబడుతుందని చెప్పడం సబబు. అలా కొన్ని శతాబ్దాలు రాజులు, నవాబులు పాలించిన తర్వాత తెలంగాణ అస్తిత్వాన్ని ఉద్యమ పోరాట స్ఫూర్తిని ప్రజల ఆత్మాభిమానాన్ని గెలిపిస్తూ, దశాబ్దం ముందు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. నేటి జిల్లాల తెలంగాణ, బంగారు తెలంగాణ దిశగా అడుగులు మొదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సాధనలో బతుకమ్మ జనబాహుళ్యాన్ని కదిలించి, ఆడించి, పాడించి అందరిని ఒక్కదాటిపై నిలిపి ఊరూరా – వాడవాడలా దేశప్రజలకు తెలంగాణ ఘనతను విస్తరించింది. తెలంగాణ గల్లీ నుండి రాజధాని ఢిల్లీ దాకానే కాదు, ప్రపంచ నలుదిశల తెలంగాణ ప్రజల ఆకాంక్ష తేటతెల్లమయ్యేలా చేసింది. ఈ ప్రాంత సంస్కృతీ, సంప్రదాయాలకు పట్టుకొమ్మగా బతుకమ్మ నిల్చిందనడం నిస్సందేహం. అందుకే బతుకమ్మ తెలంగాణ ప్రజల బతుకు చిత్రమై, భవిష్యత్తరాలకు స్ఫూర్తి ప్రదాత్రియై, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ, భారతజాతి సమైక్యతానినాదానికి, ప్రాంత వేదికగా తెలంగాణ అలరారుతున్నది.

'ఒక స్పష్టమైన ఆలోచన విధానాన్నీ, ఆచరణను తెలియజేసేది ఆచారం' మానవుల నిత్య జీవితంలో అలవాటుగా చేసే పనులు, ఆ పనుల్లో అంతర్లీనమైన నియమాలు, తరతరాలుగా జన సమూహంలో కుదురుకున్నాయి. ఈ నమ్మకాలు, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు ప్రతిఫలింపజేసేవే పండుగలు. ఇది మొదట ప్రకృతి ఆరాధనతో ప్రారంభమై, వ్యవసాయ, సంస్కృతితో సమ్మేళనం చెంది, రానురాను కాలగమనంలో మరింత విస్తృత స్వరూపాన్ని సంతరించు కున్నాయి. తమ పూర్వీకుల జీవితానుభవాల్ని స్మరిస్తూ, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని రేకెత్తించేవిగా పండుగలు ఈనాడు పరివర్తన చెందాయి. నేడు ప్రజలు ఈ వేడుకలను ఆచరించటం ద్వారా, భావి తరాల కందజేయస్తున్న సాంస్కృతిక రీతులు, వాటి విశిష్టతలు, ప్రత్యేకతలు, అనూచాన ఆచార – వ్యవహారాలకు ప్రతీకలు. ప్రతి జాతికి సంస్కృతి, సంప్రదాయ ఆచారాలకు సముచిత స్థానాన్ని సుస్థిరం చేయడానికి ఇదొక ఆలంబన. ఇది ఒక తరం నుండి మరొక తరానికి

సంక్రమింపజేసే సామాజిక జీవన సమ్మిశ్రితం. ఈ కోవకు చెందిన సంప్రదాయ, సాంస్కృతిక జీవన ప్రతిఫలనమే బతుకమ్మ పండుగ. ఈ పండుగ ప్రపంచంలో మరెక్కడనూ దర్శించలేము. ఒద్దికగా పువ్వులను పేర్చి, బతుకమ్మగా/ గౌరమ్మగా రూపొందించి పూజించే సంస్కృతి భారతదేశంలో ఒక్క తెలంగాణకు మాత్రమే సొంతం.

బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలు

బ్రతుకు+అమ్మ = బ్రతుకమ్మ. బ్రతికించే అమ్మ కాబట్టి బ్రతుకమ్మ అయ్యిందని లేదా బ్రతికిన అమ్మ బ్రతుకమ్మ అయ్యిందని ప్రజల నానుడి. బ్రతుకమ్మ అనే పదం వ్యవహారంలో "బతుకమ్మగా" మార్పు చెంది, ప్రజలు బతుకమ్మను లక్ష్మీదేవిగాను, పార్వతిగాను, పేరంటాలమ్మగాను, సాహస వనితగాను భక్తి శ్రద్ధలతో ఆరాధన చేస్తున్నారు.

బతుకమ్మ పుట్టుక గురించి మన పురాణ సంబంధ గ్రంథాలలో గౌరీ దేవి – మహిషాసురుణ్ణి వధించి, అలసి సొలసి "ఆశ్వీజ శుద్ధ పాద్యమి" నాడు స్పృహ కోల్పోతుంది. ఆమె స్పృహ నుండి తేరుకోవడానికి స్త్రీలందరూ దేవిని బ్రతుకమ్మ అని ప్రార్థిస్తూ భక్తి పాటలతో అత్యంత శ్రద్ధతో వేడుకుంటారు. అలా దశమి రోజున దేవి స్పృహ నుండి తేరుకుంటుంది. దేవి పునర్జన్మించిందనే ఆనందంతో భక్తులు ఆట పాటలతో సందడి చేశారు. ఆనాటినుండి ఆమెను బతికిన అమ్మ "బతుకమ్మ" గా ప్రజలు కొలుస్తున్నారు. ఆమె స్పృహ కోల్పోయిన తొమ్మిది రోజులు ఆమెను స్మరిస్తూ పూలతో ఆమె ప్రతిరూపాన్ని నిర్మించి, శ్రీచక్ర రూపంగా ధ్యానిస్తూ, భక్తి శ్రద్ధలతో, మహిళలు బృందాలుగా రూపొంది ఆనందకకరమైన, ఆటపాటలతో, నృత్యాలు చేస్తూ గౌరీ రూపాన్ని పూల బతుకమ్మతో పండగ చేసుకోవడం, నాటి నుండి నేటి వరకు తెలంగాణ ప్రాంతంలో సంప్రదాయ పూర్వక ఆచారంగా కొనసాగుతోంది.

మరొక కథనం ప్రకారం శ్రీచక్రోపాసన అనేది సర్వోత్కృష్టమైన శక్త్యారాధన విధానాల్లో ఒకటి. శ్రీ చక్రం త్రిపుర సుందరి ప్రతిరూపంగా భావించి పండిత ప్రకాండులు కొలుస్తుంటారు. సామాన్య మానవులకు కూడా ఆరాధించే అదృష్టాన్ని కల్పించడానికి శ్రీచక్ర రూపంలో బతుకమ్మను పూర్వీకులు తయారు చేసుంటారనే పండితుల అభిప్రాయం.

శ్రీచక్రంలోని మేరు ప్రస్తారం బతుకమ్మ ఆకారాన్ని పోలి ఉంటుంది. మేరు ప్రస్తారం సహస్రారంవలెనే, బతుకమ్మ వలయాకారంగా తయారుచేసి, పోను పోను తగ్గుతూ, కొండ శిఖరం వలె రూపొందిస్తారు. అలా బతకమ్మను పేర్చడానికి రకరకాల రంగురంగుల పూలను ఉపయోగిస్తారు. శిఖర భాగాన గౌరమ్మగా అలంకరణ చేస్తారు. మూలాధారం నందలి శక్తిని సహస్ర కమలమందలి సదాశివునితో సమాగమింపచేయడం ఆధ్యాత్మిక భావనకు సంకేతం. కుండలినీ యోగంతో, విశేషమైన శక్తిని గౌరమ్మగా నిలబెట్టడం బతుకమ్మ తయారీలోని అంతరార్థం. పసుపుతో తయారు చేసిన గౌరమ్మను బ్రతుకమ్మ పై స్థానంలో ఉంచి పూజించే విధానం శ్రీచక్ర పూజకు బతుకమ్మకు రూపాంతరమని భావించడమే బతుకమ్మ ఆరాధనకు మూలసూత్రం. శ్రీచక్రంలోని కుండలినీ యోగ విశేషశక్తి బతుకమ్మ/ గౌరమ్మకు ప్రతిరూపం. తెలంగాణ మహిళలందరూ గౌరమ్మను లక్ష్మీ, సరస్వతీ మాతలకు ప్రతిరూపాలుగా భావించి పసుపు కుంకుమలతో ఆరాధిస్తూ, భక్తి పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో బతుకమ్మ అని వేడుక చేసుకుంటారు.

బతుకమ్మ పుట్టుకను భారతీయ జానపద కథలు చూసినట్లయితే **"బతుకమ్మ పేరంటాలుగా"** చిత్రించబడింది. పూర్వం ఒక కుటుంబంలో దంపతులకు పుట్టిన పిల్లలు పురిటిలోనే చనిపోయారట. అలా చనిపోతూ చివరి ఏడవ సంతానం బ్రతికి బట్టకట్టడంతో అమ్మాయికి దంపతులు "బతుకమ్మ" అని నామకరణం చేశారు. తదనంతరం వారికి ఒక కుమారుడు కూడా జన్మించాడు. ఆ పిల్లలు ఇద్దరు పెరిగి పెద్దయ్యారు. బతుకమ్మ వివాహం జరిగిన కొద్ది రోజులకే ఆమె తల్లిదండ్రులు చనిపోవడంతో బతుకమ్మ, తమ్ముడి ఆలన పాలన చూసుకునుటకై తన పుట్టింటికి వచ్చి స్థిరపడింది. అలా కొన్ని మాసాల తర్వాత, ఒకనాటి తెల్లవారు జామున బతుకమ్మ మరదలుతో కలిసి చెరువు స్నానానికి వెళ్ళింది. అక్కడ వేగంగా వేసిన గాలికి ఇద్దరి చీరలు కలిసిపోయాయి. ఒకరి చీరలు మరొకరు కట్టుకున్నారు. పొరపాటు తెలుసుకున్నప్పటికీ బతుకమ్మ తన చీర ఎందుకు కట్టుకున్నావని అడిగి నిలదీసినందుకు, కోపగించిన మరదలు బతుకమ్మ గొంతు నులిమి చంపి, మృతదేహాన్ని చెరువుగట్టున పాతిపెట్టి వెళ్ళిందనేది జానపదుల కథా సారాంశము. బతుకమ్మ ఆ రాత్రి తన భర్త కలలో కనిపించి, పుట్టింటి నుండి తనను తీసుకొని పొమ్మని వేడుకొనడంతో, భర్త చెరువును సమీపించేటప్పటికి, సాయంకాలమై చీకట్లు అలుముకున్నాయి. అప్పటికే అక్కడ కొత్తగా మొలిచిన తంగేడు చెట్టును, దాని పువ్వులను చూసి అతడు ఆశ్చర్యమొందాడట. భార్య కోసం తంగేడు పువ్వులను త్రెంపబోవగా పాపిష్టి మరదలు నన్నిక్కడ పాతి పెట్టిందని జరిగిన వృత్తాంతాన్ని అదృశ్య రూపంలో తెలియజేసింది. ఆ ఊరివారందరూ ఆమెను గౌరమ్మేనని భావించారు. ప్రతి సంవత్సరం తంగేడు పువ్వులతో తనను బ్రతుకమ్మగా పేర్చి, గౌరమ్మతో పాటు పూజించి నీటిలో విడిచి పెట్టాలని కోరడంతో, భర్త ఆమె కోరికలన్నింటినీ ముత్తైదువుల ద్వార తీర్చటం మొదలెట్టారు. కాలక్రమంలో బతుకమ్మ పుట్టింటి వారి వంశం నాశనమైంది. నిర్వంశమైంది. ఈ అంశాలన్నీ మహాభారతంలోని శర్మిష్ఠ దేవయానుల కథలో సామ్యత ఉందని కొందరు జానపదుల కథల్లో ప్రచారం. వాస్తవానికి మహాభారతంలో

దేవయాని, శర్మిష్ఠలను కాలక్రమంలో యయాతి మహారాజు వివాహం చేసుకుంటారు. వీరు ధరించే వస్త్రాలు పొరబాటున తారుమారు అవడమనే సామ్యత ఈ జానపద గాథకు దోహదమైనదేమో కాబోలు!

బతుకమ్మ ఆకృతిని పువ్వులతో ప్రతిష్ఠించడం

మహిషాసురమర్దిని భీకర స్వరూపిణి అయినా దేవిని బతుకమ్మ నవరాత్రుల సమయంలో తెలంగాణకు చెందిన మహిళలందరూ, సుకుమార సౌందర్యమైన పువ్వులను ఒకే దగ్గర అందంగా పేర్చి, గీత నృత్యాలతో ఆరాధించే విధానమే బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల మేలుకొలుపుకు సాకారం. బతుకమ్మ పండుగ వచ్చిందంటే తెలంగాణలోని గడప - గడప ఆనందోత్సాహాలతో, కేరింతలతో సంప్రదాయ పోకడలతో కలకలలాడుతూంటుంది.

బతుకమ్మ పండుగ ప్రారంభం ఆశ్వయుజ ప్రతిపత్తుకి ముందు వచ్చే **"పితృ అమావాస్య/ మహాలయ అమావాస్య"** రోజున పేర్చెడి బతుకమ్మ **"ఎంగిలిపూల బతుకమ్మగా"** సంభావిస్తుంటారు. అలా ప్రారంభమైంది మొదలు, వరుసగా వచ్చే తొమ్మిది రోజులూ, ఒక్కొక్క పేరుతో బ్రతుకమ్మను పేర్చి ఆరాధిస్తుంటారు. చివరి రోజున **"సద్దుల బతుకమ్మ"**ను పూలతో పేర్చడంలో యువతులు ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన కళా నైపుణ్యాలతో గౌరీదేవిని బతుకమ్మ పేరుతో తీరొక్క పూలతో అమ్మను చూడముచ్చటగా పేరుస్తారు. బతుకమ్మ పండుగ నాటికి ప్రకృతి అంతా ఆకర్షణీయ పూలమయంగా ఉంటుంది. అడవుల్లో, చెలకల్లో, పంట చేలల్లో దొరికే రంగురంగుల పూలను ఇత్తడి పళ్ళాల్లో గానీ, గుమ్మడి ఆకులను క్రింద పరచిన వెదురుసిబ్బిలో కానీ ముత్యాల పూలు, గునుగు పూలు, కట్లపూలు, ఎర్రతంగేడు, పసుపు పచ్చ తంగేడు పువ్వు, బంతి, చామంతి, మందార, జిల్లేడు వంటి పూలను భక్తితో సేకరించి బతుకమ్మను పేర్చడంలో స్త్రీ అలంకరణ కళానైపుణ్యం వ్యక్తమవుతుంది.

బతుకమ్మను పేర్చడంలో తంగేడు పువ్వుకు ప్రథమ స్థానం కల్పించడం ఒక విశేషం. బతుకమ్మ తంగేడు పువ్వుగా మారిందన్న ప్రత్యేకత ఇంతకు ముందే చర్చించుకున్నాం గదా! బతుకమ్మను త్రికోణాకారంలో ఉన్న పూలగోపురం వలె, ఆకృతిలో గౌరమ్మ రూపాన్ని శ్రీచక్రాకారంలో రూపొందించి, పై శిఖర భాగంలో పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ఉంచి, వత్తి పత్తిని బతుకమ్మకు నాలుగువైపుల అలంకరణతో పాటు బతుకమ్మను జంటగా పేర్చడం తెలంగాణ సంస్కృతిలో అనూచానంగా వస్తున్న ఆచారం. వాటిలో పెద్దది తల్లి బతుకమ్మ, చిన్నది పిల్ల బతుకమ్మగా పేర్చడంలో ఒక అంతరార్థాన్ని గమనించాలి. ప్రతి తల్లి తమ పిల్లలు తన పక్కనే ఉండాలనే తపన మాతృ హృదయ కాంక్షకు నిదర్శనం. అదే విధంగా గౌరమ్మను సాగనంపుతూ 'వడిబియ్యం' కలిపి సద్దులు కట్టడం

తెలంగాణ ప్రత్యేక సంప్రదాయానికి అద్దం పడుతుంది. బిడ్డను మెట్టినింటికి పంపేటప్పుడు బిడ్డతో పాటు ఆడబిడ్డకు కానుకలు పంపడం ఆనవాయితీగా ఉంది. అలా మొదలైన సంప్రదాయం తెలంగాణలో ప్రతి కుటుంబంలో పెళ్ళైన స్త్రీకి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి 'వడిబియ్యం' పోయడం తెలంగాణ ప్రాంత ప్రత్యేక ఆచారం. తెలంగాణ యువతులు బతుకమ్మను పేర్చడంలో స్త్రీల విశ్వాసం, భక్తి శ్రద్ధలు, సౌందర్యారాధన, అలంకార నైపుణ్యంతో పాటు కళాత్మక దృష్టి ఆవిష్కృతమవుతుంది. ఈ ప్రాంతపు స్త్రీలు తమ సౌభాగ్యాన్ని, సంసారాన్ని, సంతానాన్ని చల్లగా కాపాడుమని బతుకమ్మను వేడుకుంటారు.

బతుకమ్మ ఆటల ప్రాశస్త్యం

బతుకమ్మ ఆట ఒక నృత్యం విశేషం. సంగీత సాహిత్య, నృత్య కళల సమ్మేళనంగా ఈ ఆటను చెప్పుకోవచ్చు. నాట్యశాస్త్ర ప్రకారం పురుషులు ప్రదర్శించే నాట్యం తాండవం. స్త్రీలు ప్రదర్శించే నాట్యం లాస్యం, సుకుమార అంగవిన్యాసంతో పరవశింపజేసేది లాస్యం, నాట్య కళను ప్రారంభించిన నటరాజైన పరమేశ్వరుడు గంభీరమైన ప్రళయతాండవ నృత్యంతో పార్వతీమాత లాస్యం నృత్యంతో ప్రసిద్ధి పొందాయి. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఆటపాట లేని సమావేశం లేదంటే అతిశయోక్తి కాదు. ఆటపాటలతో ఉద్యమంలో స్త్రీలను భాగస్వాములను చేసింది. ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో బతుకమ్మ అందివచ్చిన సాంస్కృతిక ఆయుధమైంది.

సబ్బండ వర్ణాలు బతుకమ్మ ఆట పాటల్లో పాల్గొంటారు. ధనిక - పేద భేదాలు మరచి తెలంగాణ మహిళాలోకం అనువైన వస్త్రధారణలతో ఆయా వాడకట్టు వాళ్ళందరూ వాకిట్లో బతుకమ్మను వేడుకతో ఆడుకుంటారు. వేదికగా ఊరి బొడ్రాయి దగ్గరో, కచేరి దగ్గరో, గ్రామంలోని కీలక ప్రదేశంలోనో బతుకమ్మలు పెట్టి స్త్రీలందరు అడుగులు కదిలిస్తూ కదలికలకు అనుగుణమైన పాట పాడే వారిని అనుసరిస్తూ చప్పట్లు చరుస్తూ బతుకమ్మ చుట్టూ తిరుగుతారు. తమ జీవితాల్లోని అనుభవాలను, అనుభూతులను, మనోభావాలను పాటల్లో వర్ణిస్తూ ఒకే రీతి గొంతుతో పాడుతుంటారు.

కొన్ని వేడుక పాటలను గమనిద్దాం...

"గౌరమ్మ వెనుక ఉయ్యాలో గౌరీశ్వరుడు ఉయ్యాలో
భక్తుల పాలించ ఉయ్యాలో వచ్చిరి సతిగుడి ఉయ్యాలో
పురాణ దంపతులు ఉయ్యాలో బోధించిరిట్లు ఉయ్యాలో
సతులార మీరు ఉయ్యాలో సద్బోధలినరండి ఉయ్యాలో
పతిభక్తియు మీకు ఉయ్యాలో బంగారు గొలుసులు ఉయ్యాలో
అత్త మామల సేవ ఉయ్యాలో అందెలు గాజులు ఉయ్యాలో
కష్టములోర్చుటే ఉయ్యాలో కలకల సాకట్లు ఉయ్యాలో
దేశాభిమానంబు ఉయ్యాలో దండ కడియాలు ఉయ్యాలో
ఈ సొమ్ములు మీరు ఉయ్యాలో ఇంపుగ తలవండి ఉయ్యాలో
పనిపాటలను మీరు ఉయ్యాలో స్వామిగా తలువండి ఉయ్యాలో"

గేయం చివరిలో తాము ఆచరించే పనిలోనే పరమాత్మను దర్శించాలనే హితబోధ, స్త్రీల శ్రమైక జీవితాలకు దర్పణం. పనిలోని అలుపును పల్లెపడుచులు, తమ ఆటపాటలతో మరచేందుకు అనువుగా చేసుకుంటారు. అందుకే వారికి పని పాటలు పరమాత్మ స్వరూపాలేనని అంతరార్థం.

"చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ
బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోనా,
బంగారుబొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోనా.
రాగిబిందేదీస్క రమణి నీళ్లకు బొతే
రాములవారు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
రాములోరు ఎదురాయెనమ్మో ఈ వాడలోన
ముత్యాల బిందెదిస్క ముదిత నీళ్ళకు బోతే
ముద్దు కృష్ణుడెదురాయెనమ్మో నమ్మో ఈ వాడలోనా,
ముద్దు కృష్ణుడెదురాయెనమ్మో ఈ వాడలోన

బతుకమ్మ పాటల రూపంలో స్త్రీల తమ సమస్యలు

బతుకమ్మ పాటల బాణీలు, ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఆయా ప్రాంతాల ఆచారాలు, పేర్లు, అలవాట్లు, భాషలోని యాస కలబోసుకుని ప్రాంతీయ ప్రసిద్ధ కథలతో ఉయ్యాలో అనీ, కోల్ అనీ, చందమామ అనీ, వలలో అనీ, ఎన్నెలో అనే తెలంగాణ పడికట్టు పదాలను బతుకమ్మ పాటల చివరన చేరుస్తూ ఆటాడుతూ పాటలు పాడుతారు. ఈ పండగకు ఆడపిల్లలు/ ఆడబడుచులు ఏ ప్రాంతాల్లో నివసిస్తున్నా, ఎక్కడున్నా తమ పుట్టింటికి చేరుకుంటారు. తోబుట్టువులకు, ఆడబిడ్డలకు తాహతుకు తగ్గట్టు, పుట్టింటివారు కట్న కానుకలను బహుకరిస్తారు. ఇదో ఆనంద హేల.

ఆడబిడ్డల ఎదురుచూపులు

అత్తవారింట్లో ఉన్న అమ్మాయిలు ఈ పండుగ వచ్చిందంటే చాలు పుట్టింటి వారి కోసం ఎదురుచూస్తుంటారు. ఆ ఎదురుచూపులను కూడా పాటల రూపంలోనే మలుస్తారు. ఎక్కువగా ఆడబిడ్డల జీవితాల కడగండ్లు, కొందరు అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు, బతుకమ్మ పాట రూపంలో ఇలా ఆవిష్కరిస్తుంటారు.

"ఇద్దరక్క చెల్లెల్లు ఉయ్యాలో ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో
ఒక్కడే మాయన్న ఉయ్యాలో వచ్చన్నాపోడు ఉయ్యాలో
ఎట్లొత్తు చెల్లెలా ఉయ్యాలో ఏరడ్డామాయె ఉయ్యాలో
ఏరుకు ఎంపల్లి ఉయ్యాలో తోటడ్డామాయె ఉయ్యాలో
తోటకు తొంబాయి ఉయ్యాలో తలుపులడ్డామాయె ఉయ్యాలో
తలుపులకు తాళాలు ఉయ్యాలో వెండీ శీలాలు ఉయ్యాలో
వెండీ శీలాల నడుమ ఉయ్యాలో ఎలపత్తి చెట్టు ఉయ్యాలో
ఎలపత్తి చెట్టుకు ఉయ్యాలో ఏడే మొగ్గలు ఉయ్యాలో
ఏడే మొగ్గల పత్తి ఉయ్యాలో ఆ పత్తి ఈ పత్తి ఉయ్యాలో
కలరాసి పోసి ఉయ్యాలో నేసెనే ఆ చీర ఉయ్యాలో
నెలకొక్క పోగు ఉయ్యాలో దించెనే ఆ చీర ఉయ్యాలో
దివిటీలమీద ఉయ్యాలో ఆ చీర కట్టుకోని ఉయ్యాలో
కొంగలా బావికి ఉయ్యాలో నీళ్ళకాని పోతే ఉయ్యాలో
ఆ చీర కట్టుకోని ఉయ్యాలో హంసలా బావికి ఉయ్యాలో
హంసలా బావికీ ఉయ్యాలో నీళ్ళకని పోతే ఉయ్యాలో
హంసలన్ని గూడి ఉయ్యాలో అంచంతా చూసే ఉయ్యాలో
చీరంతా చూసే ఉయ్యాలో పట్నంకు పోతె ఉయ్యాలో
పట్నంలో ఆడోల్లు ఉయ్యాలో మాకొక్కటనిరీ ఉయ్యాలో"

స్త్రీల ఐక్యతకు ఆయుపట్టు బతుకమ్మ

బతుకమ్మ పండుగ సామాజిక ఐక్యతను పెంపొందించే పండుగ. "మూడు కొప్పులు కలువవు" అనే సామెతను తెలంగాణ యువతీ లోకం ఆ నానుడిని పరాస్తం చేసేలా వందల మంది ఒకే చోట చేరి, ఒకరు ఆలపించిన పాటకు కాలు చేతులు కలుపుతూ గొంతులన్నీ ఒక్కటౌతాయి. బతుకమ్మ పాటలు పాడుతూ సంస్కృతీ సాంప్రదాయాలకు మకుటాయమానం. కులాల ఐక్యతకు ప్రతిరూపంగా భాసిస్తుంది. అందుకే తెలంగాణ జాతి వారికిది నిలువెత్తు నిదర్శనం.

కుల వర్గ రహితమైన పండగ బతుకమ్మ. ధనిక పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరు వారికున్నంతలో విభిన్న రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి, ఊరి మధ్యలోనున్న గుడి ముందు నేలపై జాజుతో అలికి, పసుపు, కుంకుమ, పిండితో ముగ్గు పెట్టి అందులో పీటే(పీట) ఉంచి దానిపై బతుకమ్మను ప్రతిష్టిస్తారు. చుట్టూ ఆట పాటలు ఆడుతూ అందరూ సమానమేనని భావిస్తారు. కులరహిత, చదువురాని వారికైనా ఆ సమయంలో వారికి పెద్ద పీట లభిస్తుంది. అలా బతుకమ్మ పాటల వల్ల స్త్రీల మధ్య ఐక్యతా భావం పెంపొందుతుంది. గడప దాటని స్త్రీలందరూ తమ గొంతు విప్పి తాము పడుతున్న సాధక బాధకాలను బతుకమ్మ పాటల రూపంలో భావ ప్రకటన స్వేచ్ఛ రూపంలో పాడే సాంప్రదాయ ప్రపంచంలో మరెక్కడా కానని విధానానికి నిలువుటద్దం.

తెలంగాణలో ఈ పండగ ద్వారా తరతరాల ఆచార సంప్రదాయాలు సంస్కృతుల కట్టుబాట్లకు సజీవ తార్కాణం. ముఖ్యంగా ఈ నెల వ్యవసాయ ప్రధానమైన ప్రకృతినారాధించే సమయం. భారతీయులకు ఆశ్వయుజమాసం స్త్రీని ఆదిశక్తిగా గౌరవించి కొలిచే సంస్కృతి సర్వసాధారణం. ఆ కోణంలో తెలంగాణలో బతుకమ్మ ఆరాధనకు పరాకాష్టగా నిలుస్తూ, మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతీ స్వరూపాల త్రిశక్తి సమాహారంగా “బతుకమ్మ” కొలువబడుతోంది.

బతుకమ్మ పాటలో పౌరాణిక, చారిత్రక, రామాయణ, భారత, భాగవత కథలతో పాటు సాంస్కృతిక, పురాణ సంబంధ పతివ్రతా కథలు, వేదాంత తాత్విక విషయాలు, ఆడబిడ్డల సాధక భాధకాలన్నింటిని బతుకమ్మ పాటలుగా సంతరించుకున్నాయి.

పర్యావరణ పరిరక్షణలో బతుకమ్మ పాత్ర

బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన పండగ. పువ్వులనే దేవతగా కొలవడం, తమ బతుకులను కష్టాలనే పాటలుగా పాడుకోవటం ఒక్క తెలంగాణ జాతికి మాత్రమే సొంతం. ఇంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మకు తెలంగాణలో ఎక్కడా గుడి ఆనవాళ్లు కూడా కనిపించదు. ఎవరికీ బతుకమ్మ పేరు పెట్టుకోరు. బతుకమ్మ పేర్చడంలో వాడే ఆకులు, పూలు, మంచి ఔషధాలు. వీటిని చెరువుల్లో కలపడం వల్ల నీటిశుద్ధి జరుగుతుంది. అందుకే బతుకమ్మ పండుగ ప్రకృతి పండగ, పర్యావరణ హితకరి అనడం సబబు.

ముగింపు

ప్రపంచంలోనే ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన ప్రదేశం తెలంగాణ. ఇక్కడి ప్రజల యాస, కట్టుబాట్లు, పండుగల నిర్వహణలు సహజసిద్ధ ప్రకృతికి ఆలవాలం. మానవ సంబంధాలకు నిలువెత్తు తార్కాణం, ఐక్యతకు చిరునామా. పూలనే దేవతగా కొలిచే ప్రత్యేక సంస్కృతి తెలంగాణ జాతికే సొంతం. అదే పూల జాతరలో

సృష్టిని కాపాడే అమ్మను పూలతో కొలువడమే బతుకమ్మ పండుగ ప్రత్యేకత. తెలంగాణ పడుచు బతుకమ్మ ఆడితే ప్రకృతి పులకరిస్తుంది. అందుకే తెలంగాణ జాతికి పట్టుగొమ్మ – బతుకమ్మ అని విజ్ఞుల భావన.

ఆధార గ్రంథాలు

1.రామచంద్రరావు, టేకుమళ్ళ. వ్యాసం('కోయవారి ఆచార వ్యవహారాలన్నీ తెలుగువారివే) భారతి పత్రిక ఆగష్టు, 1937.

2. డా. రామరాజు, బిరుదురాజు. 'తెలుగు జానపద గేయ సాహిత్యం'. జానపద విజ్ఞాన ప్రచురణలు. 1979.

3. దేవి ప్రసాద్, ఛటోపాధ్యాయ. తెలుగు ముద్రణ ఆధారం, 'తంత్ర వాదం'.హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 1979.

4. నరసింహ శాస్త్రి, ఖిన్నూరి. 'ఆంధ్రుల చరిత్ర సంస్కృతి'. హైదరాబాద్: మూసీ పబ్లికేషన్స్. 1980.

5. డా. ప్రేమలత, రావి. 'తెలుగు జానపద గేయ సాహిత్యం – పురాణ గాథలు'. సికింద్రాబాద్: అవేరి ప్రింటింగ్ ప్రెస్ 1983.

6. ప్రతాపరెడ్డి, సురవరం. 'హిందువుల పండుగలు' హైదరాబాద్, ఆంధ్ర సారస్వత పరిషత్. 1987.

7. డా. ప్రేమలత,రావి. శ్రీలక్ష్మి, కురుగంటి. 'జానపదవిజ్ఞాన పరిశీలనం' సికింద్రాబాద్: అవేరి ప్రింటింగ్ ప్రెస్. 1990.

8. రాములు, బి.ఎస్, 'చూపు నవల'. రామకృష్ణ నగర్, హైదరాబాద్: విశాల సాహిత్య అకాడమీ. 2014.

9. డా. సుజాతశేఖర్,బండారు. 'తెలంగాణ బతుకమ్మ పాటలు – పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాష పరిశీలన': దాచేపల్లి మాధురి మరియు మనోజ్ పబ్లికేషన్. 2005. దేవరకొండ.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

ఆదిత్య హృదయ మహిమ

"హిరణ్యగర్భః శిశిర స్తపనోఽ హస్కరో రవిః
అగ్నిగర్భోఽదితేః పుత్రః శఙ్ఖః శిశిరనాశనః"

21. తపనః : అది మనం తిన్న ఆహారాన్నంతా ఏడు ధాతువులుగా వేరుచేస్తూ తానుమాత్రం స్వరూపాన్ని కోల్పోకుండా ఏ పదార్థం ఏ ప్రదేశానికి ఎంత ప్రమాణంలో ఎలా వెళ్ళాలో చక్కగా భావించే మేధావియై పనిచేస్తూ ఉంటుంది. దాని కిరణాలు పైకి, క్రిందికి, అన్ని వైపులకు వ్యాపించి ఉంటాయి. అది పాదతలం నుండి తల పైభాగం వరకు తన దేహాన్ని ఒక ప్రమాణంలో తపింపజేస్తూ ఉంటుంది. అదిగో! అటువంటి తపన లక్షణం గలవాడు తపనుడు. భగవద్గీతలో చెప్పిన –

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ (15-14)

నేను ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి వైశ్వానరుడనై ప్రాణ అపానములతో కూడుకుని ఉండి నాలుగు విధములైన అన్నమును పాకమునకు తెచ్చుచున్నాను అన్న భావన ఈ మంత్రాల సారరూపమే. ఈ మంత్రములు 1. రక్తము 2. మాంసము 3. మేదస్సు 4. ఎముకలు 5. మజ్జ 6. వస 7. శుక్లము.

దేహమునందలి నాడీ మండల వ్యవస్థ అంతా ఈ తపన శబ్ద తాత్పర్యమే. దేహంలోని సాధారణమైన వేడి 98.4 డిగ్రీలుగా వ్యవస్థితమై ఉన్న వ్యవహారమంతా 'తపన' స్థితియే. జీర్ణమండల స్వరూప స్వభావాలన్నీ తపనుని వలననే ఏర్పడుతున్నాయి. ఈ విధమైన స్థితియే విశ్వ దేహంలో కూడా చక్కగా అమరియున్నది. ఆ అర్థాన్ని మనం గుర్తించడం కోసం "అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః" – 'లోపలను, వెలుపలను అంతటినీ వ్యాపించి నారాయణుడు ఉన్నాడు' అని మంత్రం తెలియజేస్తున్నది. ఆ నారాయణుడు ఆదిత్య నారాయణుడే.

22. అహస్కరః : ఆదిత్యుడు అహస్కరుడు. సూర్యుని విడిచి ఉండనిది. తిరిగి వచ్చుటను విడనాడనిది అని అహశ్శబ్దానికి రెండర్థాలను నిరుక్తి చూపుతున్నది. సూర్యతేజస్సు నిండుగా వ్యాపించి ఉండేది. కొంతకాలం గడచిన తరువాత నియతంగా తిరిగి రావటం అనే పద్ధతి కలదీ అహస్సు. అదే సూర్యోదయం. అటువంటి స్థితిగలది అహస్సు. దానిని చేసేవాడు అహస్కరుడు.

అవ్యక్తా ద్వ్యక్తయ స్సుర్వాః ప్రభవన్త్యహరాగమే
రాత్ర్యాగమే ప్రతీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞకే
భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమేఽ వశః పార్థ ప్రభవత్యహరాగమే.

గీతలోని ఈ రెండు శ్లోకాలను ఈ సందర్భంలో స్మరించాలి.

సత్సంగం

మౌనం – సాధన



హృదయం భౌతికమైనది కాదు, ఆధ్యాత్మికమైనది. ఇదే కేంద్రం. ఇది ఆలోచనల నుండి ఉద్భవిస్తుంది. అవి దానిపై ఆధారపడి ఉంటాయి మరియు అవి అక్కడ పరిష్కరించబడతాయి. ఆలోచనలు మనస్సు యొక్క విషయాలు, అవి విశ్వాన్ని రూపొందిస్తాయి. సాధనలో మౌనం ఒక భాగమా? మౌనమే సాధనా ఫలమా? మనస్సులో ఏ అలజడి లేని మౌనమే అత్యుత్తమ దీక్ష అని భగవాన్ రమణ మహర్షి చెప్పారు.

మౌనం అంటే మాటలు ఆగటం కాదు. విషయాల కోసం మనస్సు కదలకుండా ఉండటమే మౌనం.

మహిళలు తమ నివాసాల్లోనే ఎన్నో రకాల పిండివంటలు చేస్తారు. అలా చేస్తున్నంతసేపు ఒక్క పిండి వంట విషయంలో కూడా వారికి నోరూరదు. అంటే అన్ని వంటకాల మధ్య రుచుల విషయంలో వారి మనస్సు మౌనంగానే ఉంటుంది. జ్ఞాని కూడా విషయ ప్రపంచంలో తాను చేయాల్సిన పనులన్నీ చేస్తూనే అలా మౌనంగా ఉంటాడు.



మనస్సుకు అలాంటి మౌనాన్ని అలవర్చటమే ఏ దీక్షకైనా ఫలం. నిజానికి మనం ఎంచుకున్న లక్ష్యాన్ని ఫలంగా పొందటమే దీక్ష. మౌనమే అత్యుత్తమ సాధన దీక్ష! మౌనదీక్ష చేస్తే మంచి ఫలితాలు వస్తాయంటారా?

మౌనమే అత్యుత్తమ దీక్ష అని భగవాన్ శ్రీరమణ మహర్షి అన్నారు. అంటే మిగిలిన సాధనాలన్నీ తిరస్కరించమని కాదు. వాటినే పరమావధిగా భావించి అక్కడే ఆగిపోవద్దని మహర్షి బోధ.

ఒక గమ్యానికి వెళ్ళదలచుకున్న వారికి అక్కడికి చేరుకోవడం దీక్ష. బస్సు ఎక్కటం, కార్లో ప్రయాణించటం ఇవన్నీ ఆ దీక్షకు ఉపకరించే విషయాలు మాత్రమే కానీ అవి దీక్ష కాదు. అలాగే సాధనలో ఏ దీక్ష అయినా లక్ష్యంగా ఎంచుకున్న ఆ ఫలం కోసమే. దీక్షలోని మిగిలిన ప్రక్రియలన్నీ ఆ ఫలాన్ని పదేపదే గుర్తుకు తెచ్చేందుకే. మనం ధరించే ప్రత్యేక దుస్తులు కానీ మాలలు కానీ జపించే మంత్రం గాని, చేసే ధ్యానం కాని దీక్షకు ఉపకరణాలు మాత్రమే. ఏ మార్గంలోనైనా అందరూ కోరుకునేది మనస్సు ఆగితే లభించే శాంతినే!

తెలుగు భాషా శాస్త్ర వికాసానికి నాయని కృష్ణకుమారి సేవలు

గౌడిపేరు సురేష్, పరిశోధక విద్యార్థి, **డా. ఈశ్వరమ్మ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
దొడ్ల కౌశలమ్మ మహిళా కళాశాల, విక్రమసింహపురి విశ్వవిద్యాలయం, ఫోన్ : 938 122 6593

విషయ సంగ్రహం :

ఈ పరిశోధనా పత్రం, డాక్టర్ నాయని కృష్ణకుమారి (1930–2016) తెలుగు భాషకు చేసిన మౌలికమైన, శాస్త్రీయమైన సేవలను విశ్లేషిస్తుంది. ఆమెను కేవలం ఒక సాహిత్యవేత్తగా కాకుండా, ఆధునిక తెలుగు భాషాశాస్త్ర రంగంలో ఒక మార్గదర్శకురాలిగా ఈ పత్రం ప్రతిపాదిస్తుంది. ఆమె కృషి ప్రధానంగా మూడు భాషాశాస్త్ర విభాగాలలో కేంద్రీకృతమై ఉంది: (1) జానపద భాషాశాస్త్రం (Folkloristic Linguistics): ఆమె **'తెలుగు జానపద గేయ గాథలు'** (1974) ద్వారా నిర్మించిన **"మౌఖిక భాషా నిధి"** (Oral Corpus) యొక్క ప్రాముఖ్యత, మరియు దాని ద్వారా మాండలికాల డాక్యుమెంటేషన్. (2) సామాజిక భాషాశాస్త్రం (Sociolinguistics): ఆమె జానపద సేకరణ మరియు 'అగ్నిపుత్రి' (1978) వంటి సృజనాత్మక రచనల ద్వారా స్త్రీవాద ప్రతి – ప్రవచనాన్ని (feminist counter-discourse) ఎలా నిర్మించారు. (3) అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics): 'పరిశోధన', 'తెలుగు భాషా చరిత్ర' వంటి గ్రంథాల ద్వారా పాండిత్య వచనాన్ని (academic prose) నిర్మించడం మరియు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా భాషా ప్రణాళికను (language planning) ఆచరణలో పెట్టడం. ఆమె పరిశోధన, తెలుగు భాష యొక్క సరిహద్దులను పునర్నిర్వచించడమే కాకుండా, భవిష్యత్ పరిశోధనకు అవసరమైన పద్ధతి శాస్త్ర ఉపకరణాలను (methodological tools) అందించిందని ఈ పత్రం నిర్ధారిస్తుంది.

ముఖ్య పదాలు (Keywords) : నాయని కృష్ణకుమారి, తెలుగు భాషా శాస్త్రం, పరిశోధన (పద్ధతిశాస్త్రం), జానపద భాషాశాస్త్రం, సామాజిక భాషాశాస్త్రం, అనువర్తిత భాషాశాస్త్రం, మౌఖిక భాషా నిధి, మాండలిక విజ్ఞానం, స్త్రీవాద భాషాశాస్త్రం, భాషా ప్రణాళిక.

1. పరిచయం

1.1. నేపథ్యం : 20వ శతాబ్దపు మధ్యకాలంలో, తెలుగు భాషా అధ్యయనం ప్రధానంగా చారిత్రక భాషాశాస్త్రం మరియు వ్యాకరణ సూత్రాలకే పరిమితమై ఉండేది. భాష యొక్క జీవమైన, సామాజిక రూపమైన మాండలికాలు, ప్రజల వాడుక భాష విద్యాపరంగా చిన్నచూపుకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో, డాక్టర్ నాయని కృష్ణకుమారి ప్రవేశం, తెలుగు భాషా అధ్యయనానికి ఒక నూతన, శాస్త్రీయ దిశను చూపింది.

1.2. పరిశోధన ఉద్దేశ్యం : ఈ పరిశోధన యొక్క ముఖ్య ఉ

ద్దేశ్యం, డాక్టర్ కృష్ణకుమారిని ఒక బహుముఖ భాషా శాస్త్రవేత్తగా, ఆమె చేసిన సేవలను శాస్త్రీయంగా విశ్లేషించడం. జానపద, సామాజిక, మరియు అనువర్తిత భాషాశాస్త్ర రంగాలలో ఆమె ఎలా కొత్త పుంతలు తొక్కారో సోదాహరణంగా నిరూపించడం ఈ పత్రం యొక్క లక్ష్యం.

2. జానపద భాషాశాస్త్రం (Folkloristic Linguistics) **ఒక మౌఖిక భాషా నిధి నిర్మాణం :** ఇది ఆమె చేసిన అత్యంత మౌలికమైన భాషాశాస్త్ర సేవ. ఆమె జానపద సేకరణను కేవలం సాహిత్య సేకరణగా కాకుండా, ఒక క్రమబద్ధమైన "మౌఖిక భాషా నిధి"గా చూపించడం.

2.1. ధ్వనిశాస్త్ర డాక్యుమెంటేషన్ : ఆమె **'తెలుగు జానపద గేయ గాథలు'** కోసం సేకరించిన తెలంగాణ జానపద గేయాలలో, ప్రామాణిక భాషలోని ఓష్ఠ్య స్పర్శరహిత ధ్వని తరచుగా ఓష్ఠ్య స్పర్శ ధ్వనిగా మారడం (ఉదా: వాన – బాన) స్పష్టంగా కనిపిస్తుంది. (కృష్ణకుమారి, 1974, పే. 45). ఇది కేవలం ఉచ్చారణ దోషం కాదు. ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని క్రమబద్ధమైన ధ్వని పరిణామం (systematic phonological rule). ఆమె సేకరణ ఈ నియమానికి సహజమైన వాతావరణంలో ఆధారంగా నిలుస్తుంది.

2.2. ప్రాంతీయ అచ్చుల ఉచ్చారణ : ఆమె సేకరణలోని పాటలలో కొన్ని ప్రాంతాలలో 'ఎ' కారం 'య' కారంగా పలకడం (ఉదా: చెయ్యి – చెయి) వంటి సూక్ష్మమైన ఉచ్చారణ భేదాలు భద్రపరచబడ్డాయి (కృష్ణకుమారి, 1974, పరిశీలన). ఇది మాండలికాల మధ్య ఉన్న సూక్ష్మ ధ్వని భేదాలను (subtle phonetic variations) అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతుంది.

2.3. పదనిర్మాణ శాస్త్ర వైవిధ్యం : ప్రామాణిక భాషలో "వెళుతున్నాడు" అనే క్రియ, ఆమె చేసిన తెలంగాణ పాటలలో "పోతాండు,"

"వెళ్తాండదు" వంటి రూపాలలో కనిపిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 112). ఇది తెలుగు క్రియారూపాల వైవిధ్యాన్ని, ముఖ్యంగా సహాయక క్రియల (auxiliary verbs) వాడకంలో ఉన్న ప్రాంతీయ భేదాలను అధ్యయనం చేయడానికి ఒక ఆధారం.

2.4. విభక్తి ప్రత్యయాల భేదం : ప్రామాణిక భాషలోని 'చేత' ప్రత్యయానికి బదులుగా, ఆమె సేకరించిన జానపద భాషలో 'తోని' అనే ప్రత్యయం వాడకం (ఉదా: రామునిచేత – రామునితోని) స్పష్టంగా కనిపిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 89). ఇది కారక విభక్తి (case markers) వాడకంలో ఉన్న మాండలిక వైవిధ్యాన్ని సూచిస్తుంది.

2.5. వృత్తి – సంబంధిత పదకోశం : చేనేత కార్మికులు వాడే 'పడుగు', 'పేక', 'అచ్చు', 'కండె' వంటి పారిభాషిక పదజాలం ఆమె సేకరణ ద్వారా భద్రపరచబడింది (కృష్ణకుమారి, 1974, పే. 215). ఇది ఒక నిర్దిష్ట వృత్తి సమూహం యొక్క ప్రత్యేకమైన భాషా ప్రపంచాన్ని (specialized occupational lexicon), వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని భద్రపరుస్తుంది.

2.6. గృహ సంబంధిత పదజాలం : 'అంబలి,' 'సంకటి', 'గంజి' వంటి ఆహార పదార్థాలకు, 'రోకలి', 'తిరగలి' వంటి పనిముట్లకు సంబంధించిన స్వచ్ఛమైన తెలుగు పదాలు ఆమె సేకరణలో భాగం (కృష్ణకుమారి, 1974, పల్లె పదాలు విభాగం). వివరణ: ఆధునిక జీవన విధానంలో వాడుకలోంచి కనుమరుగవుతున్న దేశీయ పదజాలాన్ని (native vocabulary) పరిరక్షించడం దీని ప్రాముఖ్యత.

2.7. సంస్కృతి–నిర్దిష్ట పద అంశాలు : ఆమె విశ్లేషించిన 'బతుకమ్మ', 'బొడ్డెమ్మ', 'సీమంతం' వంటి పదాలు కేవలం పదాలు కావు. అవి వాటితో ముడిపడి ఉన్న మొత్తం సాంస్కృతిక ఆచారాలను సూచిస్తాయి (కృష్ణకుమారి, 1974, పే. 178). ఈ పదాలు, భాషకు మరియు సంస్కృతికి మధ్య ఉన్న విడదీయరాని సంబంధాన్ని (Sapir-Whorf hypothesis) అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయి.

2.8. జాతీయాల పరిరక్షణ : ఆమె జానపద గేయాలలో "కడుపులో చల్ల కదలకుండా", "గుండె చెరువవడం", "నోట్లో మట్టి కొట్టుట" వంటి శక్తివంతమైన జాతీయాలు, వాటి అసలైన వాడుకలో నిక్షిప్తమై ఉన్నాయి (కృష్ణకుమారి, 1974, జాతీయాల విభాగం). జాతీయాలు ఒక భాష యొక్క సృజనాత్మకతకు, భావ వ్యక్తీకరణ సామర్థ్యానికి ప్రతీకలు. ఆమె సేకరణ ఈ భాషా సంపదకు ఒక నిధి.

2.9. వాక్య నిర్మాణంలో భేదాలు : జానపద గేయాలలో తరచుగా వాక్య నిర్మాణం సరళంగా, పునరావృతమయ్యే పద్ధతిలో ఉంటుంది. "వచ్చెనమ్మా వచ్చెను, సీతమ్మ తల్లి వచ్చెను" వంటి పునరుక్తి వాక్యాలు మౌఖిక సంప్రదాయంలోని వాక్య నిర్మాణ శైలిని (syntax of orality) చూపుతాయి.

2.10. సంభాషణా శైలుల డాక్యుమెంటేషన్ : ఆమె సేకరించిన అత్తాకోడళ్ల పాటలు, తల్లి కూతుళ్ల పాటలలోని సంభాషణలు ఆనాటి సామాజిక సంబంధాలను, సంభాషణా శైలులను (conversational styles) ప్రతిబింబిస్తాయి.

3. సామాజిక భాషాశాస్త్రం (Sociolinguistics) : భాష, లింగం మరియు అధికారం. ఆమె కృషి భాషకు మరియు సామాజిక నిర్మాణాలకు మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేసే సామాజిక భాషా శాస్త్రానికి ఒక అద్భుతమైన విశ్లేషణ.

3.1. లింగ ఆధారిత పదజాల క్షేత్రాలు : ఆమె 'తెలుగు జానపద గేయ గాథలు'లో (1974) సేకరించిన పురుషుల వీరగాథలు మరియు స్త్రీల పాటల మధ్య పదజాల క్షేత్రాలలో స్పష్టమైన విభజన కనిపిస్తుంది. ఇది స్త్రీ పురుషుల సామాజిక ప్రపంచాలు వేర్వేరుగా ఉండటం వల్ల, వారి భాషా ప్రపంచాలు కూడా వేర్వేరుగా ఎలా నిర్మించబడతాయో చూపిస్తుంది.

3.2. సంబోధన రూపాలు : జానపద పాటలలో, భార్య భర్తను నేరుగా పేరు పెట్టి పిలవకుండా, "మా వారు", "ఓ చందమామ" వంటి పరోక్ష సంబోధనలను ఉపయోగించడం నాటి సామాజిక కట్టుబాట్లను సూచిస్తుంది (కృష్ణకుమారి, 1974, పే. 155). ఇది భాషలోని గౌరవ సూచకాల (honorifics) ద్వారా సామాజిక అంతరాలను, అధికార సంబంధాలను ఎలా ప్రదర్శిస్తారో చూపిస్తుంది.

3.3. క్రియాశీలక నిష్క్రియాత్మక వాక్యాలు : ఆమె విశ్లేషణ ప్రకారం, వీరగాథలలో పురుషుడు కర్తగా (Active) ఉంటే, స్త్రీల పాటలలో తరచుగా స్త్రీ కర్మగా (Passive) ఉంటుంది. వివరణ : ఇది భాషా నిర్మాణం ద్వారా స్త్రీల నిష్క్రియాత్మక పాత్రను (passive role) సమాజం ఎలా నిర్మిస్తుందో, బలపరుస్తుందో వివరిస్తుంది.

3.4. అధికార భాష : వీరగాథలలోని పురుషుల భాష ఆదేశాలతో నిండి ఉంటే, స్త్రీల పాటల భాష విన్నపాలు, విలాపాలతో నిండి ఉంటుంది. వివరణ : ఇది భాషా వినియోగం ద్వారా సామాజిక అధికారాన్ని (social power) ఎలా ప్రదర్శిస్తారో, నిలబెట్టుకుంటారో చూపిస్తుంది.

3.5. ప్రశ్నల సరళి : స్త్రీల పాటలలోని ప్రశ్నలు తరచుగా సమాధానం ఆశించని ఆవేదనాభరితమైన ప్రశ్నలుగా (rhetorical questions) ఉంటాయి. వివరణ : ఇది వారి నిస్సహాయతను, తమ వాదనను వినిపించే అవకాశం లేకపోవడాన్ని భాషాపరంగా సూచిస్తుంది.

3.6. 'అగ్నిపుత్రి'లో అర్థ పునర్నిర్మాణం : ఆమె తన ప్రఖ్యాత కవితా సంకలనం 'అగ్నిపుత్రి' (1978)లో, 'అగ్ని' అనే పదం యొక్క సాంప్రదాయ అర్థాలైన 'పవిత్రత', 'శుద్ధి'లను దాటి, దానికి 'తిరుగుబాటు', 'శక్తి', 'అస్తిత్వం' అనే కొత్త అర్థాలను ఆపాదించారు (కృష్ణకుమారి, 1978, పే.10). ఇది ఒక పదం యొక్క అర్థ క్షేత్రాన్ని

(semantic field) చేతన పూర్వకంగా విస్తరించి, ఒక ప్రతి – ప్రవచనాన్ని (counter-discourse)ఎలా నిర్మించవచ్చో చూపిస్తుంది.

3. 7. "గడప" ప్రతీకను మార్చడం : 'అగ్నిపుత్రి'లోనే (1978), 'గడప'ను స్త్రీకి ఒక పరిమితిగా కాకుండా, స్వేచ్ఛ వైపు మొదటి అడుగుగా, ఒక "ఆరంభ రేఖ"గా పునర్నిర్వచించారు (కృష్ణకుమారి, 1978, పే. 25). ఇది భాషలోని ప్రతీకలను తీసుకొని, వాటి అర్థాన్ని తలక్రిందులు చేయడం ద్వారా (symbolic inversion) పితృస్వామ్య భావజాలాన్ని సవాలు చేయడం.

3.8. శారీరక భాష : ఆమె 'అగ్నిపుత్రి' (1978) కవిత్వంలో, స్త్రీ శరీరాన్ని కేవలం సౌందర్య వస్తువుగా కాకుండా, కోరికలు, అనుభూతులు ఉన్న ఒక క్రియాశీలక అస్తిత్వంగా వర్ణించారు. ఇది స్త్రీ శారీరక అనుభవాలకు (corporeal experience) భాషలో ఒక స్థానాన్ని కల్పించడం.

3.9. ధిక్కార స్వరం : ఆమె కవిత్వంలోని "మేమెవ్వరం?", "మా బతుకులింతేనా?" వంటి సూటి ప్రశ్నలు పితృస్వామ్య వ్యవస్థను, దాని నియమాలను నేరుగా ప్రశ్నిస్తాయి (కృష్ణకుమారి, 1978, పే. 42). ఇది భాషను నిరసన సాధనంగా (language as a tool of protest) ఉపయోగించడం.

3.10. కోడ్ – స్విచ్చింగ్ (Code-Switching) : ఆమె 'ఆయాతా' కథలలోని ఆధునిక స్త్రీ పాత్రలు, ఆఫీసులో, ఇంట్లో, స్నేహితులతో మాట్లాడేటప్పుడు తమ భాషను మార్చడం ద్వారా, తమ బహుళ గుర్తింపులను ప్రదర్శిస్తాయి. వివరణ : ఇది ఆధునిక సమాజంలోని బహుళ సామాజిక పాత్రల మధ్య ఒక వ్యక్తి తన అస్తిత్వాన్ని భాష ద్వారా ఎలా నిర్మించుకుంటాడో చూపిస్తుంది.

4. అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics) : **భాషా ప్రణాళిక మరియు బోధన**

ఆమె పాండిత్యం కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాలేదు. ఆమె దానిని బోధన మరియు భాషా ప్రణాళికకు అనువర్తింపజేశారు.

4. 1. పద్ధతిశాస్త్ర నిర్మాణం ('పరిశోధన') : ఆమె 'పరిశోధన' వ్యాస సంకలనంలో, పరిశోధనకు "విషయ నిర్ధారణ" (Topic Selection) ఎలా చేయాలో, దాని పరిధిని ఎలా నిర్ణించుకోవాలో శాస్త్రీయంగా వివరించారు (కృష్ణకుమారి, పరిశోధన). వివరణ : ఇది పరిశోధనను ఒక క్రమబద్ధమైన, శాస్త్రీయ ప్రక్రియగా మార్చే ప్రయత్నం.

4.2. ఆధార సేకరణ మార్గదర్శకాలు : అదే గ్రంథంలో, "ప్రాథమిక మరియు ద్వితీయ శ్రేణి ఆధారాలు" (Primary and Secondary Sources) మధ్య తేడాను, వాటిని ఎలా సేకరించాలో వివరించారు. వివరణ : ఇది పరిశోధనలో, ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వడం.



4. 3. సిద్ధాంత గ్రంథ నిర్మాణం : 'పరిశోధన'లోనే ఒక పరిశోధనా గ్రంథాన్ని అధ్యాయాలుగా ఎలా విభజించాలి, పీఠిక, విషయ విశ్లేషణ, ముగింపు ఎలా రాయాలో ఒక నమూనాను అందించారు.

4. 4. క్షేత్రస్థాయి పరిశోధన యొక్క ప్రాముఖ్యత : 'పరిశోధన'లో, జానపద విజ్ఞానంలో క్షేత్రస్థాయి పరిశోధన యొక్క ప్రాముఖ్యతను, అందులో పాటించవలసిన మెళకువలను తన అనుభవంతో వివరించారు. వివరణ : ఇది భాషను దాని సహజ వాతావరణంలో అధ్యయనం చేయడమే సరైన పద్ధతి అని నొక్కి చెప్పడం.

4. 5. 'తెలుగు భాషా చరిత్ర'లో శాస్త్రీయ స్పష్టత : ఆమె 'తెలుగు భాషా చరిత్ర' గ్రంథంలో, భాషా శాస్త్రంలోని 'తాలవ్యీకరణ' (Palatalization) వంటి ధ్వని పరిణామ సూత్రాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా సోదాహరణంగా వివరించారు (ఉదాహరణకు, పే.67). వివరణ : ఇది సంక్లిష్టమైన శాస్త్రీయ భావనలను బోధనా శాస్త్ర (pedagogy) అవసరాలకు అనుగుణంగా సరళీకరించడం.

4.6. పాఠ్యపుస్తక నిర్మాణం : 'తెలుగు జానపద విజ్ఞానం – సమాజం, సంస్కృతి, సాహిత్యం' అనే పాఠ్యపుస్తకాన్ని రచించి, జానపద విజ్ఞానాన్ని ఒక ప్రామాణిక విద్యా విభాగంగా మార్చారు. ఇది జ్ఞానాన్ని ప్రజాస్వామికీకరించడం (democratization of knowledge) మరియు కొత్త అధ్యయన రంగాలకు పునాది వేయడం.

4. 7. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా తన పదవీకాలంలో (1996–1999), ఆమె అంతరించిపోతున్న గిరిజన భాషలైన చెంచు, కోయ, గోండి వంటి వాటి పదకోశాలను సేకరించి, నిఘంటువులను రూపొందించే ప్రాజెక్టులను ప్రోత్సహించారు.

4. 8. స్థితి ప్రణాళిక (Status Planning) : తన పరిపాలనా హోదాలో, జానపద విజ్ఞానాన్ని, తులనాత్మక సాహిత్యాన్ని

విశ్వవిద్యాలయ సిలబస్లో ముఖ్యమైన విభాగాలుగా చేర్చడం ద్వారా, వాటి "స్థితిని" (status) పెంచారు. ఇది నిర్లక్ష్యం చేయబడిన భాషా సాహిత్య రూపాలకు విద్యాపరమైన, సంస్థాగతమైన గుర్తింపును తీసుకురావడం.

4. 9. నిఘంటు నిర్మాణ ప్రోత్సాహం : ఆమె జానపద పదకోశ సేకరణ, భవిష్యత్తులో మాండలిక నిఘంటువులు, వృత్తి పదకోశాల తయారీకి పరోక్షంగా పునాది వేసింది.

4. 10. సంస్థాగత నిర్మాణం : తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద మరియు గిరిజన విజ్ఞాన పీఠాన్ని బలోపేతం చేసి, నిర్లక్ష్యం చేయబడిన భాషా మరియు సాహిత్య రూపాల అధ్యయనానికి ఒక శాశ్వత వేదికను కల్పించారు.

ముగింపు :

ఆచార్య నాయని కృష్ణకుమారి తెలుగు భాషా అధ్యయనానికి ఒక ఆధునిక, శాస్త్రీయ దృక్పథాన్ని అందించిన మార్గదర్శకురాలు. ఆమె ఒక జానపద భాషావేత్తగా అంతరించిపోతున్న పదజాలాన్ని పరిరక్షించారు. ఒక సామాజిక భాషావేత్తగా భాషలోని అధికార సంబంధాలను విశ్లేషించారు. ఒక స్త్రీవాద భాషావేత్తగా భాష యొక్క అర్థ సరిహద్దులను చెరిపివేశారు. మరియు ఒక అనువర్తిత భాషావేత్తగా పాండిత్య భాషను ప్రజాస్వామికీకరించి, భాషా ప్రణాళికకు దోహదపడ్డారు.

ఆధార గ్రంథాలు (References)

ప్రాథమిక ఆధారాలు :

1. కృష్ణకుమారి, నాయని. (1974). తెలుగు జానపద గేయ గాథలు. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
2. కృష్ణకుమారి, నాయని. (1978). అగ్నిపుత్రి. సికింద్రాబాద్: యువభారతి.
3. కృష్ణకుమారి, నాయని. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమీ. (ప్రచురణ సంవత్సరం నిర్ధారించుకోవాలి).
4. కృష్ణకుమారి, నాయని. (1977). పరిశీలన.
5. కృష్ణకుమారి, నాయని. పరిశోధన (వ్యాస సంకలనం).

ద్వితీయ శ్రేణి ఆధారాలు :

1. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. హైదరాబాద్.
2. భద్రిరాజు కృష్ణమూర్తి. తెలుగు భాషా చరిత్ర.
3. చేకూరి రామారావు (చేరా). తెలుగులో వాక్యం.
4. సత్యవతి, కె. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ధోరణులు.

❖ ❖ ❖ ❖ ❖

కొత్త లోకం కావాలి...!

ధూళిపాళ అరుణ
ఫోన్ : 8712342323

నాకిప్పుడు...
ఓ కొత్త లోకం కావాలి
సుఖాలను నియంత్రించి
కాలాన్ని కష్టంతో లెక్కించగల
అడుగులను నేను చూడాలి

అధికార మదాన్ని అణచి
స్వేచ్ఛా విహంగమై ఎగరడానికి
ఆసరానిచ్చే చేతులను
నేను స్పృశించాలి

పవిత్రతకు మారు నిలిచి
ఆదర్శాల ఆచరణతో
పచ్చగా పండించుకునే జీవితానికి
విలువలు నేర్పగల బోధనకు
మురిసి పరవశించాలి

కళ్ళను ఆల్చిప్పలు చేసి
మనసంతా జ్ఞానాన్ని అపేక్షిస్తూ
చేరదేసి చెవులతో
ఆదరంగా పాఠాలను వినే
విద్యార్థినై తరించాలి

సుకుమార లతికా లావణ్యంతో
ప్రేమైకజీవన మాధుర్యాన్ని
సమాజానికి అందించే
స్త్రీత్వాన్ని అనుభూతి చెందాలి

పెంచిన మొక్కను తుంచేయకుండా
మమకారపు పేగుతో చుట్టుకునే
మాతృత్వపు నీడలో
నన్ను పెరగనివ్వాలి

కంచే చేను మేసినట్లు కాక
చంటి పాపలను
కంటి పాపల కింద కాపాడుతూ
ఒడిలో లాలించే
పితృవాత్సల్యతను చవి చూడాలి

త్యాగాలకు విలువలేక
సహనాన్ని బలహీనతగా భావించే
అహంకార ప్రదర్శన లేని
సప్తపదుల సహజీవనాన్ని
తనువంతా నింపుకోవాలి

ఇంద్రియాల గుర్రాలకు కళ్ళాలు వేసి
నమ్మకాలను మోసం చేసే
అవాంఛనీయతలు లేని
స్నేహ మధురిమను ఆస్వాదించాలి

మానవతా వృక్షం కింద
కష్టానికి అర్థం తెలియని
జీవితాన్ని గడిపేందుకు
మరో కొత్తలోకం నాకు కావాలి
దురాశ అంటారా దీన్నెవరైనా?
ఇవ్వగలరా మరెవరైనా??

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (29) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

పక్షపాతం vs నిష్పాక్షికత : తెలుగు పరిశోధనలో కీలక సంఘర్షణ

ఆచార్య వెంకటరామయ్య గంపా, భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – సంపాదకులు.

పరిశోధన అంటే కేవలం పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం మాత్రమే కాదు. ఇటీవల కాలంలో, అనేక విశ్వవిద్యాలయాలు ఎం.ఏ., డిగ్రీ స్థాయి కోర్సులలో సిద్ధాంత వ్యాస రచనను తప్పనిసరి చేశాయి. వీటిని పరిశోధనగానే పరిగణించాలి. అయితే, చాలామంది విద్యార్థులు ఈ సిద్ధాంత వ్యాసాలను తమ వ్యక్తిగత ఇష్టాలను (ఉదాహరణకు, నచ్చిన రచయితల రచనలను పొగడటం) లేదా తమ భావజాలాన్ని, ప్రాంతీయ ప్రాధాన్యతలను ప్రచారం చేయడానికి ఉపయోగిస్తున్నారు. పరిశోధన అనేది వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేయడం కాదు. ఇది ఒక శాస్త్రీయ ప్రక్రియ. ఒక నిర్దిష్ట అంశంపై సమగ్రంగా, నిష్పాక్షికంగా సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, దాని ఆధారంగా ఒక కొత్త అంశాన్ని లేదా వాస్తవాన్ని వెల్లడించడమే అసలైన పరిశోధన.

పరిశోధన అనేది జ్ఞానాన్ని విస్తరించేందుకు, సత్యాన్ని అన్వేషించేందుకు ఉద్దేశించిన ఒక శాస్త్రీయ ప్రక్రియ. పరిశోధనలో విషయ విశ్లేషణ అనేది ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. పక్షపాతం, నిష్పాక్షికత అనేవి ఈ విశ్లేషణపై తీవ్ర ప్రభావం చూపే రెండు పరస్పర విరుద్ధమైన భావనలు. ఒక పరిశోధకుడు తన వ్యక్తిగత అభిప్రాయాలను, నమ్మకాలను పక్కన పెట్టి, కేవలం వాస్తవాలు, సాక్ష్యాల ఆధారంగా విశ్లేషణ చేసినప్పుడు అది నిష్పాక్షికంగా ఉంటుంది. కానీ, వ్యక్తిగత, సామాజిక, లేదా సైద్ధాంతిక అంశాలు విశ్లేషణను ప్రభావితం చేసినప్పుడు అది పక్షపాతంగా మారుతుంది. సాహిత్యం భావోద్వేగాలు, భావ వ్యక్తీకరణలు, సాంస్కృతిక దృక్పథాల ప్రతిబింబం. అందువల్ల, ఒక సాహిత్య రచనను విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడి వ్యక్తిగత అభిప్రాయాలు, సామాజిక నేపథ్యం లేదా సాంస్కృతిక విలువలు అనివార్యంగా ప్రభావితం చేయవచ్చు. తెలుగు సాహిత్యం సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒక విస్తృతమైన క్షేత్రం. ప్రాచీన కాలం నుండి ఆధునిక సాహిత్యం వరకు విస్తరించిన ఈ ప్రస్థానం వివిధ సామాజిక, రాజకీయ, ప్రాంతీయ, మతపరమైన మార్పులను చూసింది. ఇలాంటి బహుముఖ సాహిత్య రచనలను విశ్లేషించేటప్పుడు నిష్పాక్షికతను సాధించడం ఒక పెద్ద సవాలు. నిష్పాక్షికతను సాధించే ప్రయత్నమే పరిశోధనకు శాస్త్రీయతను, నైతికతను ఇస్తుంది. ఈ వ్యాసంలో, నిష్పాక్షికత, పక్షపాతాల భావనలు, వాటి మధ్య ఉన్న సంఘర్షణ, వాటిని తగ్గించడానికి ఉన్న పద్ధతులు, తెలుగు సాహిత్య పరిశోధనలో వాటి నిర్దిష్ట ప్రభావాలను లోతుగా విశ్లేషించడం జరిగింది.

నిష్పాక్షికత

నిష్పాక్షికత అంటే ఒక పరిశోధకుడు తన వ్యక్తిగత అభిప్రాయాలు, భావోద్వేగాలు, లేదా ఊహలకు అతీతంగా, కేవలం వాస్తవాలు, సాక్ష్యాధారాల ఆధారంగా ఒక విషయాన్ని అన్వేషించే సామర్థ్యం. ఇది పరిశోధన ప్రాథమిక సూత్రాలలో ఒకటి, ఎందుకంటే ఇది పరిశోధనా ఫలితాలకు విశ్వసనీయతను చేకూర్చి, అవి సార్వత్రికంగా ఆమోదయోగ్యంగా ఉండేలా చేస్తుంది. నిష్పాక్షికత లేని పరిశోధన వ్యక్తిగత అభిప్రాయాల వలయంలో చిక్కుకుని, దాని లక్ష్యాన్ని కోల్పోతుంది. ఉదాహరణకు, పరిశోధనా ఫలితాలు పరిశోధకుడి సిద్ధాంతానికి అనుగుణంగా ఉండాలని కోరుకోవడం కాకుండా, వాస్తవ సమాచారాన్ని యథాతథంగా అంగీకరించాలి.

నిష్పాక్షికతను ప్రధానంగా మూడు విభాగాలుగా అర్థం చేసుకోవచ్చు : **విలువ-నిరపేక్షత** (Value Neutrality), **వస్తునిష్ఠత** (Ontological Objectivity), **విధానపరమైన నిష్పాక్షికత** (Methodological Objectivity).

విలువ-నిరపేక్షత అనేది పరిశోధకుడు తన వ్యక్తిగత విలువలను పరిశోధనా ప్రక్రియలో చేర్చకుండా ఉండటాన్ని సూచిస్తుంది.

వస్తునిష్ఠత అనేది సత్యం, వాస్తవికత అనేది పరిశోధకుడి ఆలోచనలకు అతీతంగా, బాహ్యంగా ఉంటుందని నమ్మడం. ఇక విధానపరమైన నిష్పాక్షికత అనేది పరిశోధనలో ఉపయోగించే పద్ధతులు, నమూనాలు పక్షపాతాలకు తావివ్వకుండా ఉండేలా చూసుకోవడం. ఈ మూడు భావనలు పరిశోధనలో నిష్పాక్షికతను ఒక సమగ్ర సూత్రంగా బలోపేతం చేస్తాయి.

తెలుగు పరిశోధన చరిత్రలో పక్షపాత రూపాలు

తెలుగు సాహిత్య పరిశోధనలో నిష్పాక్షికత ఒక ప్రధాన సవాలుగా మారింది. తెలుగులో పరిశోధన ప్రాచీన పద్ధతుల నుండి ఆధునిక శాస్త్రీయ పద్ధతులకు మారుతున్నప్పుడు పక్షపాతాలు ప్రభావం చూపాయి. ఈ పక్షపాతాలు ప్రధానంగా సంప్రదాయాలు, సామాజిక విలువలు, భాషా సంబంధమైనవి. తెలుగు సాహిత్య పరిశోధనలో వివిధ రకాల పక్షపాతాలు ఎలా ప్రభావం చూపాయో, ప్రస్తుతం కనిపించే పక్షపాతాలు ఎలా ఉన్నాయో గమనించవచ్చు.

గ్రాంధిక భాషా పక్షపాతం :

తెలుగు సాహిత్య చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన పక్షపాతం. 20వ శతాబ్దం ప్రారంభంలో వ్యావహారిక భాషోద్యమం మొదలయ్యే వరకు, పండితులు గ్రాంధిక భాషను మాత్రమే ప్రామాణికంగా పరిగణించడం. వ్యావహారిక భాషలో రాసిన రచనలను, పత్రికా సాహిత్యాన్ని 'సాహిత్యం' గా గుర్తించక పోవడం. దీనివల్ల కన్యాశుల్కం వంటి నాటకాలు, శ్రీశ్రీ వంటి కవుల కవిత్వం మొదట్లో చిన్నచూపుకు గురయ్యాయి. పరిశోధనలో ఈ భాషా పక్షపాతం కొనసాగడం వల్ల, ప్రాచీన కవిత్వాలపై ఎక్కువ పరిశోధనలు జరిగాయి, కానీ ఆధునిక వచన ప్రక్రియలు, జానపద సాహిత్యంపై తగినంత దృష్టి సారించలేదు.

ప్రాచీన కావ్యాల పక్షపాతం:

పరిశోధనలు ఎక్కువగా పద్య కావ్యాలైన మహాభారతం, రామాయణం, ప్రబంధాలపై మాత్రమే కేంద్రీకృతమయ్యాయి . ఈ పక్షపాతం వల్ల, వేమన పద్యాలు, జానపద సాహిత్యం, కథలు, నాటకాలు వంటి ఇతర ప్రక్రియలపై పరిశోధనలు చాలా తక్కువగా జరిగాయి. పద్యం అనేది ఉన్నత స్థాయి సాహిత్యమని, మిగతావి తక్కువ స్థాయివని ఒక అలిఖిత భావన ఉండేది. ఈ పక్షపాతం వల్ల తెలుగు సాహిత్య చరిత్ర అసంపూర్ణంగా, కేవలం ఒకే కోణంలో మాత్రమే చిత్రించబడింది.

విశ్వవిద్యాలయాలలో ప్రారంభ దశలో జరిగిన పక్షపాతం

1950ల తర్వాత విశ్వవిద్యాలయాల్లో పరిశోధన వ్యవస్థీకృతమైనప్పటికీ, కొన్ని రకాల పక్షపాతాలు కొనసాగాయి.

ప్రక్రియా పక్షపాతం : విశ్వవిద్యాలయాలలో కవిత్వం, నవల, కథ వంటి ప్రక్రియలపై పరిశోధనలకే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. దీనికి భిన్నంగా, వ్యాసం, జీవిత చరిత్రలు, ఆత్మకథలు, నాటకం, పత్రికా సాహిత్యం వంటి ప్రక్రియలపై పరిశోధనలు చాలా తక్కువగా జరిగాయి. ఉదాహరణకు, తెలుగు సినిమా ఒక ముఖ్యమైన మాధ్యమంగా మారినప్పటికీ, దీనిపై సాహిత్యపరమైన పరిశోధనలు చాలా అరుదుగా జరిగాయి.

ప్రాంతీయ పక్షపాతం : తెలంగాణ, ఉత్తరాంధ్ర వంటి ప్రాంతాల సాహిత్యంపై పరిశోధనలు తక్కువగా జరిగాయి. ఒకే ప్రాంతానికి చెందిన పరిశోధకులు తమ ప్రాంత రచయితల రచనలకే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. దీనివల్ల తెలంగాణ, ఉత్తరాంధ్ర సాహిత్యంపై లోతైన పరిశోధనలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

వర్గ పక్షపాతం : ఈ పక్షపాతం అచేతనంగా కొనసాగేది. అణగారిన వర్గాల రచయితల రచనలకు, లేదా దళిత సాహిత్యం వంటి వాటికి తగిన గుర్తింపు లభించలేదు. వారి రచనలను 'సామాజిక సాహిత్యం' అనే ఒక ప్రత్యేక వర్గంలో పరిమితం చేసి, వాటి కళాత్మక విలువలను విస్మరించారు.

తెలుగు పరిశోధన చరిత్రను విశ్లేషిస్తే, పక్షపాతాలు వివిధ దశల్లో తమ రూపాన్ని మార్చుకున్నాయి. ప్రస్తుత తెలుగు పరిశోధనలోని పక్షపాత రూపాలు :

వ్యక్తిగత పక్షపాతం :

వ్యక్తిగత పక్షపాతం అనేది ఒక పరిశోధకుని వ్యక్తిగత అభిరుచులు, అనుభవాలు, నమ్మకాలు వారి విద్యా పరిశోధనపై తెలియకుండానే ప్రభావం చూపడం. ఇక్కడ పరిశోధకులు తమ ముందే ఏర్పడిన అభిప్రాయాలను సమర్థించే ఆధారాలపై మాత్రమే దృష్టి పెడతారు, వాటికి విరుద్ధమైన సమాచారాన్ని విస్మరిస్తారు. తెలుగు సాహిత్య పరిశోధనలో, ఇది ఇష్టపడే రచయితల లేదా ఉద్యమాలపై అవసరానికి మించి పొగడ్తలు లేదా, దానికి విరుద్ధంగా, ఇష్టం లేని రచనలపై కేవలం వ్యక్తిగత అభిప్రాయాల ఆధారంగా విమర్శలు చేయడంలా కనిపించవచ్చు. సాహిత్య అధ్యయనాలలో, వ్యక్తిగత విమర్శకు, ఇష్టానికి మధ్య హద్దులు మసకబారతాయి. దీని వల్ల పరిశోధనా సమగ్రతను కాపాడుకోవడానికి స్వీయ-అవగాహన, పారదర్శకత చాలా ముఖ్యమైనవి.

ఉదాహరణకు **రచయితల ప్రాధాన్యత పక్షపాతం :** విశ్వనాథ సత్యనారాయణ రచనలను బాగా అభిమానించే ఒక పరిశోధకుడు, ఆయన రచనల్లోని పితృస్వామ్య అంశాలను విస్మరించి, తెలుగు సాహిత్య సంప్రదాయానికి ఆయన చేసిన కృషిని మాత్రమే నొక్కి చెప్పవచ్చు. దీనికి విరుద్ధంగా, మరో పరిశోధకుడు శ్రీశ్రీ విప్లవ కవిత్వంలోని పరిమితులపై మాత్రమే దృష్టి పెట్టి, ఆయన

భాషాపరమైన నూతన పోకడలను, సాంస్కృతిక ప్రభావాన్ని తక్కువ అంచనా వేయవచ్చు. ఈ పక్షపాతపు విశ్లేషణలు తరచుగా సమతుల్యమైన విమర్శనాత్మక అంచనాకు బదులుగా వ్యక్తిగత అభిరుచులను ప్రతిబింబిస్తాయి.

సాహిత్య ప్రక్రియ ప్రాధాన్యత : పక్షపాతం :

పద్య కవిత్వంపై ఆసక్తి ఉన్న ఒక పండితుడు, ఆధునిక కవుల నూతన ప్రయోగాలను కళాత్మకంగా తక్కువగా చూడవచ్చు. మరోవైపు, ఆధునిక పోకడలపై ఉత్సాహంగా ఉన్న మరొక పరిశోధకుడు, పద్యం లాంటి సాంప్రదాయిక ప్రక్రియలను కాలం చెల్లినవిగా లేదా అప్రస్తుతంగా భావించవచ్చు. ఈ పక్షపాతం వివిధ సాహిత్య ప్రక్రియలు, కాలాలకు అసమానమైన మూల్యాంకన ప్రమాణాలను దారితీస్తుంది.

భావజాల పక్షపాతం :

పరిశోధకులు తమ విశ్లేషణను ఒక నిర్దిష్ట రాజకీయ, తాత్విక లేదా సైద్ధాంతిక చట్రం ద్వారా మాత్రమే చూసినప్పుడు భావజాల పక్షపాతం ఏర్పడుతుంది. ఇది తరచుగా ఇతర విశ్లేషణలను విస్మరించడానికి దారితీస్తుంది. తెలుగు సాహిత్య విమర్శలో మార్క్సిస్టు దృక్పథం చాలా ప్రభావం చూపింది. అనేకమంది పరిశోధకులు తమ విశ్లేషణల్లో ప్రధానంగా వర్గ పోరాటం, ఆర్థిక పరిస్థితులు, సామాజిక స్థాయిలపై దృష్టి పెట్టారు. ఈ దృక్పథం ఉపయోగకరమైన అంతర్దృష్టులను ఇవ్వగలిగినప్పటికీ, అది గొప్ప సాహిత్య రచనలను కేవలం భావజాలాలకు ఉదాహరణలుగా తగ్గిస్తుంది. ఫలితంగా, వాటి కళాత్మక అంశాలు, మానసిక సంక్లిష్టత, వివిధార్థాలను విస్మరిస్తుంది.

శోధ్‌గంగలోఅనేక సిద్ధాంత గ్రంథాలు ఈ ధోరణిని చూపిస్తాయి. ఉదాహరణకు, అభ్యుదయ రచయితల ఉద్యమంపై చేసిన పరిశోధనలు, వర్గ పోరాటాన్ని స్పష్టంగా ప్రస్తావించే రచనలను కేవలం ప్రశంసించడం మాత్రమే కనిపిస్తుంది.

జెండర్ పక్షపాతం :

తెలుగు సాహిత్య పరిశోధన ప్రారంభం నుంచి కొంత కాలం వరకు మహిళా రచయితల రచనలకు తక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. మహిళల రచనల విమర్శనాత్మక ఆదరణ తరచుగా జెండర్ - ఆధారిత మూల్యాంకన ప్రమాణాల వల్ల ప్రభావితమవుతుంది. ఈ ప్రమాణాలు వారి రచనలను పరిమితమైనవిగా కొట్టిపారేస్తాయి. మహిళా రచయితల రచనలు మహిళల రచనలుగా వర్గీకరించబడి, ప్రధానంగా కుటుంబ సంబంధాలు, గృహ జీవితం వంటి స్త్రీ సంబంధిత అంశాలపై మాత్రమే దృష్టి పెట్టాయి. అయితే పురుష రచయితలు సార్వత్రిక మానవ సమస్యల గురించి రాసేవారిగా

పరిగణించబడ్డారు. ఈ వర్గీకరణ విస్తృత సాహిత్య రంగంలో మహిళల దృక్పథాలను మరింత అణగదొక్కుతుంది.

పరిశోధన లోపాలు, ఉదాహరణలు

తక్కువ ప్రాతినిధ్యం : ముద్దుపళని రాధికా సాంత్వనంపై సమగ్ర పరిశోధన లేకపోవడం అనే పరిశోధకుడి పరిశీలన దృక్పథం, జెండర్ పక్షపాతం ఎలా పని చేస్తుందో చూపిస్తుంది. ఈ రచన పురుష రచయితల రచనలతో పోలిస్తే తగినంత గుర్తింపు పొందలేదు. ఫలితంగా తెలుగు సాహిత్య చరిత్రపై మన అవగాహనలో ముఖ్యమైన అంతరం ఏర్పడింది.

భాషా పక్షపాతం : ప్రమాణీకరణ, మాండలిక వివక్ష

తెలుగు సాహిత్య పరిశోధనలో భాషా పక్షపాతం కొన్ని మాండలికాలు, భాషా శైలులకు, ప్రామాణిక సాహిత్య ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఇది తెలంగాణ, రాయలసీమ, తీరప్రాంత భాషలను మాండలికాలుగా పేర్కొనింది. ఈ పక్షపాతం కొంత కాలం పాటు ఏ రచనలు భాషాపరంగా ప్రామాణికమైనవిగా, అధ్యయనానికి యోగ్యమైనవిగా పరిగణించబడతాయో ప్రభావితం చేసింది. ఫలితంగా అనేక ప్రాంతీయ వ్యక్తీకరణలు విమర్శనాత్మక పరిశీలన నుండి మినహాయించబడ్డాయి.

మాండలిక వివక్ష : తెలంగాణ మాండలికం లేదా రాయలసీమ భాషలో వ్రాసిన సాహిత్య రచనలు తరచుగా ఇతర ప్రాంతాల విమర్శకులచే ప్రాంతీయమైనవి లేదా అపరిపక్వమైనవిగా కొట్టివేయబడ్డాయి. ఈ ప్రాంతీయ భాషా ఆలోచన విభిన్న తెలుగు సాహిత్య వ్యక్తీకరణల పూర్తి అభినందనను అడ్డుకుంది.

పద్యం vs వచన ప్రాధాన్యతలు :

పద్యం, సంస్కృతీకరించిన తెలుగుకు అనుకూలంగా ఉండే పక్షపాతం మాండలిక రచయితలకు నష్టం కలిగించింది. ఈ ప్రాధాన్యత ముఖ్యంగా సమకాలీన భాషా శైలిని, పట్టణ అనుభవాలను

తమ సాహిత్యంలో చూపించాలనుకునే ఆధునిక, సమకాలీన రచయితలను ప్రభావితం చేసింది.

ప్రాంతీయ పక్షపాతం :

తెలుగు సాహిత్య పరిశోధనలో ప్రాంతీయ పక్షపాతం వివిధ తెలుగు మాట్లాడే ప్రాంతాల మధ్య ఉన్న చారిత్రక , సాంస్కృతిక విభేదాలను, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర, తెలంగాణల మధ్య ఉన్న పోటీని ప్రతిబింబిస్తుంది. పరిశోధకులు తరచుగా తమ ప్రాంతానికి చెందిన రచయితలకు తెలియకుండానే ప్రాధాన్యత ఇస్తారు. ఇది చారిత్రక అభివృద్ధి, వివిధ ప్రాంతాలలోని వేర్వేరు సాహిత్య వ్యవస్థలు, రచయితలకు ఉన్న అవకాశాల ఆధారంగా ఏర్పడింది.

సాహిత్య విభాగాల కేంద్రీకరణ కొన్ని ప్రాంతాలలో ఉన్న విద్యా సంస్థల కారణంగా ఈ పక్షపాతాలను మరింత బలోపేతం చేసింది. కొన్ని ప్రధాన విశ్వవిద్యాలయాలు సాంప్రదాయకంగా తెలుగు సాహిత్య పరిశోధనలో ఆధిపత్యం వహించాయి. ఇది ఈ ప్రాంతాలకు చెందిన రచయితలకు ఎక్కువ విమర్శనాత్మక దృష్టిని కలిగించింది.

కుల/వర్గ పక్షపాతం

కుల/వర్గ పక్షపాతం తెలుగు సాహిత్య అధ్యయనాలలో అత్యంత లోతైన, చారిత్రకంగా కొనసాగుతున్న పక్షపాతాలలో ఒకటి. శతాబ్దాలుగా, సాహిత్య ఉత్పత్తి, విమర్శ ఉన్నత వర్గాలు ఆధిపత్యం చెలాయించారు. వారు తమ సౌందర్య ప్రాధాన్యతలు, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే ప్రమాణాలను స్థాపించారు. ఈ చారిత్రక ఆధిపత్యం దళిత, బహుజన, ఆదివాసీ వర్గాల సాహిత్య రచనలను క్రమపద్ధతిలో తక్కువగా అంచనా వేయడానికి దారితీసింది. వారి సృజనాత్మక వ్యక్తీకరణలు సాధారణ సంప్రదాయాలు, సౌందర్య చట్రాల వెలుపల పనిచేశాయి.

ఈ పక్షపాతం వర్గ కోణం మధ్యతరగతి, ఉన్నత వర్గాల అనుభవాలను ప్రతిబింబించే సాహిత్యాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే శ్రామిక వర్గాల దృక్పథాలను , కథనాలను అణగదొక్కుతుంది. తెలుగు సాహిత్యంపై పరిశోధన సాంప్రదాయకంగా విద్యావంతులైన ఉన్నత వర్గాలకు సంబంధించిన సాహిత్య సంప్రదాయాలు, తాత్విక ఆందోళనలతో కూడిన గ్రంథాలను ఆదరిస్తుంది. అయితే మౌఖిక సంప్రదాయాలు, జానపద రూపాలు, ప్రజా సంస్కృతులలో మూలాలు ఉన్న సాహిత్యాన్ని తక్కువగా భావిస్తుంది. ఇప్పుడు మరికొంతమంది పరిశోధక విద్యార్థులు పూర్తి భిన్నంగా కొన్ని వర్గాల వారి సాహిత్యాన్ని విమర్శించడం కోసమే పరిశోధన చేస్తున్నారు.

సమాచార పక్షపాతం

పరిశోధకులు పరిమిత లేదా ప్రాతినిధ్యం లేని వనరులపై ఆధారపడినప్పుడు సమాచార పక్షపాతం ఏర్పడుతుంది. ఇది వక్రీకరించిన ముగింపులకు , సాహిత్య దృగ్విషయాలపై అసంపూర్ణ అవగాహనకు దారితీస్తుంది. తెలుగు సాహిత్య పరిశోధనలోసులభంగా లభించే సామగ్రిపై అతిగా ఆధారపడటం ద్వారా వ్యక్తమవుతుంది. అయితే తక్కువగా తెలిసిన రచనలు, ప్రచురణలు , ప్రాంతీయ వనరులను నిర్లక్ష్యం చేస్తుంది.

తెలుగు సాహిత్యానికి సంబంధించిన పూర్వపు సమాచారం ముఖ్యమైన లోపాలను, అసమానతలను కలిగి ఉంది. ఇది కొన్ని కాలాలు, ప్రాంతాలు, వర్గాలకు చెందిన సామగ్రిని భిన్నంగా వ్యాఖ్యానించింది. ఈ అసమానతలు కారణంగా పరిశోధనాలోపాలు రూపొందాయి. ఈ పరిమితులను అధిగమించడానికి స్పష్టమైన ప్రయత్నాలు జరగాలి. పరిశోధకులు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పూర్తిగా రికార్డు చేయాలి.

ప్రక్రియా పక్షపాతం

ప్రక్రియా పక్షపాతం అంటే పరిశోధనలో కొన్ని సాహిత్య రూపాలు, ప్రక్రియలకు ఇతర వాటిపై ప్రాధాన్యత ఇవ్వడం. తెలుగు సాహిత్య అధ్యయనాలలో కవిత్వం, కథ, నవల, నాటకం ప్రక్రియలతో పోలిస్తే ఆత్మకథ, యాత్రా రచన, వ్యాస సంకలనాలు వంటి ఇతర ప్రక్రియపై జరిగిన పరిశోధన చాలా తక్కువగా ఉంటుంది. సినిమా, టెలివిజన్ రచనలను సాహిత్య రూపాలుగా నిర్లక్ష్యం చేయడం అనేది పరిశోధకుని పరిశీలన, ప్రక్రియా పక్షపాతం ఎలా పనిచేస్తుందో చూపిస్తుంది. అనేక తెలుగు చలనచిత్ర రచనలు గొప్ప సాహిత్య విలువలు ఉన్నప్పటికీ, ఈ రూపాలు అరుదుగా అధ్యయనంలో చోటు సంపాదించుకున్నాయి. ఉన్నత సాహిత్య సంస్కృతి, జనాదరణ పొందిన సాహిత్య ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకోదు.

ప్రచురణ పక్షపాతం

ప్రచురణ పక్షపాతం అంటే పరిశోధనా పత్రికలు తమ ఆలోచనా ధోరణికి చెందిన వ్యాసాలను మాత్రమే ప్రచురించడానికి మొగ్గు చూపడం. దీనివల్ల కొత్త పరిశోధనా పద్ధతులు, విభిన్న ఆలోచనలు వెలుగులోకి రావు. పరిశోధనలో ఏకాభిప్రాయం ఏర్పడుతుంది.

ఈ పక్షపాతాలను అధిగమించడానికి, తెలుగు సాహిత్య పరిశోధకులు తమ వ్యక్తిగత అభిరుచులకు, భావజాలాలకు అతీతంగా, సాహిత్యాన్ని ఒక సమగ్రమైన, నిష్పాక్షికమైన దృక్పథంతో విశ్లేషించాలి.

పరిశోధనలో నిష్పాక్షికత VS పక్షపాతం మధ్య సంఘర్షణ :

నిష్పాక్షికత ఒక ఆదర్శం, పక్షపాతం ఒక వాస్తవం. పరిశోధన అనేది ఒక మానవ చర్య కాబట్టి, పక్షపాతం పూర్తిగా తప్పించడం అసాధ్యం. పరిశోధకులు తమ అనుభవాలు, సామాజిక నేపథ్యం, అచేతన నమ్మకాల ప్రభావంలో ఉంటారు.

తెలుగు సాహిత్య పరిశోధనలో ఈ సంఘర్షణ నిరంతరం కనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక సాహితీ చరిత్రకారుడు తెలుగు సాహిత్యాన్ని పద్య-ప్రధానమైన కవిత్వం కేంద్రంగా మాత్రమే

చూసినప్పుడు, వచన ప్రక్రియలు, జానపద సాహిత్యం లేదా దళిత సాహిత్యం వంటివి విస్మరించబడ్డాయి. అయితే, కొత్త పరిశోధనా పద్ధతులు, సామాజిక ఉద్యమాలు ఈ పక్షపాతాలను సవాల్ చేసి కొత్త పంథాను చూస్తున్నాయి.

పక్షపాతాన్ని తగ్గించే పద్ధతులు

తెలుగు సాహిత్య పరిశోధనలో పక్షపాతాలను తగ్గించడానికి అనేక పద్ధతులు ఉపయుక్తమవుతాయి. ఇవి పరిశోధనకు నిష్పాక్షికతను, విశ్వసనీయతను చేకూర్చడానికి సహాయపడతాయి.

బహుముఖ దృక్పథం

ఒక సాహిత్య రచనను కేవలం ఒకే కోణం నుంచి కాకుండా, వివిధ సామాజిక, చారిత్రక, తాత్విక కోణాల నుండి విశ్లేషించడం. ఉదాహరణకు తెలుగులో ప్రాచీన సాహిత్యాన్ని కేవలం మతపరమైన కోణంలో కాకుండా, ఆనాటి రాజకీయ వ్యవస్థ, సామాజిక విలువలు, భాషా వికాస కోణాల నుండి విశ్లేషించడం వలన పరిశోధన మరింత సంపూర్ణంగా ఉంటుంది. అదే విధంగా ఇప్పుడు ఉన్న వివిధ ఉద్యమాల సాహిత్యాన్ని కేవలం ఒకే దృక్పథం నుంచి కాకుండా అందులోని గుణ దోషాలను తెలపాలి.

విలువ నిర్ణయ విమర్శ (Evaluative Criticism) :

గతంలో జరిగిన విమర్శలను, సాహిత్య రచనలను తిరిగి విశ్లేషించడం. బహుజన, దళిత, స్త్రీవాద ఉద్యమాల ప్రభావంతో ఈ పద్ధతికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది గత విమర్శలలోని పక్షపాతాలను బహిర్గతం చేయడమే కాకుండా, విస్మరించబడిన లేదా తక్కువగా అంచనా వేయబడిన రచనలకు కొత్త ప్రాధాన్యతను ఇస్తుంది.

మూలాల పారదర్శకత : పరిశోధనలో ఉపయోగించిన మూలాలను, వాటి రచయితల నేపథ్యాన్ని, ఆ మూలాల విశ్వసనీయతను స్పష్టంగా వెల్లడించడం. ఇది పరిశోధన ప్రామాణికతను పెంచుతుంది. ఒక పరిశోధకుడు తాను ఎంచుకున్న మూలాలు ఏ పక్షపాతంతో రాశారో పేర్కొనడం అవసరం.

పీర్ రివ్యూ (Peer Review) : పరిశోధకుడు పరిశోధన గ్రంథం సమర్పించడానికి ముందు పరిశోధనా వ్యాసాలను సాహిత్య పత్రికల్లో ప్రచురించడం. పరిశోధన పత్రాన్ని ప్రచురణకు ముందు అదే రంగంలోని ఇతర నిపుణులు సమీక్షిస్తారు. ఈ పద్ధతి వ్యక్తిగత లేదా పద్ధతి పక్షపాతాలను గుర్తించి, వాటిని సరిచేయడానికి సహాయ పడుతుంది. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు ఈ పద్ధతిని ప్రోత్సహించడం వలన పరిశోధన నాణ్యత మెరుగుపడుతుంది.

స్వీయ-పరిశీలన

ఒక పరిశోధకుడు తన వ్యక్తిగత అభిప్రాయాలు, నమ్మకాలు, సాంస్కృతిక నేపథ్యం తన పరిశోధనను ఎలా ప్రభావితం చేయవచ్చో నిరంతరం స్వీయ-పరిశీలన చేసుకోవాలి. ఈ స్వీయ-స్పృహ

పక్షపాతాలను తగ్గించడానికి మొదటి అడుగు. ఇది పరిశోధకుడిని తన భావజాలానికి అతీతంగా నిష్పాక్షికంగా ఉండేలా చేస్తుంది.

తెలుగు సాహిత్యంలో పక్షపాతానికి ప్రతిచర్య-పరిశోధనలో ఆధునిక సాంకేతికతల పాత్ర :

తెలుగు సాహిత్య పరిశోధనలో నిష్పాక్షికతను సాధించడం ఒక సవాలుతో కూడుకున్నది. ఎందుకంటే సాహిత్యం ఒక వ్యక్తిగత, భావోద్వేగ ప్రక్రియ. ఒక పరిశోధకుడు ఒక రచనపై తన భావోద్వేగాలను లేదా అభిరుచులను పూర్తిగా పక్కన పెట్టడం కష్టం. అయినప్పటికీ, దాని ప్రభావం పరిశోధనా ఫలితాలపై పడకుండా జాగ్రత్త పడటం ముఖ్యం. తెలుగు సాహిత్య పరిశోధనలో సాంప్రదాయ పద్ధతులతో పాటు, ఆధునిక సాంకేతికతలు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. ముఖ్యంగా, డిజిటల్ పరికరాలు పరిశోధకులకు నిష్పాక్షికంగా సమాచారాన్ని విశ్లేషించడానికి సహాయపడుతున్నాయి.

డిజిటల్ లైబ్రరీలు, వివిధ సమాచార కేంద్రాలు

గతంలో, పరిశోధన చేయాలంటే పండితులు లైబ్రరీలకు వెళ్లి, తాళపత్ర గ్రంథాలు లేదా పాత పత్రికల కోసం గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు డిజిటల్ గ్రంథాలయాలలో వేలాది తెలుగు గ్రంథాలు, పత్రికలు, డిజిటలైజ్ చేసి, అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులో ఉంచాయి.

బహుళ వనరుల లభ్యత : ఒక పరిశోధకుడు ఒకే పుస్తకం లేదా ఒకే రచయితపై ఆధారపడకుండా, సులభంగా వేర్వేరు వనరుల నుంచి సమాచారాన్ని సేకరించవచ్చు. ఉదాహరణకు, ఒక పత్రికలో వచ్చిన కథపై పరిశోధన చేయాలంటే, ఆ పత్రికలోని ఇతర కథలను, వ్యాసాలను సులభంగా చూడవచ్చు.

పక్షపాతం తగ్గింపు : ఒక పరిశోధకుడు తాను నమ్మే విషయాన్ని బలపరచడానికి అనుకూలమైన సమాచారాన్ని మాత్రమే ఎంచుకునే అవకాశం తగ్గుతుంది. ఎందుకంటే, ఒకే క్లిక్‌తో వందల వనరులు అందుబాటులో ఉంటాయి కాబట్టి, అన్ని కోణాల నుంచి విశ్లేషించే అవకాశం లభిస్తుంది.

టెక్స్ట్ మైనింగ్ టూల్స్ :

టెక్స్ట్ మైనింగ్ (Text Mining) అనేది ఒక కంప్యూటర్ టెక్నిక్.

ISSN 2457-0796

దీని ద్వారా ఒక రచనలో ఉన్న పదాలను, వాక్యాలను, వస్తువును నిష్పాక్షికంగా విశ్లేషించవచ్చు. ఈ పరికరాలు మానవ పరిశోధకుడి భావోద్వేగాలను లేదా అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవు. ఉదాహరణకు ఒక పరిశోధకుడు కందుకూరి వీరేశలింగం రచనలలో 'వితంతువు'అనే పదం ఎన్నిసార్లు ఉపయోగించబడిందో, ఏ సందర్భాల్లో ఉపయోగించబడిందో ఈ టూల్స్ సహాయంతో కచ్చితంగా విశ్లేషించవచ్చు.

ఒక కవి రచనలలోని పదాలను విశ్లేషించడం ద్వారా, ఆ కవికి సమాజంపై, మతంపై, లేదా సంప్రదాయాలపై ఉన్న దృక్పథాన్ని నిష్పాక్షికంగా అంచనా వేయవచ్చు. ఉదాహరణకు, ఒక రచయిత రచనలలో 'దుఃఖం' 'బాధ' వంటి పదాలు ఎక్కువగా ఉంటే, ఆ రచనల్లో విషాదభరితమైన అంశాలు ఎక్కువగా ఉన్నాయని నిర్ధారించవచ్చు. ఇది పరిశోధకుడి ఊహలకు లేదా అచేతన పక్షపాతాలకు అతీతంగా, కేవలం సమాచారం ఆధారంగా ఒక నిర్ణయానికి రావడానికి సహాయపడుతుంది.

పరిశోధనలో కృత్రిమ మేధ (AI)

కృత్రిమ మేధ పరిశోధనలో కొత్త మార్గాలను చూపుతుంది. పరిశోధకులు కృత్రిమ మేధకి శిక్షణ ఇచ్చేటప్పుడు సమతుల్యమైన, నిష్పాక్షికమైన సమాచారాన్ని ఉపయోగించాలి. వివిధ వర్గాలకు చెందిన రచనలు, విమర్శలు, అభిప్రాయాలను కృత్రిమ మేధకి పరిచయం చేయడం ద్వారా, అది మరింత నిష్పాక్షిక ఫలితాలను ఇవ్వగలదు. సారాంశంలో, సాంకేతికతలు పరిశోధనలో నిష్పాక్షికతను పెంచుతున్నప్పటికీ, వాటిని ఉపయోగించేటప్పుడు పరిశోధకులు జాగ్రత్త వహించాలి. ఈ పరికరాలు ఒక సహాయకారి మాత్రమే, అంతిమ నిర్ణయం పరిశోధకుడి విమర్శనాత్మక దృక్పథంపైనే ఆధారపడి ఉంటుంది.

ముగింపు :

తెలుగు సాహిత్య పరిశోధనలో నిష్పాక్షికతను సాధించడం ఒక నిరంతర ప్రయత్నం. పక్షపాతం పరిశోధన నాణ్యతను, నైతికతను సవాల్ చేసినప్పటికీ, దీనిని నిర్లక్ష్యం చేయకూడదు. తెలుగు సాహిత్యంలో పక్షపాతాలు (ప్రాంతీయ, భాషా, జెండర్, కుల సంబంధమైన కారణాలతో లోతుగా పాతుకుపోయాయి. ప్రస్తుత పరిశోధకులు ఈ పక్షపాతాలకు వ్యతిరేకంగా సాహిత్య పరిశోధనకు ఒక కొత్త, సమగ్ర దృక్పథాన్ని అందించవలసిన అవసరం ఉంది. భవిష్యత్తులో నిష్పాక్షిక పరిశోధనను ప్రోత్సహించడానికి మూడు కీలక అంశాలు చాలా అవసరం. నైతిక నిబద్ధత, పారదర్శకత, బహుముఖ దృక్పథం. నైతిక నిబద్ధత అంటే పరిశోధకులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిజాయితీగా నిర్వహించడం. దీనిలో పరిశోధన సమాచారాన్ని పక్షపాతాలు లేకుండా ఫలితాలను వెల్లడించడం ముఖ్యం. పరిశోధకులు తమ వ్యక్తిగత అభిప్రాయాలు లేదా ఆర్థిక ప్రయోజనాలు పరిశోధన ఫలితాలను ప్రభావితం చేయకుండా చూసుకోవాలి. ఇక పారదర్శకత అంటే పరిశోధన పద్ధతులు, సమాచార సేకరణ, మూలాలను స్పష్టంగా వెల్లడించడం. దీని వల్ల ఇతరులు పరిశోధనను అర్థం చేసుకోవడమే కాకుండా, దాని విశ్వసనీయతను కూడా నిర్ధారించగలరు. చివరగా, బహుముఖ దృక్పథం అంటే ఒకే కోణం నుండి కాకుండా, ఒక అంశాన్ని వివిధ సామాజిక, చారిత్రక, తాత్త్విక కోణాల నుండి విశ్లేషించడం. ఈ విధానం వల్ల ఒక అంశంపై సమగ్ర అవగాహన లభిస్తుంది, పక్షపాతాలు తగ్గించడానికి సహాయపడుతుంది.

❖ ❖ ❖ ❖ ❖

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-



సంప్రదించండి.

మూసీ మాసపత్రిక

ఫోన్ : 934 7971177

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (35) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

విశ్వనాథ వారి 'త్రిశూలం' – పరిశీలన

డా.తత్త్వాది ప్రమోదకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళశాల, జగిత్యాల.
ఫోన్ : 9441024607

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు వచన కవిత్వం మినహా తెలుగు సాహితీ ప్రక్రియలన్నింటిలో రచనలు చేశారు. వాటిలో తనదైన ప్రత్యేకమైన శైలితో ముద్రను వేశారు. వారు రచనల్లో సనాతన సంప్రదాయానికి పెద్దపీట వేస్తారని విమర్శకుల పరిశోధకుల ఏకాభిప్రాయం. అది నిజమే కానీ, ఆ సంప్రదాయ భావాలను ఉద్దేశపూర్వకంగా రుద్దరు. ఉపన్యాస ధోరణి ప్రదర్శించరు. కథా నిర్మాణంలో, పాత్రచిత్రణలో, సంభాషణల్లో, సంవాదనల్లో అనుస్యూతంగా ప్రదర్శిస్తారు. అందువల్ల వారి రచన నిర్మాణంలో బిగువు, తూగు మొదలైనవన్నీ సమపాళ్లలో మేళవించుకుంటాయి. అంతిమంగా ఏమి చెప్పదలచుకున్నారో దానిని ఆద్యంతం రసవత్తర సూత్రంతో కొనసాగిస్తారు. ఆ రసవత్తర సూత్రమే శిల్పం. ప్రాచ్య, పాశ్చాత్య శిల్ప నిర్మాణ రీతులను ఆపోసన పట్టిన విశ్వనాథ వారు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా త్రిశూలం నాటకాన్ని రచించారు.

విశ్వనాథ వారు మొత్తం 17 నాటకాలు రచించారు. అందులో మూడు సంస్కృత నాటకాలు. పదునాల్గు తెలుగు నాటకాలు. తెలుగు నాటకాల్లో నాలుగు విషాదాంత నాటకాలు. పాశ్చాత్య నాటక సాహిత్యం, నాటక ప్రయోగాల పరిచయంతో తెలుగు నేలలోనూ విషాదాంత నాటక రచనలు మొదలయ్యాయి. ఈ ప్రభావంతో విశ్వనాథ వారు నర్తనశాల, వేనరాజు, అనార్కలి, త్రిశూలం నాటకాలను రచించారు నర్తనశాల, వేనరాజు పౌరాణికాలు. అనార్కలి, త్రిశూలం చారిత్రకాలు. త్రిశూలం నాటక కథాకాలం క్రీ.శ. 12వ శతాబ్దం.

కథా వస్తువు :

బసవేశ్వరునికి సంబంధించింది. బసవేశ్వరుడు వీరశైవ మత బోధకుడు. బసవడు నందీశ్వరుని అపరావతారమని శివభక్తుల విశ్వాసం. బసవడు స్థాపించింది, ప్రచారం చేసింది వీరశైవం. వీరశైవం కర్మకాండలను వ్యతిరేకించింది. కేవలం భక్తి మార్గానికి ప్రాధాన్యమిచ్చింది. వర్ణ వ్యవస్థను నిర్వహించింది. మరి నాటక రచయిత సంప్రదాయవాది. కర్మ మార్గావలంబి. కథా వస్తువు చారిత్రకం. కథలో చిన్న చిన్న మార్పులు చేర్పులే కాని పెద్ద మార్పులు చేయడానికి వీలు లేదు. పైగా ఒక సంప్రదాయ మార్గానికి ప్రతినిధి అయిన చారిత్రక పురుషుడు. కావున చారిత్రక సత్యాలు మరుగు పరచరాదు. అలాగని వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపకుండా ఉండలేదు. అందుకని విశ్వనాథ వారు త్రిశూలం నాటక కథా నిర్మాణంలో, పాత్రల మనస్తత్వ చిత్రణలో, సంభాషణల్లో తూగు (Balance)ను సమన్వయ పరిచారు. పాఠకులకు ఆద్యంతం ఉత్కంఠ కలిగించారు.

రచనా నేపథ్యం :

విశ్వనాథ వారు 1922 సంవత్సరంలో బందరు జాతీయ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. ప్రఖ్యాత చిత్రకారుడు జాతీయవాది ప్రమోద కుమార్ ఛటర్జీ కూడా అదే కళాశాలలో అధ్యాపకులు. ఆయన తన చిత్రాలను ప్రదర్శించారు. అందులో త్రిశూలం చిత్రాన్ని చూసిన విశ్వనాథ వారు ఆకర్షితులయ్యారు. **"నాకే కనుక రాజ్యం ఉన్నట్లయితే …… ఈ చిత్రానికి రాజ్యాన్ని ఇచ్చేవాడిని"** అంటూ విశ్వనాథ వారు ఛటర్జీని ప్రశంసించారు. ఆ తర్వాత సంవత్సరం ఛటర్జీ బెంగాల్ వెళ్లిపోయారు. ఆ సమయంలో

"మీరు రాజ్యాన్ని ఇవ్వవలసిన అవసరం లేదు." అంటూ ఛటర్జీ విశ్వనాథ వారికి త్రిశూలం చిత్రాన్ని కానుకగా అందించారు. అప్పుడే వారి మదిలో 'త్రిశూలం' అనే పేరుతో రచన చేయాలనే భావన మొదలై ఉంటుంది. (కోవెల సంపత్కుమారాచార్య, – విశ్వనాథ సాహిత్య దర్శనం, పుట. 177) 1926వ సంవత్సరంలో వేటూరి ప్రభాకరశాస్త్రి గారి పీఠికతో బసవపురాణం ముద్రితమైంది. పీఠికతో పాటు బసవ పురాణాన్ని పరిశీలించిన విశ్వనాథ వారికి కావలసిన ఇతివృత్తం దొరికినట్లయింది. బసవేశ్వరుని చరిత్రను ఆధారంగా చేసుకొని ఈ నాటకాన్ని రచించారు. (కోవెల సంపత్కుమారాచార్య, – విశ్వనాథ సాహిత్య దర్శనం, పుట. 178) అధ్యాపక మిత్రుడు ఛటర్జీ కానుకగా అందించిన త్రిశూలం చిత్రమే నాటకం ముద్రణ పుస్తకానికి ముఖ చిత్రంగా రూపుదిద్దుకుంది.

నాటక కథా నిర్మాణం :

శివుని త్రిశూలంలో మూడు మొనలు ఉన్నట్లే ఈ నాటకంలో మూడు ప్రధాన పాత్రలు. వారు బసవేశ్వరుడు, బిజ్జల దేవుడు,

జగదేవుడు. త్రిశూలంలోని మూడు మొనలు సత్త్వ, రజస్తమో గుణాలకు సంకేతాలు. ఈ త్రిగుణాలకు నాటకంలోని బసవేశ్వరుడు, బిజ్జలుడు, జగదేవుడు ప్రతినిధులని పరిశోధకులు భావించారు. (విశ్వనాథ వారి నాటకములు–పరిశీలన – ఆర్. కమల) బసవేశ్వరుడు సత్త్వ గుణానికి, బిజ్జలుడు రజోగుణానికి, జగదేవుడు తమోగుణానికి ప్రతినిధులని పరిశోధకులు తెలిపారు. తన ఇంట్లో విందు భోజనం చేయాలని జగదేవుడు బసవేశ్వరున్ని ఆహ్వానిస్తాడు. బసవడు షరతులు విధిస్తాడు. సమయం వచ్చినప్పుడు రాజు, కొడుకు, గురువుతో పాటు ఎవరినైనా సంహరించాలనేది షరతు. ఈ షరతును జగదేవుడు అనాలోచితంగా ఒప్పుకొని, రాజు బిజ్జలున్ని చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు. స్వల్ప ప్రయోజనాల కోసం రాజద్రోహానికి సిద్ధమైన జగదేవుడు తమోగుణ యుతుడు. రాజు బిజ్జలునికి రాజ్య విస్తరణా కాంక్ష విపరీతం. మతాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని రాజు ఆలోచన. కావున రాజు రజోగుణరతుడు. బసవేశ్వరుడు సత్త్వ గుణానికి ప్రతినిధిగా భావించుట పాక్షిక సత్యమే. బసవడు మంత్రి పదవిని పొంది మత వ్యాప్తికి సిద్ధమవుతాడు. శైవుల ఆగడాలను అదుపు చేయడు. రాజు శైవుల ఆగడాలను ప్రస్తావించిన సందర్భాల్లో బసవేశ్వరుడు సమర్థిస్తాడు. రాజుకు ఏవో సమాధానాలు చెబుతుంటాడు. ఇవన్నీ బసవేశ్వరుని సత్త్వగుణానికి లోపాలుగా ఉన్నాయి.

త్రిశూల దర్శనం భక్తులకు అభయాన్ని ఇవ్వాలి. దుష్టులకు భయాన్ని కలిగించాలి. కానీ ఈ నాటకంలో త్రిశూల దర్శనం అయిన వారికి ఆపదలు చుట్టుముట్టాయి. భయాందోళనలు ఆవరించాయి. మొదటిసారి చాళుక్య తైలపదేవునకు త్రిశూల దర్శనం అయింది. బిజ్జలునితో జరిగిన యుద్ధంలో తైలపదేవుడు మరణించాడు. ఒకసారి బిజ్జలునికి త్రిశూల దర్శనం అయింది. కాకతీయులతో జరిగిన యుద్ధంలో దండనాయకుడు జగదేవుడు ఓటమి చెందాడు. రెండవసారి బిజ్జలునికి దర్శనమైంది. తెలియని భయాందోళనలు మొదలయ్యాయి. ఆ భయాలు నిజమయ్యాయి. బసవేశ్వరుడు రాజు బిజ్జలుని వధకు పథకం వేసాడు. జగదేవున్ని ప్రేరేపించాడు. రాజ వేదికపై జగదేవున్ని నియమించాడు. జగదేవుడు రాజు బిజ్జలున్ని సంహరించాడు. జగదేవుడూ మరణించాడు. బసవేశ్వరుడు లింగైక్యం చెందాడు. కల్యాణకటకం నశించింది.

రాజు శివద్రోహం చేసిన కారణంగా శైవులు కల్యాణకటకాన్ని వదిలి వెళ్లారని, బసవేశ్వరుని శాప ఫలితంగా రాజధాని కల్యాణ కటకం నశించిందని వీరశైవ పురాణాలు పేర్కొన్నాయి. కానీ బిజ్జలుడు, బసవేశ్వరుడు ఇద్దరూ ద్రోహులే అని త్రిశూలం నాటకం ద్వారా తెలుస్తున్నది. **"శివ ద్రోహమునకు కళ్యాణకటకము నశించుచున్నది. రాజ ద్రోహమునకు వీరశైవ మతము నశించుచున్నది."** అని నాటకం చివరలో జగదేవునితో విశ్వనాథ వారు తీర్పు చెప్పించారు. దోషాలు, ద్రోహాలు బిజ్జలునిలోనే కావు బసవేశ్వరునిలో కూడా ఉన్నట్లు విశ్వనాథ వారు నాటక కథను మలిచారు. అందువల్ల ద్రోహబుద్ధి, దోషాలు కలిగిన బసవేశ్వరుడు సత్త్వగుణసంపన్నుడని చెప్పడం సత్యదూరమే అవుతుంది. నాటకంలోని కథావస్తువు ప్రధానంగా బసవపురాణం, బసవేశ్వర చరిత్ర ఆధారంగా కొనసాగింది. ఇందులోని వస్తువు పాత్రలు దాదాపు అన్నీ చారిత్రిక సంబంధమైనవే. కొన్ని సన్నివేశాలు మాత్రం కల్పితం. ముఖ్యంగా కాకతి ప్రోలరాజుతో యుద్ధ వృత్తాంతం.

కాలచురి వంశానికి చెందిన బిజ్జలుడు కళ్యాణ కటకానికి ప్రభువు. మొదట పశ్చిమ చాళుక్యరాజు తైలపదేవుని వద్ద సామంతుడు. తర్వాత తైలపదేవుని వధించి స్వతంత్రుడవుతాడు. ఆ తర్వాత భారతదేశాన్ని కనీసం దక్షిణాపథాన్ని అయినా ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలాలని బిజ్జలుని ఆకాంక్ష. యుద్ధ వ్యూహాలకు కర్త మంత్రి బలదేవుడు. బలదేవుని మరణానంతరం బసవేశ్వరున్ని మంత్రిగా నియమించాడు బిజ్జలుడు. బసవడు వీరశైవ మత స్థాపకుడు. అతడు మహిమలు కలిగిన వాడిగా పేరొందాడు. బసవని మహిమలను ప్రత్యక్షంగా గమనించాడు బిజ్జలుడు. బసవని మహిమలతో కాకతి ప్రోలరాజును ఓడించాలని సామ్రాజ్య విస్తరణ చేయాలని బిజ్జలుడు భావించాడు. ఈ విషయంలో బిజ్జలునికి నిరాశ ఎదురయింది. దీనితో బసవడిపై, శైవులపై వ్యతిరేకత ఏర్పడింది. రాజ్యంలో రోజురోజుకు శైవుల దురాగతాలు పెరిగాయి. వారిని అదుపు చేయాలని బిజ్జలుడు భావించాడు.

ఆ సందర్భాల్లో బసవడు శైవులను సమర్థించాడు. శైవులకు అనుగుణంగా బసవడు మహిమలను ప్రదర్శించాడు. శివ భక్తులు అల్లయ్య, మధుపయ్యలు రాజద్రోహం చేశారు. రాజు శిక్ష విధించాడు. శివ భక్తులను రాజు శిక్షించుట శివ ద్రోహంగా బసవడు భావించాడు. రాజును వధించడానికి బసవడు పథకం వేసాడు. రాజవధకు జగదేవున్ని నియమించాడు. బసవడు లింగైక్యం చెందాడు. రాజుతోపాటు జగదేవుడూ మరణించాడు.

పాత్రచిత్రణ :

నాటక కథానుగుణంగా అనేక పాత్రలు ఉన్నప్పటికీ బిజ్జలుడు, బసవేశ్వరుడు, జగదేవుడు, నీల, త్రిపురాంతక భట్టు ముఖ్యమైన పాత్రలు. ఈ పాత్రలను చిత్రించుటలో విశ్వనాథ వారు ప్రత్యేకమైన దృష్టి కనబరిచారు. త్రిశూలంలోని మూడు మొనల వలె బసవడు, బిజ్జలుడు, జగదేవుడు ఈ నాటకంలో అతి ముఖ్యమైన పాత్రలు. శైవ పురాణాల ఆధారంగా బసవేశ్వరుడే ప్రధానమైనప్పటికి ఈ నాటకంలో మాత్రం బిజ్జలుడే నాయకుడు. విషాద నాయకుడు. విషాద నాయకునిలో ధీరోద్ధత గుణాలు ఉండాలి. బిజ్జలునిలో ధీరోద్ధత గుణాలు అధికం.

నాటకారంభం మొదటి అంకంలోనే విషాద ఛాయలు కనిపిస్తాయి. మంత్రి బలదేవుని అనంతరం రాజు బిజ్జలుడు బసవేశ్వరుడిని మంత్రిగా నియమించాడు. రాజు బిజ్జలుడు కర్మ మార్గావలంబి. రాజ్య విస్తరణా పిపాసి. బసవేశ్వరుడు భక్తి మార్గావలంబి. స్వార్థ లోభ లక్షణాలు ఉండని శివ దీక్షా పరుడు. తనకు ప్రతికూల లక్షణాలు కలిగిన మంత్రిని నియమించుకొనుట విషాద సూచనయే. మహిమోపేతుడైన బసవడిని రాజ్య విస్తరణా కార్యానికి పావుగా ఉపయోగించుకోవాలని బిజ్జలుని భావన. సామ్రాజ్య విస్తరణా కాంక్ష వెనుక కేవలం స్వార్థం, దురాశయే కాదు విశాల దృక్పథం ఉన్నట్లు విశ్వనాథ వారు రేఖామాత్రంగా సూచించారు. బసవడితో బిజ్జలుడు **"...బసవా! నా మాటల ధోరణిని బట్టి నీవు నన్ను దురాశా పరుడనుకొనుచున్నావు. నేను దురాశాపరుడను కాదు...... నీవు సర్వ భారతదేశము నొక్క గొడుగు క్రిందికి దెమ్ము. నన్ను జంపి నీ యిష్టము వచ్చిన వానికి పట్టము గట్టుము.... కనీసమొక్క దక్షిణాపథ మంతయు నొక్క గొడుగు క్రిందికి దెమ్ము. శైవమో, వైష్ణవమో, బ్రాహ్మణ్యమో యీ గడ్డ మీద బుట్టిన వారి చేత నీ యిల నేలింపుము..."** అని పలుకుటలో బిజ్జలునిలోని ఉన్నతాశయం తెలుస్తున్నది. బిజ్జలుని కాలం నాటికే ఉత్తర భారతదేశం ముసల్మానుల ఆధీనంలోకి వెళ్లింది. దేశంలో వారుండకూడదు. ఈ గడ్డలో పుట్టినవారే ఈ దేశాన్ని పాలించాలి అనే జాతీయ భావనా దృక్పథాన్ని ఇక్కడ విశ్వనాథ వారు సూచించారు.

బిజ్జలునిలోని దోషాలే అతడిని విషాద నాయకునిగా చేశాయి. ఈ దోషాలు మూడు. అవి రాజ్యకాంక్ష, అవిశ్వాసం, పరాశ్రయం. నాటకారంభం నుండి నాటకాంతం వరకు త్రిశూలం కనిపిస్తూనే ఉంది. త్రిశూల ప్రసంగంతోనే మొదటి అంకం ప్రారంభం. తైలపదేవుడు, బిజ్జలులకు మొదటిసారి త్రిశూల దర్శనం అయింది. తైలపుడు మరణించాడు. రెండోసారి బిజ్జలునికి త్రిశూల దర్శనం అయింది. కాకతీయుల చేతిలో జగదేవుడు పరాజయం పాలయ్యాడు. ఎనిమిదవ అంకంలో మరోసారి బిజ్జలునికి త్రిశూల దర్శనం అయింది. **".... ఈసారి నేనో జగదేవుడో... "** అని భావి విషాదాన్ని వ్యక్తీకరించాడు. ఒకవైపు వీరశైవుల దురాగతాలపై ఆగ్రహం, మరోవైపు బసవడి మహిమలతో శైవులపై అనుగ్రహం. ఇవి రెండూ బిజ్జలునిలో కనిపించే పరస్పర విరుద్ధ గుణాలు. ఈ పరస్పర విరుద్ధ గుణాలే బిజ్జలుని విషాదానికి కారణమయ్యాయి. బిజ్జలుడు విషాద నాయకుడయ్యాడు.

బసవేశ్వరుడు శైవ మత బోధకుడు. మంత్రి బలదేవుని మేనల్లుడు. బలదేవుడు నిష్కామ ప్రవృత్తితో జీవించాడు. బలదేవుని మరణానంతరం బసవేశ్వరున్ని మంత్రిగా బిజ్జలుడు నియమించాడు. బసవడు అవతార పురుషుడని శివ భక్తుల విశ్వాసం. రాజాంతఃపురంలో రాజుతో చదరంగం ఆడుతూనే వీధిలో ఉన్న గొల్ల కలియంబను రక్షించుట, మాల అయిన శివనాగమయ్య చేతుల నుండి పాలను స్రవింపచేయుట, కాలకూట విషాన్ని వేలాది భక్తులచే త్రాగించుట మొదలైనవన్నీ బసవేశ్వరుని మహిమలు. ఇన్ని మహిమలు కలిగిన బసవడు బిజ్జలుని కోరికను నెరవేర్చలేదు. శైవులకు శైవ భక్తులకు స్వార్థం, లోభం ఉండకూడదనేది బసవేశ్వరుడి అభిప్రాయం. సద్గుణవంతుడైన బసవనిలో కూడా కొన్ని లోపాలు ఉన్నాయి. ఆ లోపాలు మూడు. అవి పరమతాలపై అసహనం, రాజ్యాన్ని శైవమతం చేయుట, రాజద్రోహం. నాటకం విషాదమయం కావడానికి ఈ మూడు లోపాలు కారణం. జగదేకవీరుడు బిజ్జలుని దండనాయకుడు. పైగా రాజు బిజ్జలునికి మిత్రుడు.

మొదట వైదిక మతావలంబి. బసవన్న మంత్రిపీఠం వహించిన తర్వాత మత విషయంపై జగదేవునిలో తర్కం మొదలైంది. మనస్సు వైదిక మతాన్ని తర్కించి సిద్ధాంతం చేస్తున్నది. హృదయం బసవేశ్వరుని వైపు లాగుతున్నది అని అభిప్రాయపడ్డాడు. కర్మ, భక్తి మార్గాల నడుమ హృదయ ఘర్షణ ప్రారంభమైంది. బిజ్జలుని ఆజ్ఞతో హనుమకొండపై దండెత్తాడు. ఓడిపోయి తిరిగి వచ్చాడు. శివభక్తుల ఆశీస్సులు ఫలించలేదు. శివభక్తులను బిజ్జలుడు దూషించాడు. ఓడిపోవుట తన దోషమని, అది బసవేశ్వరుని దోషం కాదని జగదేవుడు ప్రకటించాడు. శివభక్తుల దూషణలను భరించని బసవడు రాజును చంపుటకు కత్తి దూసాడు. రాజుకు అడ్డుగా జగదేవుడు నిలిచాడు. రాజభక్తిని ప్రదర్శించాడు. బసవని మహిమలు జగదేవుణ్ణి ఆకర్షించాయి. కూతురు వివాహ విందు కారణంగా బసవడికి మరింత దగ్గరయ్యాడు. బసవేశ్వరుడు సాక్షాత్తు దైవమని విశ్వసించాడు. ఈ కారణంగా శివ ద్రోహులను చంపుటకు వాగ్దానం చేసాడు. రాజు బిజ్జలున్ని చంపుటకు ఉద్యుక్తుడయ్యాడు. తిరిగి వచ్చే వరకు బసవడిని వేచి ఉండమని అభ్యర్థించాడు. జగదేవుడు తిరిగి వచ్చేలోగా బసవడు లింగైక్యం చెందాడు. జగదేవుడు హతాశుడయ్యాడు. బసవడు మోసగించాడని భావించాడు. తుచ్ఛమైన వాగ్దానం కోసం రాజు బిజ్జలున్ని చంపినందుకు జగదేవుడు పశ్చాత్తాపం చెందాడు. రాజవధతో కళ్యాణకటకం మాత్రమే నశించలేదు. రాజద్రోహం కారణంగా శైవమతం నశిస్తున్నదన్నాడు. జగదేవుడూ మరణించాడు.

నాటకంలో మరో ముఖ్యమైన పాత్ర నీల. నీల పాత్ర చిన్నది. కానీ ప్రయోజనం ఎక్కువ. లీల బిజ్జలుడి పెంపుడు సోదరి. చారిత్రకంగా పరిశీలిస్తే నీల బసవడి రెండవ భార్య. కానీ ఈ నాటకంలో ఆ విషయం ప్రస్తావించలేదు. ఆమె కన్నడంలో 988 వచనాలు రచించారు. (మైసూర్ విశ్వవిద్యాలయం వికీపీడియా – కన్నడ). నీలపై బసవడి ప్రభావం అధికం. విశ్వనాథ వారు ఆమె చేత వివిధ గేయాలను పలికించారు. అవన్నీ శివ భక్తితత్వాన్ని, బసవేశ్వరుడి మహిమలను తెలుపుతున్నాయి. నిర్మలమైన

మనస్తత్వానికి నిర్మలమైన భక్తి భావానికి నీల ప్రతీక. బసవేశ్వరుడి మహిమలు బిజ్జలునికి బాహిర ప్రేరణగా నిలిచాయి. నీల భక్తిపాటలు అంతః ప్రేరణ కలిగించాయి. బిజ్జలుడిలో బసవడి గూర్చి, బసవడి మహిమలను గూర్చి అంతః సంఘర్షణ జరిగిన సందర్భాలలో నీల పాత్ర ప్రత్యక్షమవుతుంది. గీతాలను ఆలపిస్తుంది. ఆ గీతాలు భావి కాల కథా విషయాలను సూచిస్తాయి.

మరొక ముఖ్యమైన పాత్ర త్రిపురాంతక భట్టు. ఈ పాత్ర అతి స్వల్పమైనది. కేవలం కల్పిత పాత్ర. రాజు యొక్క అంతరంగానికి దర్పణం త్రిపురాంతక భట్టు. వైదిక మత సమర్థనకు, బసవడి మహిమలను ప్రశ్నించుటకు ఈ పాత్ర రూపుదిద్దుకున్నది. ఈ నాటకంలో బసవడి మహిమలను హేతుబద్ధంగా ఆలోచింపజేసే పాత్ర.

నాటక శైలి :

విశ్వనాథ వారు ఈ నాటకంలో వైవిధ్యభరితమైన శైలిని ప్రదర్శించారు. ఈ నాటక వస్తువు వీరశైవ పురాణాలకు సంబంధించినది. కావున బసవేశ్వరుని పాత్ర అభినయ ప్రదర్శన సమయంలో వినిపించిన పద్యాలు ద్విపద ఛందస్సులో ఉన్నాయి. రాజు బిజ్జలుడి వచన సంభాషణలు కూడా ద్విపద ఛందో ఛాయలో కొనసాగుతాయి. (త్రిశూలం నాటకం, మూడవ అంకం 36 వ పుట). ఇది బసవేశ్వరుని యొక్క ప్రభావాన్ని తెలుపుతుంది. సందర్భానుసారంగా పాల్కురికి సోమన బసవోదాహరణములోని పద్యాలు ఉపయోగించారు. నీల పాడిన పాటలు దేశి ఛందస్సులో త్రిశ్ర, మిశ్ర, ఖండ గతులలో ఉన్నాయి. ఆ పాటలలో శైవ పద సాహిత్య విశేషాలను విశ్వనాథ వారు ప్రస్ఫుటింపచేశారు.

విశ్వనాథ వారు ఈ నాటకంలో వీర శైవ మతాన్ని నేరుగా ఎక్కడ విమర్శించలేదు. కానీ, బిజ్జలుడు, జగదేవుడు, త్రిపురాంతక భట్టు పాత్రల ద్వారా వీరశైవ మతంలోని లోపాలను ఎత్తి చూపాడు. బిజ్జలుడు, జగదేవుడు వారి అంతః సంఘర్షణలో కలిగిన ఆలోచనల ద్వారా ఈ విషయం తెలుస్తున్నది. శైవుల దురాగతాలను గూర్చి ప్రజలు రాజుకు ఫిర్యాదు చేస్తారు. అంటే ఆ రోజుల్లో శైవులపై సమాజంలో కూడా వ్యతిరేకత ఉన్నది అని విశ్వనాథ వారు సూచనా మాత్రంగా తెలిపారు. త్రిపురాంతక భట్టు బసవడి మహిమలను గూర్చి హేతుబద్ధంగా అనేకమైన ప్రశ్నలు లేవనెత్తాడు. ఇవన్నీ శైవమతం పట్ల ఉన్న లోపాలను తెలుపుతున్నాయి. అయితే విశ్వనాథ వారి నాటకంలోని వాదాలు నిలబడతాయా? అనేది ప్రస్తుతం కాదు. కానీ పాఠకులను మాత్రం తప్పనిసరిగా ఆలోచింపచేస్తాయి. చారిత్రక సత్యాలు మరుగుపరచకుండా కర్మ మార్గం పట్ల విముఖత లేకుండా సంతులనం(Balance)గా విశ్వనాథ వారు త్రిశూలం నాటకం రచించారు. తెలుగు నాటక సాహిత్యంలో త్రిశూలం విశిష్టమైనదిగా ప్రశస్తి పొందింది.

ఆధార గ్రంథాలు :

1. విశ్వనాథ సాహిత్య దర్శనం, కోవెల సంపత్కుమారాచార్య, మే 2004, అభినవ ప్రచురణలు – హైదరాబాదు 500035.
2. త్రిశూలం నాటకం, విశ్వనాథ సత్యనారాయణ, 1946 రస తరంగిణి ప్రెస్, బెజవాడ కె. 7ఏ, collected from digital library follow the link http://www.new.dli.ernet.in/handle/2015/330064.
3. విశ్వనాథ వారి నాటకములు – ఒక పరిశీలన – ఆర్. కమల, 1991 తెలుగు అకాడమీ, హైదరాబాద్.
4. కోవెల, సుప్రసన్నాచార్య (2002). “త్రిశూలం – ఒక పరిశీలన”. విశ్వనాథ భారతి. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం ‘శిలాక్షరం’.



సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

నీతి శాస్త్రము – తాళిపత్ర గ్రంథము

డా. గంగ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

(గత సంచిక తరువాతి భాగం)

నకించిత్కురుతే కార్యం కర్తారం సముపేక్షయేత్
తస్మాత్సర్వాణి కార్యాణి రాన్యస్య న కారయేత్ – 140

పద్యానువాదం :

శత్రువులకేపనియు పూని సలుప రాదు
తనదు లక్ష్యము గా చేయ తగదు సుంత
పూని మొదలిడ చేయుము పూర్తిగాను
కొంత చేసియు విడుచుట కూడదెపుడు

అర్థం : శత్రుండైన వానికి యే కార్యమైన చాయరాదు. చేశెనా వుపేక్షించి చేశేది. తుదముట్టకుండా చేశేది. 2పాళ్ళు చేశి 1పాలు శేయకుండెదరనిన రీతి.

సర్పః క్రూరఖిలః క్రూరా సర్వకార్యఖిలభిః
మంత్రౌషధ సదాసర్వం ఖిలః కేనేదకామ్యతే – 141

పద్యానువాదం :

క్రూరవిషముండు పాముకు కోరలందు
కొండెములు చెప్పు వారికి నిండ విషము
సర్వవిషమది మందుల సడలవచ్చు
చాడి చెప్పెడి వానివిషమ్ము పోదు

అర్థం : పామువిషము కన్న కొండెము చెప్పేవాడికి విషం లావు క్వారం, పామువిషము మంత్రౌషధాలచేత చెడును. కొండెములు యేమిట చెడుననిన రీతి.

యాచకో గణికో వేశ్యా సారమేయస్య కుక్కుటాత్
యపమార్గేన కుర్వంతే న జాతే తత్ర ధారణాత్ – 142

పద్యానువాదం :

బిచ్చగాడును కరణమును వేశ్యలున్ను
కుక్కలును కోళ్లు పరుజూచి టెక్కు మీరి
పరిహసింత్రుహరింత్రు సంపదలనెల్ల
వారె పైచేయిగా నుండ మీరు చుంద్రు

అర్థం : భిక్షగాడున్ను కరణమున్ను భోగస్త్రీలు లంజలును కుక్కలు, కోళ్ళు యీ ఐదుగురు ఒకరిని జూచి హసించి హరించి కదుమించెద రనిన రీతి.

అసంతుష్టా ద్విజోనష్ట సంతుష్ట ఇవ పార్థిష్ణ
నిర్లజ్జ గణికా వేశ్యా సలజ్జాచ కులాంగనా – 143
(సలజ్జా గణికా నష్టా నిర్లజ్జేవ కులాంగనా…హితోపదేశం)

పద్యానువాదం :

తృప్తి పడకున్న విప్రుడు, తృప్తిపడియు

ప్రభువు నష్టపోదురు,సిగ్గు పడియు
కులట కరణము సిరులకు తొలగుచుంద్రు
సిగ్గు విడిచిన ఇల్లాలు చెడును గాద.

అర్థం : సంతోషం లేనిబ్రాహ్మణుడు చెడును.తనకు భూమియింతే చాలుననిన రాజు చెడును. సిగ్గుపడి వేశ్యయున్ను,కరణమున్ను చెడుదురు. లజ్జపాటించక సిగ్గువిడిచిన గృహాంగన చెడుననిన రీతి.

యోజనం భేరిశబ్దశ్చ మేఘశబ్దశ్చ ద్వాదశం
దాతారో దానశబ్దశ్చ త్రైలోక్యం చ చరాచరమ్ – 144

పద్యానువాదం :

ఉరుము శబ్దము విన్పించు యోజనమ్ము
భేరి నినదమ్ము నామడ మేర వచ్చు
దాత యిచ్చిన దానశబ్దమ్ము వినగ
మూడు లోకాల విన్పించు ముచ్చటగను

అర్థం : ఉరుము పన్నెండు ఆమడల దూరము వినవచ్చును.భేరి వాయిస్తే ఆమడ దూరం వినవచ్చును. కరుణబుద్ధిగల దాత యిచ్చే దానమనే శబ్దం మూడు లోకాలు వినవచ్చుననిరీతి.

వృశ్చికశ్చ విషం పుష్టం మశ్చికశ్చవిషం శిరం
సర్పాణాం విషం దంష్ట్రా దుర్జనం సార్వతో విషం – 145
(వృశ్చికస్య విషం పుష్టం మక్షికాయ్హా విషం శీర్ష
తక్షకస్య విషం దంతం సర్వాంగం దుర్జనస్య – నీతిసారం)

పద్యానువాదం :

తేలుకు తోకనె విషమును
వ్రాలెడుఈగలకుతలను, పాముకు గన దం
తాలనె విషమగు, కానీ
పాలసు లతను వెల్ల విషము పరికించంగన్
(తలనుండు విషము ఫణికిని
వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్

తలతోకయనక నుండును

ఖలునకు నిలువెల్ల విషము కదరా సుమతీ - సుమతీశతకంలో ప్రసిద్ధం)

అర్థం : తేలుకు తోకన విషం యీగలకు విషం తలన వుండును. పాములకు విషం పండ్లనుండును. దుర్జనులకు విషం నిలువెల్లా వుండుననినరీతి.

రాజా రాష్ట్ర కృతం పాపం రాజ పాపం పురోహిత్ణ
భర్తాచ స్త్రీ కృతం పాపం శిష్యపాపం గురోదపి - 146
(చాణక్య నీతి)
(గురుర్వ్రజేత్ - పాఠాంతరం, భోజచరితమ్)

పద్యానువాదం :

రాజ్య మందలి పాపము రాజుకగును
రాజు పాపము హితుడుగు బ్రాహ్మణునకు
భార్య చేసిన పాపము భర్తకగును
శిష్యుడొనరించు పాపము చేరు గురుని

అర్థం : రాజుకు యంత రాజ్యం వున్నదో ఆ భూమి వారు చేశిన పాపం రాజుకు, ఆ రాజు పాపం పురోహితునికి, పెండ్లాము చేశిన పాపం మొగనికి, శిష్యులు చేశిన పాపం గురువుకు చెందుననిన రీతి.

కృషితో నాస్తి దుర్భిక్షం జపతో నాస్తి పాతక్ణ
మౌనేన కలహం నాస్తి నాస్తి జాగరతో భయం - 147

పద్యానువాదం :

రైతు వ్యవసాయమునుచేయ రాదుకరువు
సకల పాపముల్ తొలగును జపముతోడ
మాటలనకున్న కొట్లాట మాటలేదు
స్వయము జాగ్రత్తగానుండ భయము లేదు

అర్థం : వ్యవసాయం చేసే వారికి కరువు లేదు. జపము చేశిన వారికి పాపము లేదు. ఎవ్వరిని తిట్టక మౌనంగా ఉండేవారికి జగడం లేదు. రాత్రి నిద్రపోక జాగ్రత్త గల వారికి భయం లేదు.

వివాద శీలాం స్వయమర్థచోరిణీం పరానుకూలాం పరిహాసభాషిణీం
అగ్రాశినీ మన్యగృహప్రవేశినీం,త్యజంతి భార్యాం దశపుత్రమాతరమ్ - 148

పద్యానువాదం :

ఎపుడు జగడమాడుట,తనయింట దొంగ
తనము చేయుట, పరులకుదగ్గరగుట
మాట లెప్పుడు పరిహాసమాడుటయును
తానె ముందుతినుటయును, తరచు పరుల
యింట చేరుట, గుణములిట్టివిగల
భార్య బిడ్డలు గలదైన వదల వలయు.

అర్థం : యెపుడు జగడమాడేదాన్ని, కుటిల కోపినిని, తనయిల్లు విడిచి పొరుగింట వుండేదాన్ని, పరపురుషుని కోరే దాన్ని, పురుషుడు కానకుంట పక్వాన్నములు వండుకొని తినేదాన్ని, పురుషుని యెదురు మాట్లాడేదాన్ని, యీ గుణములు గల స్త్రీని పదిమంది పిల్లల గన్న తల్లినైనా విడిచెదననిన రీతి.

కార్యేషు మంత్రీ కరణేషు దాసి క్షమయేషు ధాత్రి
విభవేషు లక్ష్మీ భోజ్యేషు మాతా శయనేషు రంభా
గృహేషు పత్నీ కులవిస్తరస్యాత్ - 149
(కార్యేషు దాసీ కరణేషు మంత్రీ, రూపేచ లక్ష్మీ , క్షమయా ధరిత్రీ స్నేహేచ మాతా శయనేతు వేశ్యా షట్కర్మయుక్తా కులధర్మపత్నీ - పంచతంత్రం)

పద్యానువాదం :

పనులు చేయంగ నో దాసి వలెను చేయు
మంత్రి వలె భర్తకునుతగు మాట జెప్పు
భూమియంతటి తాల్మియు పూని యుండు
లక్ష్మి వలె యింట కన్పించు లక్షణముగ
కమ్మగా భోజనము పెట్టు అమ్మ వోలె
అప్సరసవోలె భోగము లందియిచ్చు
సంతతినిగని పెంచు వంశమ్ము తాను
అన్ని విధముల నొప్పు నిల్లాలు చూడ

అర్థం : పురుషుని కార్యం గలప్పుడు రాజుకు ప్రధానివలె చెప్పెడిది, కరుణతో సమస్త పనులు బానిస వలె చేశేది. క్షమగల భూమి వలెనే తాలిమితో వుండేది, శుభానకు లక్ష్మివలెనే కోరుతువుండేది, భోజనమప్పుడు తల్లి వలె చూచేది, శయనించినప్పుడు రంభవలెనే విలాసం జేశేది, ఆరు గుణాల గల గృహస్తుల భార్య కులం విస్తరిల్లుననిన రీతి.

మరణాంతాని వైరాణి ప్రసూతాంతాని యవ్వనం
కుపితం ప్రాణహంత్యాని ప్రణమోత్యత గౌరవం - 150
(మరణాంతాని వైరాణి ప్రసవాంతశ్చ యవ్వనమ్
కోపితా ప్రణతాంతాహి యాచితాంతంచ గౌరవమ్)

పద్యానువాదం :

మరణముల్ చెంద వైరముల్ మాసిపోవు
ప్రసవమైనంత యువతి యవ్వనము తొలగు
నతులు చేసిన కోపము నలిగిపోవు
యాచనముచేయ గౌరవ మడుగు బట్టు

అర్థం : మరణమయ్యే దాకనే వైరం, బిడ్డనుకనే దాకనే యవ్వనం, సంతోషముతీరే దాకనే తేజస్సు, పెద్దలకు మ్రొక్కేదాకనే కోపం..

(సశేషం)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

సైలెంట్ డెత్ నాటకం : అత్యాధునిక తరం

✍ **బుక్కే ధనక నాయక్,** తెలుగు పరిశోధకుడు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.
ఫోన్ : 81870 56010

ఉపోద్ఘాతం

తెలుగు సాహితీ రంగంలో అత్యాధునిక ప్రక్రియలు ఎన్నో వచ్చినప్పటికీ నాటక ప్రక్రియ ప్రాధాన్యత ప్రత్యేకమైనది. ప్రస్తుత సమాజంలో సినీ రంగానికి మూలం నాటక సాహిత్యం. ప్రతి భాషలోనూ రకరకాల మార్పులతో సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. సమాజాన్ని ప్రభావితం చేస్తూ, చైతన్యపరిచే విశిష్ట సాహిత్య ప్రక్రియలో నాటకం మొదటి స్థానంలో ఉంటుంది. నాటక సాహిత్యం ప్రజాదరణీయమైనది. ఎంతోమంది కళాకారులకి రంగస్థలం జీవితాన్ని ప్రసాదించింది. ప్రసాదిస్తూనే ఉంది. రంగస్థలం వేదిక గొప్ప గొప్ప కళాకారులని ప్రస్తుత సమాజంలో ఎంతో ఉన్నత స్థాయికి చేర్చింది. సాహితీవేత్తలుగా, రాజకీయ, వ్యాపార వేత్తలుగా ఇతరేతర రంగాలలోనూ పటిష్టమైన గుర్తింపుని తెచ్చి పెట్టింది. ఇప్పటి సమాజంలో నాటక సాహిత్యం ప్రత్యేకత తగ్గినప్పటికీ దాని ప్రభావం ఏదో రూపాన ప్రజల్ని చైతన్య పరుస్తూనే ఉంది. తెలుగు సాహితీ ప్రపంచంలో ఆంధ్ర మహాభారతంలో **"ఉదాత్త రసాన్విత కావ్య నాటకాలు పెక్కు చూచితి"** అని నన్నయ పేర్కొనడంతో నాటక ప్రస్తావన ప్రారంభమైంది. తెలుగు ప్రాచీన సాహిత్యంలో యక్షగాన నాటక ప్రస్తావన తంజావూరి నాయక రాజుల కాలం నుంచి అభివృద్ధి దిశలో ప్రయాణించింది. దానిని విజయ రాఘవనాయకుడు, శహజి మొదలైన నాయకులు బలపరిచారు. విషాద నాటకాలు, విషాద గంభీర నాటకాలు, మోదాంత నాటకాలు, పౌరాణిక నాటకాలు, చారిత్రక నాటకాలు, హాస్య నాటకాలు, సాంఘిక నాటకాలు, ప్రయోగ నాటకాలు, హేతువాద నాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు, బాలసాహిత్య నాటకాలుగా నాటక సాహిత్య విస్తీర్ణం పెరుగుతూనే వచ్చింది. కోరాడ రామచంద్ర శాస్త్రి, ధర్మవరం రామకృష్ణ చార్యులు, కొక్కొండ వెంకటరత్నం పంతులు, వావిలాల వాసుదేవశాస్త్రి, వేదం వెంకటరాయ శాస్త్రి, చిలకమర్తి, పానుగంటి మొదలగు నాటకకర్తలు గొప్ప నాటక కర్తలుగా తెలుగు సాహితీ ప్రపంచంలో గణనీయ పాత్రను పోషించారు. ఇందులో డాక్టర్ నారిశెట్టి వేంకటకృష్ణారావు గారు నిశ్శబ్దమరణం అనే సాంఘిక నాటకం ద్వారా ప్రస్తుత యువతరం భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తూ యువతను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మంచి సాంఘిక నాటకం. గొప్ప నాటకం.

1. నాటకకర్త పరిచయం

డాక్టర్ నారిశెట్టి వేంకటకృష్ణారావు గారు కవి, కథకులు, నవల, నాటక, గేయ రచయిత, గొప్ప పరిశోధకులు, విమర్శకులు, గాయకులు, తెలుగులో నిషిద్ధ నాటకాలు అనే అంశంపై ఆయన పరిశోధించిన తీరు సమస్త సాహితీ పరిశోధక లోకానికి మార్గదర్శకంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. నారిశెట్టి నాగేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులకు పాత గుంటూరు పట్టణంలో జన్మించారు. ఇప్పటి వరకు దాదాపు 80 రచనలు చేశారు. యూ.జీ.సీ. ఢిల్లీ వారిచే యు.జి.సి. రీసెర్చ్ అవార్డ్, ఆంధ్ర సారస్వత

సమితి మచిలీపట్నం వారిచే గోల్డెన్ జూబ్లీ లిటరరి ఎక్సలెన్స్ అవార్డు, విశ్వశాంతి అవార్డ్స్ అకాడమీ గుంటూరు వారిచే విశ్వశాంతి హానరరీ అవార్డు, కళా మిత్రమండలి ఒంగోలు వారిచే జాతీయ స్థాయి అవార్డ్, 2024 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వారిచే ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు.

'అసలు జబ్బు' అనే కథతో 13 ఏళ్లకే ఆయన రచనా జీవితం ప్రారంభమైంది. ఈ కథ ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు విజయ బాపినీడు ఆధ్వర్యంలో వెలువడిన ప్రముఖ పిల్లల మాసపత్రిక బొమ్మరిల్లులో ప్రచురితమైంది. దేశభక్తి గురించి 2000 సంవత్సరంలో 'చచ్చిపోండి మరొక్కసారి' అనే నవలను, ఎయిడ్స్ బాధలు, వెతలు, చైతన్యం గురించి 2022లో 'వజ్రకవచం' అనే నవలలను, ప్రస్తుతం రుద్రమదేవి గురించి ఒక అద్భుతమైన చారిత్రక నవలను రాస్తున్నారు. 'తేనె చుక్కలు' అనే ఒక రవ్వల సంపుటిని రచించి గొప్ప కవిగా పేరు గడించారు. పూజనీయులు, ఆకాశంలో ఆడది, మట్టి కొలువు, నిశ్శబ్ద మరణం, తప్పులేదు, ప్లీజ్ ఒక్కక్షణం ఆగండి వంటి నాటకాలు రాసి మంచి నాటక రచయితగా పిలవబడ్డారు. వీరు రాసిన కరోనా పాటలు ఎంతో ప్రాచుర్యాన్ని పొంది ప్రస్తుతం యూట్యూబ్ సోషల్ మీడియాలో అందుబాటులో ఉంటూ ప్రజల్ని చైతన్య పరుస్తూ ఉన్నాయి.

1. నిశ్శబ్దమరణం నాటక ఇతివృత్తం :

ఒక పల్లెటూరిలో రాజేశ్వరరావు అనే ఒక రైతు ఉన్నాడు. అతని భార్య వనజ. వారికి లక్ష్మి, అశోక్ అనే ఇద్దరు పిల్లలు. పల్లెటూరి వాతావరణంలో వారి ఆర్థిక స్థితిగతులకు లోబడి వారి జీవితం చాలా పేదరికంలో ఉంటుంది. అశోక్ పదవ తరగతి పాస్ అయ్యాక తన ఇంటర్మీడియట్ చదువు కోసం పట్టణానికి వెళ్లవలసి వచ్చింది. రాజేశ్వరరావు స్నేహితుడైన ఆర్టీసీ డ్రైవర్ ఏడుకొండలు తన కొడుకు గోపిని కూడా ఇంటర్మీడియట్ చదువుకి పట్టణానికి పంపించవలసి వచ్చింది. అశోక్ చాలా భయస్తుడు. కానీ గోపి మొదటి నుంచి విపరీతమైన మనస్తత్వ ధోరణి కలవాడు. అశోక్, గోపిలు ఇరువురు ఒకే కాలేజీలో ఇంటర్మీడియట్‌లో జాయిన్ అయ్యారు. ఇతర విద్యార్థులతో గోపికి కొన్ని చిన్న చిన్న గొడవలు ఉన్నప్పటికీ అశోక్, గోపి ఇరువురు మంచి మార్కులతోనే పాసయ్యారు. అనంతరం రైతైన రాజేశ్వరరావు తన స్తోమతకు మించి అప్పు చేసి మరీ అశోక్‌ని ఇంజనీరింగ్ కొరకు మరోసారి పట్టణానికి పంపించాడు. బస్ డ్రైవర్ ఏడుకొండలు కూడా అశోక్‌తో పాటు గోపిని కూడా అదే కాలేజిలో ఇంజనీరింగ్‌లో చేర్పించాడు. ఆ కళాశాలలో సీనియర్ విద్యార్థులు విపరీతమైన మద్య, ధూమపానాలతో పాటు డ్రగ్స్ ఉపయోగించేవారు. సీనియర్స్ పట్ల దురుసుగా ప్రవర్తించే గోపిని బలవంతంగా డ్రగ్స్ బారిన పడేలా చేశారు సీనియర్ విద్యార్థులు. అశోక్ బుద్ధిగా చదువుతున్నప్పటికీ గోపి అలా అయిపోవడం చూసి చాలా బాధపడుతూ ఉండేవాడు. గోపి క్లాస్‌లకు వెళ్లకుండా హాస్టల్ రూమ్‌లోనే సీనియర్స్ ఇచ్చే మత్తు పదార్థాలను తీసుకుంటూ డ్రగ్స్‌కి బానిస అయిపోయాడు. డ్రగ్స్ లేనిదే ఊపిరి పీల్చుకోలేని స్థితికి చేరుకున్నాడు. బుద్ధిగా చదువుకుంటున్న అశోక్‌ని కూడా డ్రగ్స్ బారిన పడేలాగా చేస్తారు. గోపితో పాటు అశోక్ కూడా మత్తు పదార్థాలను తీసుకోవడం ప్రారంభించాడు. మరోవైపు పల్లెటూరులో గోపి తండ్రి అయిన రాజేశ్వరరావు తన కొడుక్కి ప్రేమగా రీడింగ్ చైర్ కొని వుంచాడు. వనజ తన కుమారుడిని ఎప్పటికైనా అమెరికా పంపించాలని కోరికతో తన కొడుకుకోసం ఎదురుచూస్తూ ఉంది. గోపి మత్తు పదార్థాల కోసం పుస్తకాలు, ఫీజులు అంటూ ఏడుకొండల్ని ప్రతిరోజు డబ్బులు అడగడం ప్రారంభించాడు. తన కొడుకుపై అనుమానం వచ్చిన ఏడుకొండలు ఒకసారి కాలేజీకి వెళ్లి చూశాడు. అతిగా మత్తును తీసుకొని స్పృహ లేక పడివున్న తన కొడుకు గోపిని చూసి కృంగిపోయాడు. తండ్రి చొక్కా కాలర్ పట్టుకుని గంజాయి ఏది అంటూ క్రిందకు తోసిపడేసి కాళ్ళతో కొట్టే సంఘటన ఈ నాటకంలోని విషాదాన్ని తీవ్ర స్థాయిలో చూపిస్తుంది. గోపిని హాస్పిటల్‌కి తీసుకెళ్లగా హాస్పిటల్‌లోనే చనిపోతాడు. దానికి కారణమైన ప్రతి ఒక్కరిని శోధించే ప్రయత్నంలో పోలీసులు ఉంటారు. గోపి మరణ వార్త విని తన స్నేహితుడైన మరో విద్యార్థి సహాయంతో అశోక్ భయంతో పల్లెటూరిలో తన ఇంటికి వెళ్ళిపోతాడు. హాస్పిటల్లో గోపి శవం దగ్గర జరిగే ప్రతి సంఘటనని మరో విద్యార్థి ద్వారా గోపి ఫోన్‌కాల్ ద్వారా తెలుసుకుంటూ మరింత భయపడి గోపి మరణానికి పరోక్షంగా తానూ కారణం అంటూ బాధపడతాడు. పోలీసులు తమ ఇంటికి కూడా వచ్చి అరెస్టు చేస్తే తన తల్లిదండ్రులు చెల్లి పరిస్థితినీ ఊహించి ఒక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు అశోక్. అశోక్ ఆత్మహత్యకు ముందు రాసిన ఉత్తరాన్ని చదివి తల్లిదండ్రులు, చెల్లెలు శోకసంద్రంలో మునిగిపోతారు. ప్రభుత్వం దగ్గర అనుమతి తీసుకుని గోపి, అశోక్ శవాలను కాలేజీ గ్రౌండ్లో ఉంచి పోలీసులు డాక్టర్లు, విద్యార్థులకు చెప్పే హితంతో నాటకం సమాప్తమౌతుంది.

2. నాటక విశ్లేషణ

తల్లిదండ్రులు రైతులు. రైతు కూలీలు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. తాము తినీ తినక పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే తల్లిదండ్రులు సమాజంలో ఎందరో ఉన్నారు. తల్లిదండ్రుల శ్రమని, బాధని గ్రహించని పిల్లలు విద్యాసంస్థల్లో స్నేహం పేరిట మత్తు పదార్థాలను విపరీతంగా తీసుకుంటూ తల్లితండ్రులకు కన్నీళ్లు మిగిల్చడం చాలా చూస్తున్నాం. అలాంటి తల్లిదండ్రుల కన్నీళ్లను రచయిత నారిశెట్టి వేంకటకృష్ణారావు కాగితంపై అక్షరాలుగా మార్చారు. నిశ్శబ్ద మరణం (సైలెంట్ డెత్) అనే పేరుతో ఒక నాటకాన్ని రాసి విద్యార్థి లోకాన్ని చైతన్యం దిశ వైపు నడిపించే ప్రయత్నం చేశారు. నిశ్శబ్ద మరణం నాటకంలో మత్తు మోజులో యువత తన భవిష్యత్తును ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో కొంతవరకు పరిశీలించి వివరించే ప్రయత్నం చేద్దాం.

3.1 కుటుంబం

పదవ తరగతి పాసయ్యాను నాన్న అన్నప్పుడు తండ్రి రాజేశ్వర రావు ఎదురుగా వచ్చిన కొడుకుని హత్తుకొని ఆనందపడుతూ. **"నాకు తెలుసు రా నువ్వు ఫస్ట్ క్లాస్ లో పాస్ అవుతావని. మీ స్కూల్ ఫస్ట్ కూడా నువ్వేనని. నువ్వేనా స్కూల్ ఫస్ట్ వచ్చింది ?"** అని అడుగుతాడు. **"నాన్న అశోక్! ఎంత సంతోషంగా ఉందో! నాకు నువ్వు పాస్ అయినందుకు. మన నాలుగు వీధుల్లో ఉన్న పదిమంది పిల్లల్లో నువ్వే బాగా చదువుతావు అని అందరూ చెబుతారు. అది నిజం చేశావు రా. నీకు ఇప్పుడే స్వీట్ చేసి పెడతా ముందు పంచదారతో నోరు తీపి చేస్తా"** అంటూ కొడుకు నోటి నిండా పంచదార పెట్టిన తల్లి వనజ! వారి వీధిలో ఉన్న నలుగురు పిల్లల కంటే తన కొడుకే బాగా చదువుతాడనే విషయం నలుగురితో పోల్చి తన కొడుకును తాను ఉన్నతమైన స్థాయిలో నడిపించే దిశ. బయట పోటీ ప్రపంచం వారికి తెలియకపోయినా వారికి తెలిసిన నలుగురులోనే తన కొడుకు మంచి మార్కులు తీసుకువచ్చాడు అన్న

విషయం వారికి ఒక పండగలా ఉంది. **"అన్నయ్యా! హ్యాపీ రిజల్ట్స్"** అంటూ తన చెల్లెలు లక్ష్మి తనకు షేక్ హ్యాండ్ ఇచ్చి పంచదార తీసుకువచ్చింది. అన్నయ్య తనకు మార్గదర్శకంగా అవుతాడన్న భరోసా ఆమె మాటల్లో, కళ్ళల్లో పుష్కలంగా కనిపిస్తుంది. కొడుకు ఫోన్ చేసి నాకు రీడింగ్ చైర్ కావాలి నాన్న అంటే ఆ కుర్చీ కొనడానికి పంట కోసి అమ్మి వచ్చిన డబ్బుతో కొనాలన్న నాన్న తాపత్రయంలో కొడుకుపై ప్రేమ కనిపిస్తుంది. **"అమ్మ లక్ష్మి! అన్నయ్య అడిగిన కుర్చీ ఇదేనా బాగుంది చేతులు పెట్టుకోవడానికి"** అంటాడు. దానికి బదులుగా **"చేతులు పెట్టుకోవడానికి కాదు దాని మీద అట్ట పెట్టుకుని రాసుకుంటాడు చదువుకుంటాడు. మీకు పూర్తిగా తెలియదు"** అంటూ వనజ సమాధానం ఇస్తుంది. ఇక్కడ వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవలా కనిపించినప్పటికీ అది గొడవగా పరిగణించబడదు. ఆ భార్య భర్తలకు తమ కొడుకుపై ఉన్న ప్రేమ, మమకారం, ఇష్టం మాత్రమే స్పష్టమవుతుంది. ఆ కుర్చీపై తన కొడుకు కూర్చుంటే చూడాలని అంతరార్థం వారిద్దరి మాటల్లో బహిర్గతమవుతుంది. కొరివి పెట్టవలసిన కొడుకు తన కళ్ళముందే చనిపోవడం తల్లి తండ్రులు భరించలేకపోయారు. కొడుకు శవాన్ని చూసి తన రెండు చేతులతో కొడుకు ముఖాన్ని పట్టుకొని **"నువ్వడిగింది ఏది నేను టైంకి ఇవ్వలేదని కోపం వచ్చి వెళ్ళిపోయావా? ఇదిగో అయ్యా! నీ కోసమే కొన్న. దానిలో కూర్చొని నువ్వు పెద్ద చదువులు చదివి ఉద్యోగం తెచ్చుకుంటావని కొన్నాను రా! దాన్లో ఒక్కసారి కూర్చో నాన్న"** అంటూ కొడుకు శవాన్ని కుర్చీపై కూర్చోబెట్టి తల్లి, తండ్రి, చెల్లెలు మనసులో దాచిన బాధ నోటి మాట ద్వారా వస్తూవుంటే ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ మాయలో పడి తల్లిదండ్రులను కన్నీటి పాలు చేస్తున్న విద్యార్థుల ఆనవాళ్ళన్నీ గుర్తుకొస్తున్నాయి. బాధ పెడుతున్నాయి.

3.2 విద్య ఆవశ్యకత

విద్యావ్యవస్థ ప్రధానంగా పిల్లలు, యువకుల కొరకు స్థాపించ బడింది. పిల్లలకు యువకులకు, పాఠ్యాంశాలను నిర్ణయించి బోధించటం, వారి విద్యా ఫలితాలను, వారి జీవిత లక్ష్యాల కొరకు ప్రతిపాదింపబడుతాయి. వీటి వలన పిల్లలు, ఏమి నేర్చుకోవాలి?, ఎలా నేర్చుకోవాలి? ఎందుకు నేర్చుకోవాలి? అనే ప్రశ్నలు సాధించు కొనేలా జాగ్రత్తలు తీసుకొని, వారికి విద్యా బోధన ఇవ్వబడుతుంది. బోధనా వృత్తి, ఇందుకు సర్వదా సహాయపడుతూ, పిల్లలలోని అన్ని రంగాల అభివృద్ధికొరకు సహాయపడుతూ, వారిని మంచి పౌరులుగా తీర్చి దిద్దడానికి ఎల్లవేళలా సిద్ధంగా వుంటుంది. ఒక వ్యక్తి బాల్యం నుంచే విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలోని మంచిని స్వీకరించి చెడును వదిలేయాలన్న ప్రధానమైన అంశంతో ఏర్పాటు చేయబడింది. ప్రస్తుత సమాజంలోని విద్య పౌరుల హృదయంలో విలువ లేని భావంగా మాత్రమే మిగిలిపోయింది. కనుకనే పౌరులు చెడు మార్గం పడుతున్నారు. ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు స్వీకరించి విద్య ఆవశ్యకత మూలాన్ని వేళ్ళతో సహా పెకిలించి వేస్తున్నారు. విద్యను అభ్యసించి వారి జీవితాన్ని కుటుంబ బాధ్యతల్ని స్వీకరిస్తారని వారిని తల్లిదండ్రులు దూరాలకు పంపిస్తున్న విద్యార్థులు జీవితాలు మత్తు మహమ్మారి ప్రభావంతో విషమయం అవుతుంది. కళాశాల జీవితం తరచుగా కొత్త స్వేచ్ఛలు, బాధ్యతలు మరియు ఒత్తిళ్లను పరిచయం చేస్తుంది. చాలా మంది విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కోవడానికి, సామాజిక ఆందోళనను నిర్వహించడానికి లేదా వారి తోటివారితో సరిపోలడానికి గంజాయి వైపు మొగ్గు చూపుతారు. అప్పుడప్పుడు ఉపయోగించడం సమస్యాత్మకంగా అనిపించకపోవచ్చు, విద్యా మరియు సామాజిక జీవితంలోని ఒత్తిళ్లు తరచుగా వాడటానికి దారితీయవచ్చు. వాటికి వయసు రీత్యా కారణాలు ఉండవచ్చు.

3.3 పల్లెటూరు – పట్నం

పల్లెటూర్లు పట్టణానికి పట్టుకొమ్మలని సామెత తరచుగా వింటూ ఉంటాం. పల్లెటూర్లలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కళ్ళ ముందే ఉండి చదువుకుంటారు. విద్య స్థాయి పెరిగే కొద్దీ పల్లెటూర్ల నుంచి పట్టణానికి వెళ్లవలసిన అవసరం తప్పకుండా అయింది. కారణం పల్లెటూర్లలో ఉండే విద్యాకేంద్రాల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. పట్టణాల్లో పెద్ద పాఠశాలలు కళాశాలలు కోకొల్లలు. రకరకాల పల్లెటూర్లలోని విద్యార్థులు వారిలో భిన్న భిన్న కోణాలతో కూడిన మనస్తత్వాలు ఒక చెట్టున చేరుతాయి. భయస్థులు కొందరు ధైర్యవంతులు మరికొందరు. తెలివైన వారు కొందరు, అమాయకులైన వారు మరికొందరు ఉంటారు. సాధారణంగా అమాయకత్వం ఉన్న వారు మాత్రమే చెడు మార్గం వైపు త్వరగా ప్రయాణించడానికి అవకాశం ఉంది. ఉదాహరణకి పల్లెటూరు నుంచి కొత్తగా పట్టడానికి వచ్చి చదువుకుంటున్న గోపి, అశోక్‌లు చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ వారిలో ఉన్న భయము, అమాయకత్వం వల్ల సీనియర్స్ చెప్పే ప్రతి మాటను విని మత్తుకు బానిస అయ్యారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను విద్యకు దూరమయ్యారు. గోపీ జంజాయి పొగ త్రాగి **"అన్న ఈ పొగ కొత్తగా ఉంది. నాకేదో అయిపోతున్నట్టు ఉంది. తల తిరుగుతున్నట్టు ఉంది అంటే, ముందు ఇలాగే ఉంటుంది రా తర్వాత ఎంతో హాయిగా రిలీఫ్‌గా ఉంటుంది. సుఖంలో తేలినట్టు ఉంటుంది"** అన్న సీనియర్ మాటలు గోపీకి కొత్తగా అనిపించాయి. ఇదే క్రమంలో మత్తును తీసుకోవడం ప్రారంభించాడు. మంచేదో, చెడేదో ఆలోచించే జ్ఞానం, నైపుణ్యం అక్కడ గోపికి లేదు అనిపిస్తుంది. తెలిసి తెలియక చెడు మార్గాల బారిన పడుతున్న విద్యార్థులు ఈ ప్రపంచంలో ఎంతమంది ఉన్నారో పరిగణిస్తే సమాధానం ప్రశ్నగానే ఉంటుంది.

3.4 యువతకు చైతన్యం

"చూశారా అమ్మా-నాన్న, అక్క- చెల్లి, అన్నా-తమ్ముడు, చుట్టాలు- స్నేహితులు ఎంత మంది బంధం, ప్రేమ, ఆత్మీయత, అనురాగం అన్నిటిని నిర్ధాక్షిణ్యంగా తెంచేస్తుంది డ్రగ్ అనే మత్తు రాక్షసి. స్టూడెంట్స్! మీ అందరి కళ్ళల్లో కన్నీళ్లు తిరుగుతున్నాయి కదా! గుండెలు బరువెక్కుతున్నాయి కదా! మీ బతుకులు, మీ చదువులు, మీ ఉద్యోగాలే మీకు ముఖ్యం. మీ లక్ష్యం ఉన్నతమైన చదువు, ఉద్యోగం. కానీ పనికిమాలిన చావు కాదు. సైనికుడు దేహం నిండా గుళ్ళు తగులుతూ రక్తం కారుతున్నా దేశం కోసం పోరాడి మరణిస్తాడు. మరి మీరు మీ బాడీ నిండా డ్రగ్స్ నింపుకొని మత్తుకు చిత్తవుతే మనసు మాటవినక, మెదడు పనిచేయక దొంగలవుతారా? దుర్మార్గులు అవుతారా? దేశద్రోహులుగా మిగిలిపోతారా? రాబోయే తరాలకు మీ సమాధుల మీద రాసుకుంటారా? మాది నిశ్శబ్ద మరణం అని" అంటూ గోపి శవాన్ని ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో ఆ కళాశాల ప్రాంగణంలో ఉంచి విద్యార్థులందరిని చైతన్యపరిచే దిశలో ఎస్పీ ఇలా అంటూ ఉన్నారు. ప్రతి మనిషి సమాజాన్ని ముందుకు నడిపించాలి. సరైన దిశ వైపు విద్యావంతులే నడవగలరు. వారే రేపటి తరం వారిని సరైన మార్గం వైపు నడిపించగలరనే నమ్మకాన్ని, ధైర్యాన్ని, సాహసాన్ని అక్కడి డాక్టర్లు, పోలీసులు విద్యార్థులను చైతన్య పరిచే ప్రయత్నం ఈ నాటకంలో అద్భుతమైన ఘట్టంగా తీర్చిదిద్దబడింది.

"ఈ పాపం ఎవ్వరిది? ఈ లోపం ఎక్కడిది?...
బుద్ధులు నేర్వని, హద్దులు మీరిన యువతరానిదా?
డబ్బులే చాలని, విలువలు వదిలిన ఈ మనుషులదా?
ఈ పాపం ఎవరిది?...... ఈ లోపం ఎక్కడిది?

అంటూ పాట రూపంలో విద్యార్థులను ప్రశ్నించే ప్రయత్నం చేశారు రచయిత డాక్టర్ నారిశెట్టి వేంకట కృష్ణారావు. జ్ఞానాన్ని మరిచి, బుద్ధులు నేర్చుకోవాలనే బాధ్యతను మరిచి, హద్దులు మీరిన యువతరానిదా? అనే మాటలో విద్యార్థుల్లో బలహీనపడిన వ్యక్తిత్వాన్ని చైతన్యపరిచే దిశగా బలంగా ప్రశ్నించగలిగింది ఈ పాట.

ప్రస్తుత సమాజంలో అన్ని భాషల్లో ఎన్నో రకాల రచనలు నాటకాలు వస్తున్నప్పటికీ పౌరులపై, పౌరులపై ప్రభావం చూపే చెడు అలవాట్లను నిషేధించడానికి వచ్చే రచనలు చాలా అరుదుగా ఉన్నాయి. ఆ కోణాన్ని పసిగట్టి **'నిశ్శబ్ద మరణం'** అనే శీర్షికతో నాటకాన్ని రచించి ప్రజల్లో చైతన్యపరిచే ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు ఈ నాటక రచయిత.

ముగింపు

సమాజంలో వ్యక్తుల వ్యక్తిత్వాలు విభిన్నాలు. సందర్భానుసారం వ్యక్తుల ప్రవర్తనలు వారి అవసరాల కోసమే మారుతూ ఉంటాయి. అది మంచి మార్గమైనా, మరొకటి అయిన కావచ్చు. ఇలా తెలిసి తెలియని వయసులో విద్యార్థి లోకం మత్తు బారినపడి వారి జీవితాలను నాశనం చేసుకోవడం ప్రస్తుత సమాజంలో సాధారణమైపోయింది. కొండంత ఆశతో కని పెంచిన పిల్లల్ని ఉన్నతమైన స్థానంలో చూడాలన్న తల్లిదండ్రుల కోరికలు కేవలం కోరికల్లాగే మిగిలిపోతున్నాయి. అశోక్ అమాయకుడు, భయస్తుడు అయినప్పటికీ మొదటిసారి సీనియర్ స్టూడెంట్స్ తన స్నేహితుడైన గోపికి మత్తు పదార్థం అలవాటు చేసిన సమయంలోనే కాలేజీ అధికారులకు తెలియజేసి ఉంటే వారి జీవితాలు అగాథంలోకి వెలివేయబడకుండా ఉండేవి. కానీ అతను ఆ పని చేయలేక పోయాడు. గోపి చెడ్డవాడా అంటే కాదు. అక్కడికి వచ్చేంతవరకు అతనికి మత్తు పదార్థం అంటే ఏమిటో తెలియదు. సీనియర్స్ చెప్పారని, వారు ఆ మత్తుపదార్థాన్ని తీసుకుంటూ ఆనందంగా ఉన్నారన్న వారి ఆటిట్యూడ్ అశోక్‌ని ఆకర్షింపచేసింది. మత్తుకు బానిసై మత్తు తన శరీరంలో లేకపోతే ఏ అవయవం పనిచేయని స్థితికి దిగజారడం ఎవరూ కొనితెచ్చుకోరు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్‌ను విద్యార్థులు విపరీతమైన స్థాయిలో వినియోగించడం బాధాకరం. ప్రభుత్వం కొంతమంది అధికారులను నమ్మి విద్యా వ్యవస్థలో ఎలాంటి సమస్యలు, ప్రమాదాలు లేకుండా చూసుకునే బాధ్యతనిస్తోంది. కానీ అధికారులు వాటిపై సరైన దృష్టి పెడుతున్నారా అంటే ప్రశ్నార్థకం. నిజానికి తల్లిదండ్రులు పిల్లల్ని ప్రేమించడం మాత్రమే కాదు. కొన్ని విషయాలకు దూరంగా ఉండమని నిర్మొహమాటంగా చెప్పగలిగే సాంప్రదాయం రావాలి. వీటి కోసమే డాక్టర్ నారిశెట్టి వేంకట కృష్ణారావు నాటక రూపంలో మనసారా కాంక్షించారని అర్థమవుతుంది.

ఆధార గ్రంథాలు

1. నిశ్శబ్దమరణం, నారిశెట్టి వేంకట కృష్ణారావు, వెన్నెల ప్రచురణలు, గుంటూరు.
2. ఎదురీత, కొండముది గోపాలరాయ శర్మ, సింహాద్రి పబ్లికేషన్స్, హైదరాబాద్.
3. ఆకుపచ్చని కోరికలు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ.
4. కన్యాశుల్కం, గురజాడ అప్పారావు, తిరుమల తిరుపతి దేవస్థాన పీఠం.
5. అభిజ్ఞాన శాకుంతలం, పరవస్తు రంగాచార్యులు, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ.
6. విషాద సారంగధర, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, లోగిలి ప్రచురణలు, గుంటూరు.

❖ ❖ ❖ ❖ ❖

తెలంగాణ పద సంకీర్తన గ్రంథాల పరిచయం -1
"శ్రీ శివరామ భజన కీర్తనలు"

సుప్పని సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు, కామారెడ్డి. ఫోన్ : 949262910

భక్తి పారవశ్యంతో భగవంతుడిని ఆరాధించే ఒకానొక మార్గమే సంకీర్తనం. అనేక రూపాలు, అనేక నామాలు, లెక్కకు అందని మహిమలు, లీలలు గల దైవాన్ని స్తుతించే విధానంలో సంకీర్తనమే గొప్ప సాధనంగా ఎంచుకొని, భగవంతుని స్తుతితో పాటు, సమ సమాజ నిర్మితి కోసం, ఒక తాత్విక బోధను అందించడంలో సఫలీకృతులైన వాళ్ళు పూర్వపు కవులు.

అలాంటి పరంపరకు చెందిన మహాకవి శ్రీమాన్ పెద్దిరాం పోచన్న పంతులు. వీరు రచించిన భజన సంకీర్తన గ్రంథమే ఈ శ్రీ శివరామ భజన కీర్తనలు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, (ప్రస్తుతం కామారెడ్డి) బాన్సువాడ మండలానికి సమీపానగల ఒక చిన్న గ్రామం తిరుమలపురం. ఆ గ్రామంలో ఒక నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన మహనీయుడే శ్రీమాన్ పెద్దిరాం పోచన్న పంతులుగారు.

చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక భావజాలం తనలో గూడు కట్టుకున్నది మొదలు దైవారాధన, రామాయణ, భారత, భాగవత కావ్యాలను ఎప్పుడు పఠించడం వంటివి, దీక్షా గురుదేవులు శ్రీరామానంద మహారాజు గారి వద్ద ఉపదేశం తీసుకుని, శిష్యునిగా అనేక మానవీయ విలువలను, ధర్మాధర్మ విజ్ఞాన సారాన్ని, కవితా రచన విద్యా విధానాన్ని, నేర్చుకుని, అనేక యక్షగాన నాటకాలు, శతక గ్రంథాలు, ఇలా శివరామ భజన కీర్తనలు పేరిట ఈ భజన సంకీర్తనల గ్రంథాన్ని రచించారు. తాను నమ్మిన సిద్ధాంతంలో హరిహరుల తత్వాన్ని ప్రకటించాలనుకున్న విషయం ఆ కావ్యానికి పెట్టిన పేరులోని మనకు అర్థం అవుతోంది.

ఈ గ్రంథం పద్మశాలి శ్రీ సుంకి కృష్ణయాఖ్యునిచే పరిష్కరింప బడగా, 1963 లో ఈ గ్రంథం తొలిముద్రణ, అలాగే 2004 సంవత్సరంలో మళ్లీ ముద్రణ పొందడం విశేషం.

మొదట ఇష్ట దేవతా స్తుతిని చేస్తూ తొమ్మిది పద్యాలలో వివిధ దేవీ దేవతలను కొనియాడినారు. తర్వాత దత్తాత్రేయ స్తోత్రము, సరస్వతీ స్తోత్రము, విష్ణు స్తోత్రము వంటి స్తోత్రాల పఠనాన్ని కూడా కందార్థాలు, వివిధ సంకీర్తనలతో చేయడం జరిగింది.

రచయిత ఈ సంకీర్తన గ్రంథంలో బహిర్గతంగా హరిహరుల భక్తి తత్వాన్ని ప్రకటించినప్పటికీ, అంతర్గతంగా శ్రీరాముడు, పాండురంగ విఠలునికి సంబంధించిన స్తుతి కీర్తనలు మనకు చాలానే కనిపిస్తాయి. ముందుగా....



శ్రీ గణనాథుని స్తుతి:

శ్రీ గణాధిప నన్ను బ్రోవర – జాగు సేయకను!
జాగు సేయకను – ఇందు రాగదే యికను!!
సురలు మునులు – ప్రథమమున నీ స్మరణ జేసిరి!
స్మరణ జేసిరి వారు – పరము నందిరి!!..............॥శ్రీ గణాధిప॥

శ్రీ సరస్వతి స్తుతి:

శ్రీ సరస్వతి బ్రోవు – నేనే సిటీ పాపము లావు!
దోష కర్ముడని – దూషనాడకు
పోషణ జేయ నరాసర రమ్మీ!!...........॥శ్రీ సరస్వతీ॥

ఈ విధంగా మొదట ఆది గణాధిపతి, శారదాంబ స్తుతులను చేయడం కావ్య ఆరంభంలో, కథారంభంలో ఆనవాయితీ.

ఒకపక్క చేనేత వృత్తిని కొనసాగిస్తూనే, రామాయణ, భారత, భాగవత కావ్యాలను, శతక గ్రంథాలను అవపోసన పట్టిన రచయిత, పొట్టకూటి కోసం తన గ్రామం, చుట్టూరా పరిసర ప్రాంతాలలో శిష్య బృందాన్ని ఏర్పాటు చేసుకొని, ఆ ప్రాంతాలలో ఔత్సాహికులైన యువకులక, భజన, కోలాటం, యక్షగాన ప్రదర్శనకు సంబంధించిన శిక్షణను కూడా ఇచ్చి, వారిచే ప్రదర్శింపజేసి, వారిచే అరకొర కానుకలు, దక్షిణ ద్వారా కుటుంబాన్ని నెట్టుకుంటూ ముందుకు వెళ్లేవారు.

ఈ పరంపరలోని భాషా సాహిత్యాలను చక్కగా నేర్చుకొని, వాటిపై పట్టు సంపాదించుకొని, కవిత్వంలోని మెలకువలను ఒంట పట్టించు కున్నారు. దాని ద్వారా పండరి భజన, అభంగ కీర్తనలు, మరియు ప్రాచీన సాహితీ ప్రక్రియలలో విశేషంగా చెప్పుకోదగిన ప్రక్రియ

కందార్థ ప్రక్రియను కూడా కొనసాగించి, అనేక కందార్థ, గీతార్థ, సీసార్థాలను కూడా రచించడం జరిగింది.

పాండురంగ విఠలుని స్తుతించే విధానంలో, పూర్తిగా మహారాష్ట్ర ప్రాంతంలో గల భజన కీర్తన సంప్రదాయంలో అభంగాలను ఎక్కువగా చదవడం, వారికి కంఠోపాఠం. అలాంటి అభంగ సంప్రదాయానికి నూతనంగా వన్నెలద్ది, తెలుగు భజన కీర్తనలు వాటిని గొప్పగా రచించిన వారు బహుశా! పోచన్న పంతులు గారు ఒక్కరే అయి ఉండవచ్చు. కొన్ని సంకీర్తనలను గమనిస్తే (అభంగాల రూపం లోనివి)

విఠల బ్రోవ – ఇటరా దేవా!
ఎటు నీ త్రోవ – ఎరిగింపవా!.....॥విఠల॥
శ్రీ పాండురంగ నీ రూపు – ఇందు
చూపించు మరగడియ సేపు –
పాపంబులను ఎడబాపు – నాకు
దాపుండు వారెవరె దయ నన్ను గన్న బాపు...॥శ్రీ పాండురంగ॥

పాండురంగ – పాప భంగ
దండ మీదే గొన – రాండి యండ !
పిలిచి పిలిచి అలసియున్న
తలచి తలచి దప్పిగొన్న!!.....॥పాండురంగ॥

శరణే పందరీశ! – నా – స్మరణ విను జగదీశ!
దుర విజయలక్ష్మీశ! – ముర వైరి కరి పోష!!...॥శరణే॥

వంటి కీర్తనలను విన్నప్పుడల్లా, రచయితకు శ్రీ విఠలేశుని పట్ల గల అచంచలమైన భక్తి, మరియు భాషా సాహిత్యాలపై వారికున్నటు వంటి ప్రేమ ఎలాంటిదో తెలుస్తుంది. అలాగే తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రుని స్తుతి కీర్తనలతో కొనియాడిన తీరును గమనిస్తే...

రామ నిన్నే నమ్మి యున్నాను – నా వెన్ను దగిలిన
పామరము లేడబాపు దయతోను!
శ్యామ సుందర మూడుధు నిలపై
ఏమిటీ కుంచినవయయ్యో!!....॥రామనిన్నే॥

దయ రాదెందుకు – నాపై దశరథ రామ!
భయమును దీర్చేటి – ప్రభు పరంధామ!!

అంటూ, నిన్నే నమ్మి ఉన్నాను రామా! నాలో దాగిన పామరత్వాన్ని అనగా దుష్ట గుణాలను, నీచ వైఖరిని, పూర్తిగా తొలగించే వాడివి నీవే తప్ప, మరెవరూ లేరు. అనితత్వంలో తనను తాను స్వాధ్యాయం చేసుకోవడంలో నిమగ్నమవుతాడు రచయిత.

అలాగే శ్రీ మహావిష్ణువును స్తుతి చేస్తూ....

పరాత్పరా! నా – పరీక్ష జూడకు!
హరి నీ సుతుడను గానా – యింత
దురార కరిసంత్రాన!

సరాన విని నాదు – మొరాలకించియు
దురాలోచనలు ద్రుంచు – ఓ మురారి మది దయలుంచు, !!..
॥పరాత్పరా॥

అంటూ పరాత్పరుడైన శ్రీమహావిష్ణువును స్తుతి చేసే ఈ కీర్తనను విన్నప్పుడల్లా, పాఠక హృదయం పులకించి, తెలియని ఒక తాదాత్మ్యం పొందడం అనేది జరుగుతుంది. అలాగే శివుని స్తోత్రాలను స్తుతించే విధానంలో రచయిత వాడిన పదజాలం, భాషా విధానం ఒక గొప్ప సాహితీ మూర్తిని మన కళ్ళ ముందు సాక్షాత్కరింపజేస్తుంది అనడంలో సందేహమే లేదు.

శ్రీ శివ వర రారా భూ
తేశమున్ను భవముల దూర ॥శ్రీ॥

నోషన్ముఖుని నాయన్న
భూసురు నుదయ సంపన్న
వాసుకి భూషణ మహా
వాసికెక్కిన బేసి లోచన!!...॥ శ్రీశివ ॥

ఇలాంటి పదాలు శివ స్తుతి గీతాలలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అలాగే ఆత్మబోధనను ప్రారంభం చేస్తూ, గురు శిష్య సంవాదంలో తాత్విక జీవన చేర్చ విధానాన్ని చెబుతారు రచయిత. ఆధ్యాత్మిక పరంపరలో ఆత్మతత్వ విచారం అనేది ఒక గొప్ప సాధన. ఉపదేశం పొందిన తర్వాత గురువు, శిష్యునికి చెప్పే సన్మార్గ విధానం. ఇది అమూల్యమైనది. అనిర్వచనీయమైనది. పూర్వం గురు పరంపర పద్ధతిలో శిష్యులకు జీవన మోక్ష ప్రాప్తిని ఎరుకపరిచే సందర్భంలో ఆత్మబోధనను చేయడం అనివార్యం. అలా కైవల్యప్రాప్తి కోసం సాధన చేయనివాడు, అరిషడ్వర్గాలను అంటకుండా ఉండని వాడు ఎవడైనా సరే నీచ ప్రవృత్తికి బానిసనే అవుతారు తప్ప మనిషి కానీ అని చెబుతాడు.

రామా యనని వాడు – భూమిలోనున్న కీడు
పామరమా తునమిడు – క్షేమముతుదకు చూడు!! ॥రామా॥
మొట్టమొదట నీవు – ఎట్టుల పుట్టినావు?
గట్టిగా ఇట్టి తావు – గుట్టును తెలుసుకోవు!!.....॥రామా॥

ఈ సంకీర్తనలో రామ ధ్యానాన్ని చేయమని చెప్పడమే కాకుండా, తాను ఈ భూమి పైకి వచ్చిన విధానం మరియు దాని మర్మం తెలుసుకోమని హితువు చేస్తాడు రచయిత. గురు శిష్య సమాజంలో ఇటువంటి అనేక పద్ధతులు, పలు రకాల తాత్విక మార్గాలు కనిపిస్తాయి. యోగ సాధన, ధ్యానం వంటి పలు విధి విధానాలలో అభినివేశం ఉన్న రచయిత జీవన ధర్మాలను, విలువలను చేయగలిగాడు. అన్యులకు ఇది సాధ్యం కాదు.

పోచన్న పంతులుగారు రచించిన ఈ శివరామ భజన కీర్తనలు

కొన్ని భద్రాచలం పురాంకితంగా, ఆ శ్రీరామచంద్రునికి అంకితం ఇస్తూ రాయగా, మరికొన్ని స్తుతులను, గురుశిష్య సంబంధాలను కళ్యంపేట పురాంకితంగా రచించారు.

మచ్చుకు…,
ధరణి భద్రపుర వాస మరి – రామార్యు కింకరుని పోష!
ధరలో కళ్యాణపుర రామాచార్య – చరణసేవకుల దరిజేర్చే శౌర్య!!

ఈ విధంగా అంకిత గ్రామాలను కొనియాడుతూ ప్రతి సంకీర్తన ముందు, సంబంధిత స్తుతి పద్యాలను కూడా రాయడం ఈ సంకీర్తన కావ్యం లో గమనించవచ్చు. దానివల్ల సంకీర్తన విధానానికి ఒక కొత్త ఒరవడిని చేపట్టిన విధానంగా చెప్పవచ్చు. అలాగే రచయితకు పద్య సాహిత్యం పట్ల ఉన్న పట్టు ఎటువంటిదో ఈ క్రింది పద్యం ద్వారా తెలుసుకోవచ్చు.

శార్దులం:
శ్రీ లంబోదరున్వాణినాథుని హరిన్ క్షీరార్ణవున్ నందనిన్
పూలాప్తున్ మరి పండితేంద్రుల శశన్ భూదేవులాచార్యులన్
వాలాయంబుగ రామధ్యానపరుల వాబాదివన్ యోగులన్
నాలోనిల్పి రచింతు కీర్తనలనానందంగ జేతీ ధరన్!!

వంటి ఇష్టదేవదాసు స్తుతి పద్యాలు మనకు కావ్య ఆరంభంలో చాలా కనిపిస్తాయి.

కేవలం 51 పుటలు కలిగిన ఈ చిన్ని పొత్తంలో లెక్కలేనంత విజ్ఞాన భాండాగారం అందించిన ఘనత శ్రీమాన్ పెద్దిరాం పోచమ్మ పంతులు గారికి దక్కుతుంది. కావ్యం చివరన శివుని మంగళహారతి, శ్రీరామచంద్రుని మంగళహారతి, శ్రీ వెంకటేశ్వర స్వామి మంగళహారతి రచించి ఈ గ్రంథానికి మరింత శోభను చేకూర్చడం జరిగింది.

తన రచన ఎంత గొప్పదైనప్పటికీ తనకన్న విజ్ఞాన పరులైన సాహితీవేత్తలు ఉంటారు, ఔత్సాహికులు ఉంటారు. అందువల్ల సర్వజ్ఞులు ఈ కావ్యాన్ని చదివి ఇందులోని తప్పొప్పులను సూచించగలరని సవినయంగా చెబుతూ….

కందం : ప్రాసలు ఘనములు యతులది
యేసరణులొ ఎరుకలేక యీకృతి చేతన్
వ్రాసిన సరిదిద్దగ,కవి
ఈశుల గొనియాడుచుంటి యీ యిలయందున్!!

అంటూ తన నిరాడంబర పాండితే ప్రకర్షణను ఇంత గొప్పగా ఆవిష్కరిస్తారు. ఇంతటి మహత్తరమైన రచనా విధానాన్ని కలిగిన రచయిత పోచన్న పంతులు గారు చిరస్మరణీయులు. ఇప్పటికీ ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలలో గల పలు గ్రామాలలో భజన బృందాలు శివరామ భజన కీర్తనలను ఇప్పటికి పాడడం, పలు సందర్భాలలో పోచన్న పంతులు గారి ప్రస్తావన చేయడం గర్వించదగిన విషయం.

ఇకనైనా ఇలాంటి మరుగున పడిన మాణిక్యాలను వెలికి తీయవలసిన అవసరం నేటి యువ సాహితీవేత్తలపైన మరియు కళాకారుల పైన అలాగే భాషా సాంస్కృతిక శాఖ అయిన ఎంతైనా ఉంది అని చెప్పవచ్చు. అలా అయితే మన సంకీర్తన సాహిత్యాన్ని మనమే కాపాడుకున్న వాళ్ళం అవుతాం.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (48) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

మాతృ భాషా సేవ మరవ కండి

పసుపులేటి నరసింహారావు
ఫోన్ : 80730 60698



దేశ భాష లందు తెలుగు లెస్స యనుచు,
రాయ లపుడె తెలిపె వ్రాత లందు,
అట్టి భాష మనకు అమ్మ భాషగనవ్వ,
తెలుగు విలువ గూర్చి తెలియ జెపెద.

తేనె లొలుకు చుండు తెలుగు పదము లన్ని,
మాట లందు కలవు మధుర రుచులు,
అందమైన లిపిని పొందిన మనభాష,
గద్య, పద్య, తోడ గణతి కెక్కె.

అచ్చు, హల్లు, ఉభయ అక్షరాలు యనుచు,
ఐదు పదుల ఆరు అక్షరాలు,
హ్రస్వ, ధీర్ఘ, ద్విత్వ మనెడి మెట్లు కలిగి,
తెగువ ఎంతొ కలదు తెలుగు నందు.

అలుపు తెలియ కుండ ఆలపించు కొనెడి,
జానపదము లెన్నొ జాలువారు,
రాగయుక్తముగను రంజింపజేసేటి,
పాట్ల పాతరున్న భాష తెలుగు.

గ్రామ్య, గ్రాంథికాల కలగలుపు కలిగి,
తత్సమాలు మరియు తద్భవాలు,
వివిధ తీరులందు వెలిగేటి పదముతో,
పకృతి, వికృతులున్న భాష తెలుగు.

క్రమము తప్పకుండ గణములు ఉండేట్లు
పదము పొందు పరచు పద్య రచన,
వాగులాగ పారు పద కూర్పు కలిగిన,
వచన శైలి యున్న భాష తెలుగు.

తెలుగు నందు చదవ తెలివెంతొ పెరిగేను,
దేశ మంత వ్యాప్తి తెలుగు భాష,
అమెరికందు తెలుగు అదర గొట్టుచు నుండె,
'తాన' సంఘ మెంతొ దన్ను నిలవ.

దేశ భక్తి మెండు తెలుగు జనుల కంత,
పోరు సలిపి నారు పరుల త్రోల,
తెల్ల వారినడ్డె అల్లూరి సీతయ్య,
గుండె చూపి నారు గుండు కాయ.

దేశ నేత లుండె తెలుగు తేజము చాట,
రాష్ట్ర పతుల నిచ్చె రాజ్య మేల,
తెలుగు బిడ్డ అయ్యె దేశ ప్రధానిగ,
లభ్య మయ్యెను ఉప రాష్ట్రపతులు

తెలుగు రైతు బిడ్డ తలకు పాగను చుట్టి,
పొలము పనులు చేయ హలము పట్టి,
పంట లెన్నొ మనకు పండించి ఇచ్చేను,
సేద్య మందు తెలుగు చేవ మెండు.

పనస తొనల వంటి పదజాలములతోడ,
మధురమైన సరళ మాటలుండి,
పండు వలచి నట్టు నుడికారములు యుండి,
తేనెలొలుకు చుండు తెలుగు భాష.

జనుల కొరకు నీతి శతకాలు కలవెన్నొ,
పిల్ల, జెల్ల మెచ్చు పిట్ట కథలు,
చాల అర్ధయుక్త సామెతలుకలిగి,
వెలుగు చుండు ఎపుడు తెలుగు భాష.

దేశ మంత కలరు తెలుగు భాష జనులు,
రెండు రాష్ట్ర మందు మెండు గుండి.
అయ్యె వాని యందు అధికార భాషగా.
ఇతర భాష వారు ఈర్ష్య పడగ.

ప్రాంత వారి కలవు భాష యాసలు చాల,
యాస ఏది అయిన బాస ఒకటె,
ఒకరి యాస నొకరు స్వీకరించు కొనుచు.
ఒక్క బాట నడువు చక్క గాను.

అంతు పట్ట నట్టి అవధాన ప్రక్రియ,
తెలుగు భాష సొత్తు తెలుసు కొనరె.
రంగ స్థలము పైన రాగాలు తీసేటి,
పద్య నాటకాల పట్టుగొమ్మ,

తెలుగు సినిమ ఘనత దేశాంతరాలలో
గొప్ప పేరు పొందె చెప్ప తరమె,
అన్ని భాషలందు అనువదింప బడుచు,
దేశ వ్యాప్తి చెందె తెలుగు సినిమ.

ఎచట కేగి నాను ఏమి చేసిన గాని,
మాతృ భాష నెపుడు మరువ వద్దు,
తెలుగు భాష ఎన్నొ వెలుగులు చూపేను,
తెలుగు నేర్వ నట్టి తెగులు వలదు.

తెలుగు తల్లి ఎపుడు వెలుగుతూ ఉండమ్మ,
ఘనత చాటు కొనుచు, గర్వ పడుతు,
అవని తలము పైన అన్ని మూలల పాకి,
మధుర రుచులు అన్ని మాకు పంచు.

తెలుగు వీరులంత ఎలుగెత్తి చాటండి,
తెలుగు ఘనత నంత తెలియజేయ,
దేశ వ్యాప్తి చెంద తెలుగు వెలుగు లన్ని,
మాతృ భాష సేవ మరవ కండి.

జై తెలుగు తల్లి !!

నీటి సంక్షోభం – నాటికల ప్రతిధ్వని

డా. వై. సుభాషిణి, సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, **కె. అశ్విని,** అధ్యాపకులు, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి. ఫోన్ : 99

ఉపోద్ఘాతం : దృశ్య కవిత్వం, శ్రవ్య కవిత్వం మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. చూసిన దృశ్యం మనసులో వెంటనే ముద్ర వేసుకుంటుంది. కాని శ్రవ్య కవిత్వాన్ని ఎక్కువ కాలం గుర్తుంచు కోవడం అంత సులభం కాదు. పాఠకులకు లేదా ప్రేక్షకులకు సందేశాన్ని సులువుగా చేరవేయాలంటే దృశ్యకవిత్వం ఒక ముఖ్యమైన మార్గంగా నిలుస్తుంది. నేటి ప్రపంచం ఆధునికత వైపు వేగంగా దూసుకుపోతోంది. ఆ వేగంలో లభ్యమయ్యే వనరులన్నింటినీ నిర్మూలించి మరీ వినియోగిస్తోంది. సహజ వనరులను ఆక్రమించి వాటిని వ్యాపార సాధనాలుగా మారుస్తోంది. వాటిలో ప్రధానమైన వనరు నీరు. నేడు కనీస అవసరాలకు కూడా నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. భూమిపై నీటి శాతం తగ్గడానికి ప్రధాన కారణం కాలుష్యం. ఆ కాలుష్యానికి మూలం మానవ తప్పిదాలే. ఫ్యాక్టరీలు నిర్మించడం, పరిశ్రమల వ్యర్థాలను నదులలో వదలడం, ప్లాస్టిక్ అధిక వినియోగం వంటి చర్యల వలన సహజ వనరులు నశించిపోతున్నాయి. ఈ పలు సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని, చాలామంది నాటక రచయితలు రాబోయే భయంకర పరిస్థితులను దృశ్యమానం చేస్తూ ప్రజలను జాగృతం చేయడానికి నాటికలను రచించారు. వాటిలో మాడభూషి దివాకరబాబు రాసిన “పిపాస”, శారదా ప్రసన్న రాసిన “ప్లాస్టిక్ కవర్” అనే నాటికలు ముఖ్యమైనవి.

1. పిపాస : తినడానికి అనేక ఆహార పదార్థాలు లభించినా, తాగునీరు లేకపోతే జీవనం కొనసాగడం అసాధ్యం. ఈ సత్యాన్ని ఆధారంగా తీసుకుని మాడభూషి దివాకరబాబు “పిపాస” రచించారు. ఈ నాటిక నీటి విలువను, దాని కొరత కారణంగా ఏర్పడే విపత్తులను సమాజానికి బలంగా గుర్తుచేస్తుంది. సాధారణంగా మధ్యతరగతి కుటుంబాల్లో కనిపించే ప్రేమానుబంధాలు ఎంతో సున్నితమైనవి, ఆప్యాయమైనవి. ఒకరి కోసం మరొకరు చిన్న చిన్న పదార్థాలను కూడా దాచిపెట్టి ఇచ్చుకునే సౌమ్యమైన సంబంధాలు, కరువుకాటకాల వంటి క్లిష్ట పరిస్థితుల్లో విచ్ఛిన్నమై శత్రుత్వానికి దారితీసే దృశ్యాలను ఈ నాటకంలో ఆవిష్కరించారు. ఇంతవరకు నిలకడగా ఉన్న అనుబంధాలు నీటికొరత అనే సంక్షోభంలో పటాపంచలై పోతాయని రచయిత బలంగా ప్రతిపాదించారు. నీటికోసం పడే తపనలో మనిషి రక్తం కక్కి మరణించే పరిస్థితి వచ్చినప్పుడు, చివరికి “ప్రకృతిమాతే మా దిక్కు” అని ప్రాధేయపడే దుస్థితి నాటకానికి కేంద్రబిందువుగా నిలుస్తుంది. మానవుడు ప్రకృతిని అవివేకంగా వినియోగిస్తే, ప్రకృతి తన సహనాన్ని విడిచి,

నీటి కరువురూపంలో తన శక్తిని, ప్రతాపాన్ని మనిషి అనుభవించేలా చేస్తుందని “పిపాస” నాటికలో రచయిత చూపించారు. మనిషి చేసిన దుశ్చర్యలకు ప్రతిఫలంగా ప్రకృతి ఎలా ప్రతిస్పందిస్తుందో, సహజ వనరులను పరిరక్షించని సమాజం చివరికి ఏ స్థితికి చేరుతుందో స్పష్టంగా ప్రతిపాదించారు. అందువల్ల ఈ నాటకం కేవలం సాహిత్య సృష్టి మాత్రమేకాక, పర్యావరణ అవగాహనకు దారితీసే ఒక సమాజ జాగృతి పిలుపు కూడా.

సుదర్శనం – మహాలక్ష్మి దంపతులు వారి ఇద్దరు పిల్లలు సుచిత్, చిక్కుతో కలిసి ఒక పట్టణంలో నివసించారు. వారి ఇంటి పైగదిని సత్యం అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. ఇల్లు ఉన్న ప్రాంతం రద్దీ ప్రదేశంకుడి వైపున చెక్క పనుల మిల్లు, ఎడమ వైపున పెట్రోలు–డీజిల్ షాప్ ఉండటంతో ఎప్పుడూ కాలుష్యం, వాహనాల రాకపోకలతో కిక్కిరిసి ఉంది. పర్యావరణ సమస్యలను గమనిస్తూ సత్యం ఎల్లప్పుడూ మనస్సులో బాధపడేవాడు. ఆ ప్రాంతంలో తాగునీటి కొరత ఎక్కువ. ప్రతి ఇంటికి ట్యాంకుల ద్వారా నీటిని కొనుగోలు చేసుకోవాల్సిందే. ఒక రోజు సుదర్శనం స్నానం చేస్తుండగా ట్యాంక్‌లోని నీరు మధ్యలోనే అయిపోవడంతో ఇబ్బంది పడ్డాడు. వెంటనే సరఫరాదారుడిని పిలిపించి ట్యాంక్ నింపించుకుని తన పని పూర్తి చేశాడు. సుచిత్ చదువులో మునిగిపోయి భవిష్యత్తులో శాస్త్రవేత్త కావాలని కలలు కన్నాడు. చిక్కు మాత్రం 14 ఏళ్ల చిన్నారి. ఎప్పుడూ ఇంట్లో కూర్చోకుండా బయట ఆడుకోవడానికే ఎక్కువ ఆసక్తి చూపేది. తల్లి ఎంత మందలించినా, ఎంత అడ్డుకున్నా పట్టించుకోకుండా తన సరదాలలో మునిగిపోయేది.

మహాలక్ష్మికి తులసిచెట్టుకు పూజ చేయడం నిత్యకృత్యం. ఒకరోజు చిక్కు పూలు తెచ్చి అమ్మకు అందించింది. మహాలక్ష్మి ఆశ్చర్యంతో,

"ఎక్కడివీ పూలు? ఈరోజు కూడా ఆ చిట్టితల్లి ఇచ్చిందా?" అని అడగగా, చిక్కు చిరునవ్వుతో **"అవును"** అని సమాధానమిచ్చింది. తరువాతి రోజు చిక్కు బయటికి వెళ్లి ఒక జామపండు తెచ్చి ఇచ్చింది. మహాలక్ష్మి అది తనకు తినాలని ఉన్నా, వెంటనే భర్త సుదర్శనం ఈ పండును చాలా ఇష్టపడతాడని భావించింది. అయితే, తన కుమారుడు సుచిత్‌కి ఇది ఇంకా ఎక్కువ ఇష్టం అని గుర్తుచేసుకొని, పండును కుమారుడికి ఇచ్చింది. సుచిత్ ఆ పండును తీసుకుని, తన తండ్రి మీదున్న ప్రేమతో ఆయనకే అందించాడు. సుదర్శనం కూడా ఆ పండును తిరిగి భార్యకు ఇచ్చాడు. ఇలా ఒక చిన్న జామపండు కుటుంబంలో ప్రతిఒక్కరి మమకారాన్ని ప్రతిబింబిస్తూ చేతులు మారుతూ చివరికి మళ్లీ మహాలక్ష్మికే చేరింది. ఈ దృశ్యం చూసి చిక్కు చిరునవ్వు చిందించింది. వెంటనే బయటికి వెళ్లి మరో రెండు జామపండ్లు తీసుకొచ్చి తల్లికి అందించింది. **"ఇవి ఎక్కడివి?" అని అడగగా, "చిన్న మామయ్య ఇచ్చాడు"** అని చెప్పి పరుగెత్తు కుంటూ వెళ్లిపోయింది. చిక్కుకి వీధి అంతా పరిచయమేనని అందరూ నవ్వుకున్నారు. సత్యం, పక్కనే ఉన్న రంపపు మిల్లు యజమానులను, డీజిల్ షాపు వారిని పర్యావరణానికి హాని కలిగించే విధానాలను తగ్గించి, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని పలుమార్లు హెచ్చరించాడు. కానీ వారు ఆయన మాటలను పట్టించుకోలేదు. ఇంతలో మహాలక్ష్మికి తమ్ముడు వరుస అయ్యే గంగాధర్ అనే వ్యక్తి సుదర్శనం ఇంటికి వచ్చాడు. అతడు ఖాళీ స్థలాలను కొంతకాలం లీజుకు తీసుకుని వ్యాపారం చేసుకుని, తిరిగి అప్పగించే అలవాటున్న వ్యాపారి. సుదర్శనం కుటుంబాన్ని కలిసిన గంగాధర్, ఊరు బయట ఉన్న కొంత భూమిని లీజుకు ఇవ్వమని, దానికి బదులుగా మంచి డబ్బు ఇస్తానని కోరాడు. మొదట సుదర్శనం అంగీకరించలేదు. కానీ డబ్బు ఆశతో మహాలక్ష్మి, సుచిత్ ఆ ప్రతిపాదనకు ఒప్పుకున్నారు. గంగాధర్ అక్కడ బోరు తవ్వించి, ఆ నీటిని తన వ్యాపార అవసరాలకు వినియోగించుకోవాలనేది అతని ఉద్దేశం. చివరికి ఆ స్థలాన్ని అతనికి లీజుకు ఇచ్చేశారు.

ఒక రోజు హఠాత్తుగా రంపపు మిల్లు యజమాని, డీజిల్ షాపు యజమాని కత్తులు పట్టుకుని సత్యంపై దాడికి దిగారు. కారణం సత్యం వీరిమీద పర్యావరణ కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేయడం. కోపంతో ఉవ్వెత్తున లేచిన వారు కత్తులను సత్యం మీదకు ఎత్తేసరికి, భయంతో సత్యం నోరు మూగబోయిందిబీ మాటలు రావడం మానేశాయి. కొన్ని రోజులకే ఆ ఊరిలో నీటి కొరత భయంకరరూపం దాల్చింది. నీటి వనరులు పూర్తిగా ఎండిపోయి, ఒక్క నీటి చుక్క కనపడని స్థితి ఏర్పడింది. దాహంతో చిన్న చిన్న పక్షులు, జంతువులు, అమాయక చిన్నపిల్లలు తట్టుకోలేక ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోయి శవాలుగా నేలకూలిపోయారు.

అప్పుడే బయట నుండి ఇంట్లోకి వచ్చిన సుదర్శనం, గొంతు తడపడానికి కూడా నీరు ఎక్కడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే సమయంలో మహాలక్ష్మి తమ్ముడు గంగాధర్‌ను రంపపు మిల్లు, డీజిల్ షాపు యజమానులు కత్తులతో తరుముకుంటూ సుదర్శనం ఇంటి వైపు వచ్చారు. కారణం ఏమిటని ఆశ్చర్యపోయిన సుదర్శనం ప్రశ్నించగా వారు, **"ఈ నీటి కొరతకు గంగాధరమే కారణం"** అని ఆగ్రహంగా సమాధానమిచ్చారు. The greatest threat to our planet is the belief that someone else will save it (Waterless.com) అన్నారు Robert swan. అది అక్షర సత్యమన్నది ఈ నాటకం వ్యక్తం చేస్తుంది. గంగాధర్ ఖాళీ స్థలాలను లీజుకు తీసుకుని బోరుబావులు తవ్వించడం వల్ల భూగర్భ జలాలు ఎండిపోయాయన్నాడు. వెంటనే గంగాధర్ కూడా వాదనకు దిగాడు. **"నువ్వే చెట్లను నరికి, వాటితో వస్తువులు తయారు చేసి ప్రకృతి సమతుల్యతకు భంగం చేశావు. నీవల్లే ఈ వినాశనం. అలాగే డీజిల్ షాపుతో వాయు కాలుష్యాన్ని పెంచి వర్షాలు పడకుండా చేసిన నీవే కారణం"** అని ఎదురు వాదించాడు. అప్పుడు సుచిత్ మధ్యలో వచ్చి, **"ఈ నీటి కొరతకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ మీలాంటి వారే కారణం"** అని ఘాటుగా చెప్పాడు. వెంటనే తాగునీరు దొరుకుతుందేమో అని బయటకు వెళ్ళాడు. కానీ ఖాళీ చేతులతోనే తిరిగి వచ్చాడు. ఇంతలో సత్యం ఇంట్లో దాహంతో ఒక మూలన దిగులుగా కూర్చున్నాడు. ఇటు సుదర్శనం దాహంతో తట్టుకోలేక అల్లాడితే, సుచిత్ కూడా తీవ్రమైన దాహంతో బాధపడ్డాడు. సుదర్శనం ఇంట్లోకి వెళ్లిన వెంటనే, సుచిత్ చెత్త బుట్టను కిందకు తీసి చూసి, అడుగున ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో కొద్దిగా నీరు కనిపించింది. దాన్ని చూసి ఆనందంతో సత్యం వైపు చూశాడు. **"నాన్నకు, అమ్మకు చెప్పొద్దు"** అని సైగ చేశాడు. అప్పుడే సుదర్శనం బయట నుండి వచ్చాడు. సుచిత్ ఆ బాటిల్‌ను తొందరగా సోఫా పక్కన దాచిపెట్టాడు. సుదర్శనం వచ్చి అదే సోఫా పక్కన కూర్చుంటే, తన చేతికి ఆ బాటిల్ తగిలింది. దాన్ని తీసుకుని ఎవరికీ కనిపించకుండా చాటుగా దాచుకున్నాడు.

సుదర్శన్ ఆ బాటిల్‌లో మిగిలిన నీటిని ఎవరికీ తెలియకుండా తులసిచెట్టు దగ్గర విసిరేశాడు. అప్పుడే మహాలక్ష్మి తన గొంతు ఎండిపోతూ, దాహంతో వేదనపడుతూ, తులసిమాతకు దణ్ణం పెట్టుకుంటుండగా. అక్కడే నీళ్ళ బాటిల్ కనబడింది. ఆనందంగా దాన్ని అందుకుంది. ఆ సమయంలో సుదర్శన్ వెంటనే అటు పరుగెత్తి, **"అది నాది– నేనే అక్కడ పెట్టాను"**అన్నాడు. మహాలక్ష్మి వదిలి పెట్టకుండా, **"కాదు, ఇది నాకు దొరికింది. కనుక నాదే!"** అని వాదించింది. ఇద్దరి వాదనలోకి సుచిత్ చేరి, **"ఇది అసలు నాది! నేను దాచుకున్నాను. మీ ఇద్దరిదీ కాదు"** అని గట్టిగా అన్నాడు. అప్పుడే ముగ్గురూ ఒక్కొక్కరు తమ హక్కుకోసం పోటీ మొదలుపెట్టారు. **"నేను చిన్నవాడిని - అందుకే ఇది ముందుగా నాదే"**– సుచిత్, **"ఈ కుటుంబ భారమంతా మోసేది నేనే - అందుకే బ్రతకాలి**

ముందు నేనే"– సుదర్శన్, **"ఇంటి పని, వంట పని చూసేది నేనే – నాకు ముందు హక్కుంది"**–మహాలక్ష్మి, **"నేను వంశాన్ని నిలబెట్టేది – అందుకే నేను బ్రతకాలి ముందు"**– సుదర్శన్, ఇలా ఒక్కొక్కరు నైతికత మరిచి **"నాది–నాది"** అని బాటిల్ కోసం వాదులాడుకున్నారు. ఈ దృశ్యాన్ని సత్యం చాలా దీనంగా చూసి మౌనంగా తలదించు కున్నాడు. అంతలో, చిక్కు బయటనుండి లోపలికి వచ్చి, తల్లి చేతిలో ఉన్న నీళ్ళ బాటిల్‌ను లాక్కొని బయటికెళ్ళిపోయింది. దాన్ని చూసి ముగ్గురూ కోపంతో ఊగిపోయారు. సుచిత్ "తీసుకొస్తా!" అని బయలుదేరాడు. అయితే అప్పటికే చిక్కు చేతిలోని నీరు మాయమై పోయింది. కోపంతో ఊగిపోతూ సుచిత్ చిక్కు జుట్టు పట్టుకొని లాక్కొచ్చి ఇంట్లో పడేశాడు. తల్లి ఆవేదనతో అడిగింది : **"ఆ నీటిని ఏం చేసావురా?"** చిక్కు అమాయకంగా సమాధానం ఇచ్చింది :**"చిట్టి తల్లికి ఇచ్చేశా"** మహాలక్ష్మి కోపంతో **"మేము ఇక్కడ దాహంతో చస్తుంటే నువ్వు బయట ఎవరికో నీళ్లు ఇస్తావా?"** అని అరిచింది. **"నీరు కూడా అంటుకొని మండగలదు. ప్రపంచానికి ఉద్రిక్తత కల్గించేది పెట్రోలుగాదు, నీరే! నీటి సమస్య అనేది చాలా చాలా సంక్లిష్టమైన సమస్య. ఈ నీటి సమస్య కేవలం మన దేశానికి మాత్రమేకాదు. అది నేడు ప్రపంచస్థాయిలో కూడా జటిలంగా ఉంటోంది. నీటి కాలుష్యం పెరుగుతోంది. అంతేకాదు నీటి పరిమాణం కూడా క్రమంగా తగ్గుతోంది."** 1998లో అటల్‌బిహారి వాజ్‌పేయి (పర్యావరణం –సమాజం; పుట : 127–128) అన్నారని నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. నీరు మండటమంటే ఇదేనన్నది ఈనాటిక స్పష్టం చేస్తోంది.

అయితే ఈ నాటికలో చిక్కు అందరితో **"చిట్టి తల్లికి నీళ్లు ఇస్తే – అది బ్రతికి రేపు మరిన్ని పువ్వులు, మొక్కలు ఇస్తుంది. చాలా మందిని బ్రతికిస్తుంది. అందుకే దానికి నీళ్లు ఇచ్చాను"** అన్నప్పుడు మహాలక్ష్మి ఆశ్చర్యంతో అడిగింది! **"చిట్టి తల్లి అంటే ఎవరు?"** **"ఒక పూల మొక్కే – అది నా చిట్టి తల్లి."** అంది చిక్కు. ఆ మాట విన్న అందరూ మౌనంగా ఒకరినొకరు చూశారు. మరిచిపోయిన ప్రకృతి విలువ అందరికీ గుర్తుచేసింది చిక్కు. ఇదే అంకితభావంతో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలనే సందేశాన్ని, ఒక హెచ్చరికను ఇస్తుంది ఈ నాటిక.

సత్యం తన కళ్లతోనే చిక్కుని దీవించాడు. **"ఇన్ని రోజులు నువ్వు చిన్న మామయ్య, పెద్ద మామయ్య అంటూ ఉంటే ఎవరిని అంటున్నావు?"** అని అడిగాడు. చిక్కు మెల్లగా సమాధానమిచ్చింది– **"జామచెట్టు, మామిడి చెట్టు"**ఇంతలోనే చిక్కు ఒక్కసారిగా ఆయాసంతో నేలమీద కూలిపోయింది. మహాలక్ష్మి కంగారుపడి బిడ్డను గదిలోకి తీసుకెళ్లి, బయటికి వెళ్లి నీళ్ళని తెమ్మని సుచిత్‌కి చెప్పింది. సుచిత్, సత్యం ఇద్దరూ నీటి కోసం బయలుదేరారు. చిక్కు తల్లి ఒడిలో తలవాల్చి, చివరి శ్వాసలో చెప్పింది: **"అమ్మా – నా వాటా నీరు నా నేస్తాలకు పోయండి"** అని, కొన ఊపిరితో శవమై పడిపోయింది. మహాలక్ష్మి గట్టిగా కేక వేసింది. ఇంతలోనే తలమీద రక్తం కారుతుండగా, చేతిలో వాటర్‌బాటిల్ పట్టుకుని సుచిత్ లోపలికి అడుగుపెట్టాడు. అయితే మహాలక్ష్మి ఆ దృశ్యాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోయి కూలిపోయింది. సుచిత్ కూడా రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ భయంకర దృశ్యాలన్నీ చూసిన సుదర్శన్ హృదయం కుదేలైంది. అప్పుడే ఎక్కడ్నుంచో ఒక ఆత్మస్వరూపిణి స్త్రీ గళం వినిపించింది **"నీకు ఏం కావాలి సుదర్శనా?"** సుదర్శన్ కన్నీళ్లు కారుస్తూ మొరపెట్టుకున్నాడు: **"అమ్మా.. ప్రకృతిమాతా.. నీ పాలలాంటి స్తన్యం కావాలి తల్లి! నీ స్తన్యమే నీరని నాకు చాలా ఆలస్యంగా తెలిసింది.. క్షమించు తల్లి.."**అని దాహంతో వణుకుతూ తన చేతిలోని వాటర్‌బాటిల్‌లో మిగిలిన నీటిని తులసిచెట్టుకు పోశాడు. అంతే, ఆకాశం ఒక్కసారిగా మారింది. ఇంతలో పెద్ద ఉరుములతో, మెరుపులతో పెద్ద వర్షం కురవడంతో నాటిక ముగియటం కథ.

మాడభూషి దివాకర్ బాబు రచించిన "పిపాస" నాటకం పర్యావరణ సాహిత్యంలో ఒక ప్రతిష్ఠాత్మక కృతిగా పరిగణించదగినది. నీటి కొరత, వృక్ష సంపద నాశనం, పారిశ్రామిక కాలుష్యం వంటి అంశాలను ఈ నాటకం స్పష్టంగా ఎత్తి చూపుతుంది. సత్యం అనే పాత్ర ద్వారా రచయిత ప్రకృతిని కాపాడమనే అవగాహనను సమాజానికి అందిస్తారు. అయితే అతని మాటలను సమాజం పట్టించుకోకపోవడం, దుష్ట శక్తులు అతన్ని నోరుమూయించే ప్రయత్నం చేయడం పర్యావరణ పరిరక్షకులు ఎదుర్కొనే చేదు వాస్తవాన్ని ప్రతిబింబిస్తుంది.

నీటి కొరతవల్ల మానవ బంధాలు ఎంతగా విలువ కోల్పోతాయో ఈ నాటకం కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. ఒకప్పుడు బంధుత్వాన్ని గౌరవించే కుటుంబం, నీటికోసం పోరాడుతూ విడిపోవడం, చిన్నారులు కూడా దాహంతో మృత్యువాత పడటం ఇది మానవ సమాజం పతనానికి సంకేతం. దివాకర్ బాబు సమాజంలో పెరుగుతున్న స్వార్థాన్ని, ప్రాణాధారమైన నీటికోసం మనిషి ఎంత నీచానికి దిగజారతాడో దృశ్యమానం చేశారు.

ఈ నాటకంలో ప్రకృతిని తల్లిగా చిత్రించడం విశేషం. సుదర్శన్ **"ప్రకృతిమాత నీ స్తన్యమే నీరు"** అని గ్రహించడం ద్వారా రచయిత లోతైన ఆధ్యాత్మికతను ప్రతిబింబించారు. ప్రకృతి తల్లి పాలంత పావనమైన నీరు లేకుండా మానవ జీవనం అసాధ్యం. ఈ రూపకం మనిషి–ప్రకృతి సంబంధాన్ని గాఢంగా అర్థం చేసుకునేలా చేస్తుంది. చివరగా వర్షం కురవడం, ప్రకృతి మళ్లీ జీవనాన్ని పునరుద్ధరించడం నాటకానికి ఆశాజనక ముగింపును ఇచ్చింది.

"పిపాస" నాటకం కేవలం కుటుంబ కథ కాదుబీ ఇది సమాజానికి ఒక హెచ్చరిక. నీరు, వృక్షాలు, ప్రకృతి సంపదలను కాపాడకపోతే మానవ సంబంధాలు, సంస్కృతి, జీవనమూల్యాలు అన్నీ కరిగిపోతాయని దీని సందేశం. పర్యావరణ సాహిత్యంలో ఈ

నాటకం ఒక మధురమైన, హెచ్చరికతో కూడిన స్వరంగా నిలుస్తుంది.

"గంగాధర్ లాంటి వ్యక్తులు నీటిని వ్యాపార వస్తువుగా మార్చి భూగర్భ జలాలను దోచుకుంటున్న తీరును కవి చిత్రించారు. ప్రకృతిచే ఉచితంగా లభించే ఈ నీటిని స్వార్థపరులు వ్యాపార లాభాలకోసం అమ్మకానికి పెట్టడం, భూగర్భజలాలను అదుపు లేకుండా తవ్వి వెలికితీయడం వల్ల సమాజంలోని సామాన్య ప్రజలు దాహంతో అలమటించే స్థితికి చేరుకుంటున్నారు. నీటిని వ్యాపార వస్తువుగా మార్చే ఈ దోపిడీని గమనించిన కవి, రాబోయే కాలంలో నీరు బంగారం కన్నా ఎక్కువ విలువ కలిగిన వస్తువుగా మారిపోతుందని నిగూఢంగా సూచించారు. ఈ ఆలోచన ద్వారా కవి, మానవ సమాజానికి ఒక గంభీరమైన హెచ్చరికను అందిస్తూ, నీటి సంరక్షణ ఎంత అవసరమో స్పష్టంజేశారు.

"పిపాస" నాటకంలో మాడభూషి దివాకర్ బాబు, చిన్నారి 'చిక్కు' పాత్ర ద్వారా నీటి విలువను, ప్రకృతిపట్ల మమకారాన్ని సున్నితంగా ఆవిష్కరించారు. చిక్కు ఒక చిన్నపాపే అయినా, మొక్కలనే తన నిజమైన నేస్తాలుగా భావించి వాటికి నీరుపోసి వాటి ఫలాలను పంచుకుంటూ జీవించింది. ఆమె చివరి శ్వాసలో కూడా – **'అమ్మా... నా వాటా నీళ్లను నా చిట్టి తల్లికి... ఆ పూల మొక్కకు పోయండమ్మా... పోస్తావు కదూ...'** అని తల్లిని వేడుకోవడం, చిన్నారి హృదయంలో ప్రకృతిపట్ల ఉన్న అనురాగాన్ని మన కళ్లకు కడుతుంది. దివాకర్ బాబు ఈ సంఘటన ద్వారా నేటిబాలలలో కూడా ప్రకృతితో, చెట్లతో, పూల మొక్కలతో ఇలాంటి మమకారం పెంపొందించు కోవాలని స్పష్టమైన సందేశాన్నిచ్చారు. నీటి సంరక్షణ ఎంత అవసరమో, ప్రకృతిపట్ల ప్రేమ అంతే అవసరమని ఈ పాత్ర వివరిస్తుంది. Thousands have lived without love not one without water (W.H. Auden-British American Poet; (Waterless.com) అన్నది ఈ నాటిక స్పష్టం చేస్తోంది. సుదర్శన్ తన చివరి దశలో ఆ ప్రకృతి మాతతో అమ్మా నీ స్తన్యమే.. మాకు మంచి నీటిదార అని మేము తెలుసుకోలేక పోయామమ్మా.. మేము నీ బిడ్డలం నువ్వు ఆగ్రహిస్తే బ్రతకలేం.. అనుగ్రహించు తల్లీ అని వేడుకోవడంలో... ఈ సమస్త ప్రకృతిని కన్నతల్లిలాగా గౌరవించాలని రచయిత దివాకరబాబు ఎంతో హృద్యంగా వర్ణించారు.

2. ప్లాస్టిక్ కవర్ : ప్లాస్టిక్ కారణంగా నీటి ప్రవాహం ఆగిపోవడం నీరు లేకపోవడం వలన కుటుంబంలోని వ్యక్తుల, దినచర్యలు అస్తవ్యస్తంగా మారడం వాదనలకు దారి తీయడాన్ని చూపిస్తుంది "ప్లాస్టిక్ కవర్" అనే నాటిక.

రవి – రాధిక భార్యాభర్తలు. రమణ వాళ్ల కొడుకు. ఒక రోజు ఉదయాన్నే రాధిక వంట చేస్తూ ఉండగా, రవి ఆఫీసుకి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. రమణ తన పరీక్ష రాయడానికి వెళ్లాలి. రవి స్నానం చేస్తూ సగం వరకు నీళ్ళు పోసుకున్నాడు, కానీ ట్యాంకులో నీళ్లు అయిపోయాయి. టవల్ కప్పుకొని బయటకు వచ్చాడు. రాధిక, రమణను **"పచ్చిమిర్చి తీసుకురా రా"** అని కొట్టుకి పంపించింది. సంచి తీసుకెళ్లు అంది. రమణ, **"అవసరం లేదు అమ్మా, వాళ్లే కవర్ ఇస్తారు"** అని వెళ్లిపోయాడు. రమణ తిరిగి రాగానే, రవి మోటారు ఆన్ చేయమన్నాడు. మోటారు తిరుగుతున్నా నీళ్లు రావడంలేదు. **"ఆఫీసుకి ఆలస్యం అవుతోంది, ఒక్క బిందెడు నీళ్ళు ఉన్నా ఇవ్వు రాధిక"** అన్నాడు రవి. **"అది మీకిస్తే తాగడానికి నీళు ఏమి చెయ్యాలి?"** అంది రాధిక. **"అయితే నేను క్యాన్ తెచ్చుకుంటా"** అన్నాడు రవి. రాధిక నీళ్ళబిందె ఇవ్వబోతుండగా, రమణ తీసుకుంటూ **"నాకు ఎగ్జామ్ ఉంది"**నీ **"నాకు ఆఫీసు ఉంది"**ని రవి, ఇద్దరూ లాక్కోవడంలో బిందె కింద పడిపోయి నీళ్లు వృథా అయ్యాయి. మున్సిపాలిటీకి ఫోన్ చేశారు. వాళ్లు **"ముందు రోజు బుక్ చేస్తేనే వస్తాం"** అన్నారు. మోటారు చెడిపోయిందేమోనని చూసేందుకు రమణ మెకానిక్ కోసం వెళ్లాడు. ఇంతలో, రవి తండ్రి రాఘవయ్య ఒక చావుకి వెళ్లి బయట నుండి వచ్చాడు. అతనికి కూడా స్నానం చేయడానికి నీళ్లు లేవు. అదే సమయంలో తీర్థయాత్రల నుండి వస్తూ, రాధిక తల్లిదండ్రులు తమ కూతురిని చూడటానికి వచ్చారు. కానీ రాధిక నాన్నకు విరేచనాలు రావడంతో బాత్రూంలోకి పరుగెత్తాడు. నీళ్లులేక ఇబ్బందిపడ్డాడు. చివరికి మెకానిక్ వచ్చి, **"మోటారు రివర్స్‌లో తిరుగుతోంది. దానిని బాగు చేయడానికి నాలుగు రోజులు పడుతుంది"** అన్నాడు. **"అమ్మో! నాలుగు రోజులు ఈ బాధలు ఎలా భరిద్దాం?"** అని అందరూ ఆందోళన చెందారు. అప్పుడు రాఘవయ్య ముందుకు వచ్చి, **"కొత్త మోటారు కొనండి"** అని 10,000 రూపాయలు ఇచ్చాడు.

రాధిక తండ్రి బాత్రూంలో నీళ్లులేక తీవ్రంగా ఇబ్బందిపడుతూ అరుస్తూనే ఉన్నాడు. అది చూసి తట్టుకోలేక రాఘవయ్య ఒక బిందె తీసుకొని వీధిలోకి వెళ్లి నీళ్లు తెచ్చి అతనికి ఇచ్చాడు. కొత్త మోటారు తెచ్చిన మెకానిక్ జాగ్రత్తగా చూసి, **"సారీ అండి, సమస్య మోటార్‌ది కాదు. పైపులో ఏదో అడ్డు పడినట్టుంది"** అన్నాడు. తర్వాత మరొక వర్కర్‌ని పిలిపించి పైపు చెక్ చేయగా, అందులో ఒక ప్లాస్టిక్ కవర్ ఇరుక్కుపోయి నీరు ఆగిపోయిందని తెలిసింది. ఈ విషయం విని అందరూ ఆశ్చర్యపోయారు. అది ఎలుకలు లాగి లోపలికి నెట్టివేసి ఉండొచ్చని అనుకున్నారు. అలా చూస్తే ప్లాస్టిక్ ఎంత ప్రమాదకరమో, మన జీవనానికి ఎంతటి ఇబ్బందులు కలిగించగలదో అందరికీ అర్థమవ్వడమే ఇతివృత్తం.

ఈ నాటికలో శారదా ప్రసన్నగారు **"ఒక గంటసేపు కూడా నీళ్లు అందుబాటులో లేకపోతే మానవ జీవితం ఎలాంటి స్థంభనకు గురవుతుందో కళ్లకుకట్టినట్టు చూపించారు."** When the well is dry we know the value of water (Waterless.com) అంటారు Benjamin Franklin. ఇది కఠోర వాస్తవమన్నది ఈ

నాటిక ఋజువు చేస్తోంది. ఇందులో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం, అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాల్సిన ఆవశ్యకతను ప్రతిబింబించారు. మానవ సంబంధాలు ఎంత బలంగా ఉన్నా, నీటి కరువు వంటి పరిస్థితుల్లో అవి ఛిన్నాభిన్నం కావచ్చని రచయిత స్పష్టంగా సూచించారు. రవి తండ్రి రాఘవయ్య, రాధిక తల్లి రత్న మధ్య జరిగిన వాగ్వాదం దీనికి ఉదాహరణ. **"ఇది నా కూతురు ఇల్లు కాబట్టి నాకు ముందుగా నీళ్లు కావాలి"** అని రత్న చెప్పగా, **"ఇది నా కొడుకు ఇల్లు కాబట్టి నాకు కావాలి"** అని రాఘవయ్య ప్రతిస్పందించడం ద్వారా, అవసరాలు మనిషి స్వభావాన్ని ఎంత సులభంగా మార్చగలవో ఈనాటిక బలంగా వ్యక్తం చేస్తుంది.

నీళ్లు పుష్కలంగా ఉన్నప్పుడు మనం వాటిని విచ్చలవిడిగా వృథా చేస్తాం. కానీ ఏ వనరునైనా అదుపులేకుండా వాడితే అది తరిగిపోవడమే కాకుండా భావితరాలకు అందకుండా పోతుంది. అంతేకాకుండా ప్రస్తుత తరమే అనేక కష్టనష్టాలను అనుభవించాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. పట్టణాల్లో బిందెలు పట్టుకుని నీళ్లకోసం వీధుల్లోకి వెళ్లడం కొంతమందికి కష్టంగా, అవమానంగా అనిపిస్తుంది. అలాంటి సందర్భంలో రాఘవయ్య **"బిందె తీసుకుని నేను వెళ్లి నీళ్లు తీసుకొస్తా"** అని ముందుకు రావడం గమనార్హం. ఇదే సమయంలో బాత్రూంలో రాధిక తండ్రి గంటసేపు ఇబ్బంది పడటం పరిస్థితి తీవ్రతను చూపిస్తుంది. కొడుకు, కోడలు రాఘవయ్యను ఆపుతూ, **"మీ ప్రిస్టేజ్‌కి అవమానం అవుతుంది, ఎవరైనా ఎగతాళి చేస్తారు"** అని అన్నప్పటికీ, రాఘవయ్య **"అలా ముడుచుకుని కూర్చుంటే సమస్యలు పరిష్కారం కావు... అమ్మాయ్, బిందె ఇవ్వు"** అని చెప్పడం ద్వారా పరిస్థితి ఎంత దారుణంగా మారిందో, అవసరం ముందు ప్రతిష్టలు అప్రాధాన్యమవుతాయని స్పష్టం చేశారు.

ఈ కుటుంబానికి నీటిఎద్దడి రావడానికి అసలు కారణం బోరుబావి గొట్టంలో ప్లాస్టిక్ కవర్ ఇరుక్కోవడమే. ఇది చిన్న సంఘటనలా కనిపించినా, ప్లాస్టిక్ పర్యావరణానికి కలిగించే మహత్తర హానిని గుర్తు చేస్తుంది. **"ప్లాస్టిక్ చాలా పర్యావరణం ఫ్రెండ్లీ అని పరిశ్రమల వారి అభిప్రాయం. ఎందుకంటే దాన్ని ఎన్ని సార్లయినా రీసైకిల్ చేయగలిగే సౌలభ్యం ఉంది"** (పర్యావరణం – సమాజం; పుటః 6) అంటారు నాగసూరి వేణుగోపాల్ గారు. కాని రీసైకిల్ చేసే లోపలే జరగాల్సిన ఎన్నో నష్టాలు జరిగిపోతాయన డానికి నిదర్శనం ఈ నాటిక. ఎందుకంటే ప్లాస్టిక్ భూమిలో కరగదు; దీర్ఘకాలం అక్కడే మిగిలి భూమిని కలుషితం చేస్తుంది. ఫలితంగా భూగర్భజలాలు దెబ్బతింటాయి, భూసారం తగ్గిపోతుంది. పరోక్షంగా వర్షపాతం తగ్గిపోవడం, కరువులు పెరగడం వంటి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది. చివరికి మానవ మనుగడే కష్టసాధ్య మవుతుంది. ఈ సమస్యను ప్రామాణికంగా ప్రతిబింబించడానికి శారదా ప్రసన్నగారు ఈ నాటికను నంది నాటకోత్సవాలలో పిల్లల నాటికల విభాగం కోసం ప్రత్యేకంగా రచించారు. చిన్న వయసులోనే పిల్లలకు ప్లాస్టిక్ వాడకం వలన ఇబ్బందులను చూపించి, వారిలో పర్యావరణ అవగాహనను కలిగించాలనే జాగృతితో ఈ నాటిక రూపుదిద్దుకుంది.

ముగింపు : "పిపాస", "ప్లాస్టిక్ కవర్" నాటికలు రెండూ సమాజంలో పెరుగుతున్న నీటి ఎద్దడి, పర్యావరణ సమస్యలను ప్రతిబింబించే విలువైన సృజనాత్మక రచనలు. "పిపాస" నాటిక – నీటి కొరత ఒక కుటుంబంలో మానవ సంబంధాలను ఎలా కదిలిస్తాయో, అవసరాలు మనుషులను ఎలా మార్చేస్తాయో కళ్ళకు కట్టినట్లుగా చూపితే, "ప్లాస్టిక్ కవర్" – ప్లాస్టిక్ వాడకం వల్ల భూగర్భజలాలు కలుషితం కావడం, వర్షపాతం తగ్గిపోవడం, కరువులు పెరగడం వంటి దీర్ఘకాలిక సమస్యలను ఆవిష్కరించింది. నీరు కేవలం భౌతిక వనరు మాత్రమేకాక, కుటుంబ బంధాలను, మానవీయ విలువలను నిలబెట్టే జీవనాధారమని ఈ నాటికలు తెలియజేస్తాయి. నీరు లేకుండా మానవజీవితం కొనసాగించలేం. నీరు ఉన్నప్పటికీ దాన్ని పొదుపుగా వినియోగించకపోతే కరువు తప్పదు. పర్యావరణాన్ని రక్షించకుండా, ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించకుండా మనుగడ సురక్షితం కాదనే సత్యాన్ని వెల్లడిచేసిన నాటికలు. అందువల్ల మాడభూషి దివాకర్ బాబుగారు, శారదా ప్రసన్నగారు ఈ నాటికల ద్వారా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మానవ సంబంధాల ప్రాధాన్యం అనేవి సమాజానికి ఎంత అత్యవసరమైన అంశాలో స్పష్టం చేశారు. వీటిపట్ల అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో ఘోరమైన ఫలితాల్ని చవి చూడవలసి ఉంటుందనే హెచ్చరికను పరిశోధనాత్మకంగా అందించారు.

'కదంబం'

(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)

మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం

ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

గూడ అంజయ్య రాసిన బీరుపూరి కథ – సామాజిక విశ్లేషణ

పి. మృదుల, తెలుగు అధ్యాపకురాలు, సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, ఇబ్రహీం పట్నం, రంగారెడ్డి జిల్లా.
ఫోన్ : 630 390 9565

"గూడ అంజయ్య" రాసిన ఈ కథ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యం నుంచి పుట్టింది. ఈ కథా ఛాయలు కూడా కాంచనపల్లి చిన్న వెంకట రామారావు రాసిన కథా సంపుటి అయిన **"మా ఊళ్లో కూడానా"** అనే కథాసంపుటికి చాలా దగ్గరగా ఉంది. ఇక బీరూపూరి కథను పరిశీలించినట్టయితే ఇందులో కథానాయకుడు **"బీరుపూరి"** ఈ రవ్వ వండిపెట్టిన జొన్న గట్క ఎత్తుకపోవడంతో కథ ప్రారంభమవుతుంది. అప్పటికే వరుసగా మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఆ గ్రామంలోని ప్రజలంతా ఎవ్వరు కూడా పొలం పనులకు వెళ్లట్లేదు. పొలాల నుంచి మొక్కజొన్న కంకులను తెచ్చుకొని తింటున్నారు. బీర్పురి గాడు ఈ రవ్వ వండిన జొన్నగట్క కుండను ఎత్తుకుపోయాడు. దొంగ, దొంగ.... అంటూ అరుసుకుంటూ వెళ్ళింది ఆమె. వాస్తవానికి బీర్పురిగాడు దొంగ కాదు. ఒంటరివాడు. ఏకాకి జీవితం గడిపేవాడు. జొన్నగట్కా ఎత్తుకుపోతున్న బీర్పూర్‌గాడిని దుబ్బయ్య పట్టుకొని కొట్టిండు. ఆ గ్రామంలో అందరూ కూడా వ్యవసాయం చేసుకొని దొర దగ్గర వెట్టి చేస్తూ బ్రతుకీడుస్తున్న మాల మాదిగలే అధికశాతంగా ఉన్నారు. అవునులే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కాలంలో వెట్టి చేసేది మాల మాదిగలే కదా! బీర్పురి గాడిది గంగ అవతల గ్రామం అంటే గంగానది అవతల గ్రామం అని కాదు ఇక్కడ అర్థం తెలంగాణలో గోదావరి నదిని గంగా నదితో పోలుస్తుంటారు. ఈ బీర్పురి గాడిది గోదావరి నది అవతల బీర్పూర్ పక్కన ఉన్న గ్రామం. బీర్పూర్ గాడు ఆరు సంవత్సరాల వయసులో చదువుకు వెళ్లాడు. కానీ ఆనాటి వెట్టి వల్ల చదువు సాగలేకపోయింది. ఈ వెట్టిని ఆనాటి సాంఘిక దురాచారంగా చెప్పుకోవచ్చు.

ఇప్పుడు బీర్పురిగాడి జీవితంలోకి తొంగి చూద్దాం. బీర్పూరి గాడి తండ్రి పేరు ఎల్లయ్య. ఈ ఎల్లయ్య తండ్రి పేరు మల్లయ్య. ఇతను ఎల్లయ్య పెళ్లి కోసం ఆ ఊరు జమీందార్ ఆయన గోపాల్‌రావు దగ్గర 600 రూపాయలు అప్పు చేశాడు. ఆయన బతికినంత కాలం గోపాలరావు దొర దగ్గర వెట్టి చేసి చనిపోయాడు. దొర మాత్రం వడ్డీ మీద వడ్డీ లేస్తూ దాన్ని రెట్టింపు చేయసాగాడు. దాన్నే పడుగు అని నాగు అని కూడా అంటారు. తెలంగాణలోని చాలావరకు మాల, మాదిగల ప్రజానికం ఈ పడుగు, నాగు వడ్డీలకు బలైపోయినటువంటి వారే అయితే రచయిత ఈ కథను కళ్ళకు కట్టినట్టు చూపించడంలో సిద్ధహస్తుడయ్యాడు. ఒకరోజు మల్లయ్యకు జ్వరం వచ్చింది. దొర గడికి వెళ్లలేకపోయాడు. దొర మనుషులు వచ్చి మల్లయ్యను తీసుకెళ్లారు. అప్పటికే మల్లయ్య మూడు రోజులుగా తిండి తినలేదు. పైగా చాలా నీరసంగా ఉన్నాడు. ఏరా మల్లయ్య నీకు బలుపు వచ్చింది రా ! పనికి మూడు రోజుల నుంచి రావడం లేదు రా! వ్యవసాయం పనులు ఎవరు చేయాలిరా కార్తె పోతే కార్తె వస్తాది రా! ముండా కొడకా! అంటూ తిట్టాడు. మల్లయ్య నీ కాల్మొక్త బాంచన్ దొర అంటూ దొర కాళ్లపై పడ్డాడు. దొర కనికరించలేదు. మీ మాల మాదిగలకు ఏమైందిరా నోరు లెగుస్తున్నాయి ముండాకొడుకుల్లారా! అంటూ తిట్టసాగాడు. దొర కరుణించక పోగా మల్లయ్య వీపు పైన పెద్ద రాతిబండను ఉంచాడు. ఈ విషయం మల్లయ్య భార్య అయిన రామపోసు కు తెలిసింది. ఆమె వచ్చి దొర కాళ్ళా వేళ్ళాబడింది అయినా దొర కనికరించలేదు. వీపుపై ఉన్న బండను మోయలేక మల్లయ్య కింద పడిపోయి ప్రాణాలు వదిలాడు. దొరకు అత్యంత అనుంగు అనుచరుడైన రామలింగు ఈ విషయాన్ని దొరకు చేరవేశాడు. మల్లయ్య గాడి ప్రాణం పోయిందిరా! పోనీలే బోడి ప్రాణం పోయింది. ఆ శవాన్ని తీసి పారేయండి అంటూ హుంకరించాడు కనికరం లేకుండా. మల్లయ్య భార్య రామ పోసు గుండెలు బాదుకుంటూ భర్త శవాన్ని గూడేనికి తీసుకువెళ్ళింది. అంత్యక్రియలు జరిపించారు. మూడు రోజులు కూడా కాలేదు అంతలో జాగీర్దార్ అయినా గోపాలరావు దొర రామలింగును పిలిపించుకొని అరే మల్లయ్య చచ్చి మూడు రోజులు అయింది రా. వాని భార్యవి పుస్తెలు తెగినాయి. దాని అమ్మ మొగుడు తీరుస్తాడా దాని మొగుడు చేసిన బాకీ అంటూ ఎగర సాగాడు. రామలింగు కలగజేసుకొని దొర మల్లయ్యకు ఇల్లు వాకిలి తప్ప ఏమీ లేదు. వాళ్ల బాకీ తీరిపోయింది అనుకుంటా ఎక్కడ తీరింది రా లుచ్చాకొడకా! ఇంకా 300 రూపాయలు మిగిలే ఉన్నాయి. దాన్ని కచేరీకి తీసుకురా! రా అంటూ పురమాయించాడు దొర. రామలింగు గూడెంలోకి అడుగుపెట్టగానే మాల మాదిగ జాతీయులంత దండాలు దొర, దండాలు దొర పెద్దవారు మీరు ఏదో పనిమీద వచ్చి ఉంటారు. మీరు ఊరికే రారు అంటూ వచ్చిన పని గురించి అడిగారు. మల్లయ్య గాడి పెళ్ళాం రామపోసును దొర కచేరికి రమ్మన్నాడు అందుకోసం వచ్చానని చావు కబురు చల్లగా తెలియజేశారు. ఆమె భర్త చనిపోయి మూడు రోజులు కూడా కాలేదు. అలా ఎలా కచేరికి వస్తుందండి మా ఆచారం ప్రకారం అని నిలదీశారు రామలింగును. దొర పురమాయించాడు నేను వచ్చాను. పదండి వెళ్దాం రామపోసు ఇంటికి అని బయలుదేరారు అందరు కలిసి. రామపోసు రామపోసు అని పిలిచారు, లోపలి నుండి ఏడుపులు వినిపించాయి. ఆమె ఎంతటికీ పలకకపోగా బీర్పురి గాడు బయటికి వచ్చి వెళ్లి విషయం తన

తల్లికి చెప్పాడు. ఆమె బయటకు వచ్చి రామలింగును అడిగింది. విషయం అంత చెప్పాడు. రామలింగు ముగ్గురు కలిసి దొర కచేరికి వెళ్లారు. ఆమె ముఖం చూస్తే శవంలాగా కనిపిస్తుంది. దొర కలుగ చేసుకుని పోయినోడు పోయినాడు అది శివలీలనే బజారు ముండ. ఏడవడం ఆపి నీ భర్త చేసిన అప్పు 300 అలాగే ఉంది. దాన్ని కట్టు అని నిలదీశాడు. దొర నా దగ్గర ఏం లేదు పాడు పడిపోయిన గుడిసె తప్ప. నీ దగ్గర ఏం లేకపోవడం ఏందే నీ కొడుకు ఉన్నాడుగా వాడిని రేపటినుంచి పనిలోకి పంపు, బర్లకాడ పెండకలు ఎత్తుతాడు, బర్లు కాస్తాడు అని హుంకరించాడు. వాడు చిన్నపిల్లగాడు దొర చదువుకుంటున్నాడు. వాడి ఎముకలు కూడా బలంగా లేవు. వాళ్ల నాన్న అప్పును నేను తీరుస్తాను. నీ ఇల్లు గడప వాకిలి ఊడ్చి నేను సేవ చేస్తాను అని బదులు ఇచ్చింది. నీవు ఎవరికి కావాలి. మగవాడు అయితే పుట్లు పుట్లు ధాన్యం పండించి ఇస్తాడు. ఆడంగి ముండ నీకు నా కచేరిలో పని లేదు. మర్యాదగా చెప్తున్నాను రేపటి నుంచి వాడిని పనిలోకి పంపు అని గద్దించాడు.

చేసేదేమి లేక రామపోసు, బీర్పురి గాడు ఇంటి ముఖం పట్టారు. తెల్లవారంగానే ఆ గూడెంలో గుసగుసలు వినిపించసాగాయి. రామపోసు, బీర్పురి గాడు గంగను దాటి అవతలికి వెళ్లారు. ఈ మాట ఆ నోట, ఈ నోట దొరగాడి చెవిలో పడింది. దొరగాడు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. రామపోసు బీర్పురి గాడిని వెతకడానికి మనుషులను పంపాడు. కానీ 20 సంవత్సరాలు కావచ్చింది రామపోసు గాని బీర్పురిగాడు గాని దొరకలేదు. 20 సంవత్సరాల తర్వాత నల్లగా ఆజానుబాహుడిలా ఉన్న ఒక వింత మనిషి ఆ గూడెం లోకి ప్రవేశించాడు. కానీ అతడే బీర్పురిగాడు అని ఆ గూడెం ప్రజలకు తెలియదు పాపం. ఆ గూడెంలోని గోపాలరావు దొరగాడి అరాచకాలు అలాగే కొనసాగుతున్నాయి. ఒకరోజు గోపాల్‌రావు దొరగాడి ఇంట్లో రెండు తులాల బంగారు గొలుసు పోయింది. వాడి భార్య ఐన కనకమ్మ ఆ దొంగతనాన్ని పనివాళ్ళ మీద వేసింది. పనివాళ్లు మిమ్మల్ని నమ్ముకుని బతుకుతున్నాం మీ బాంచన్ మీ కాల్ మొక్కుతాం ఈ దొంగతనంలో మాకేమి సంబంధం లేదు అని చెప్పారు. కానీ ఆ గొలుసు మాత్రం కనకమ్మ దగ్గరే ఉండిపోయింది ఆ విషయం గోపాలరావుకి తెలుసు. ఎలాగైనా దొంగతనాన్ని సైడ్ ట్రాక్ చేయాలనే ఉద్దేశంతో హవల్దారును పిలిపించాడు. రామలింగు వెళ్లి హవల్దారును తీసుకొచ్చాడు.

గూడెంలోకి ప్రవేశించిన బీర్పురిగాడు నల్లగా బీముడి వలె ఆజానుబాహుడు వలె ఉండేవాడు. అతి తక్కువ కాలంలో అందరి మనసులను చూరగొన్నాడు. వాడికి పిల్లలు అంటే చాలా ఇష్టం. పసిపిల్లలు తనని పట్టి గిచ్చేవారు, కొట్టేవారు అయినా ఏమీ అనేవాడు కాదు. నోరు ఎత్తి ఏనాడు కూడా మాట్లాడేవాడు కాదు. ఆకలైతే ఇంటిముందు వచ్చి నిలబడే వాడు. అది గమనించే ఆ ఊరి జనాలు

వాడికి అన్నం పెట్టేవారు. పెట్టనట్లయితే అన్నం గిన్నెలను ఎత్తుకుపోయి తినేవాడు. ఇప్పుడు దొర కన్ను ఆ ఊరికి కొత్తగా వచ్చిన పిచ్చివాడైన బీర్పురిగాడి పైన పడింది. రామలింగు హవల్దారును పిలిపించగా దొర గోపాలరావు తన అనుమానాన్ని బీర్పుగాడి పైన నెట్టివేశాడు. హవల్దార్ వెళ్లి బీర్పురిగాడిని చిత్రహింసలకు గురి చేసి దొర కచేరికి పట్టుకు వచ్చాడు. దొంగతనం చేసావా అంటే నోరు మెదపడు, చింత బరికలతోని రక్తం వచ్చేటట్టు చితకబాదారు. ఐనా లబోదిబోమంటున్నాడు తప్ప ఒక్క మాట కూడా మాట్లాడాడు. రక్తం వచ్చినా గాయాల పైన కారం చల్లాడు హవల్దార్. ఆ నొప్పిని భరించలేక ఊరి బయట ఉన్న తాటిమాను తొర్రలో గొలుసు పెట్టానని చెప్పాడు. దొర హుకుం జారీ చేశాడు. గుండు గీయించి గాడిదపై ఊరేగిస్తూ తాటిమాను దగ్గరకు తీసుకువెళ్లారు. నిచ్చెన తెప్పించి బీర్పురి గాడిని ఎక్కించారు. నిచ్చెన పైకి లాక్కున్నాడు. బీర్పురిగాడు చెట్టు ఎక్కి ఎంతకు దిగలేదు.

చెట్టు ఎక్కిన బీర్పూరి గాడు దొరను తిట్టడం ప్రారంభించాడు. దొర చేసిన దురాగతాలను, దౌర్జన్యాలను, హింసను తిడుతూ ఉంటే ఆ మాటలు విన్న జనాల హృదయం రగిలిపోయింది. ఇంతలో దొర భార్య కనకమ్మ అక్కడికి వచ్చింది. కనకమ్మ మెడలో పోయిన రెండు తులాల గొలుసును లచ్చమ్మ చూసింది. ఆ గొలుసు దొరసాని మెడలో ఉందని చెప్పింది. జనాలలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. దొర భార్యను దొర అనుచరులను గూడెం జనాలు చావ కొట్టారు. ఇంతటితో ఆ గూడేనికి గోపాల్‌రావు దొర పీడ విరగడయింది. ఆ ఊరి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించిన బీర్పురి గాడు అంటే ఆ గూడెం ప్రజలకు వల్ల మాలిన అభిమానం కలిగింది. అంతటితో దొరతనం ఆ గూడెంలో మంట కలిసి పోయింది.

కథలోని పాత్రలు : ఈరవ్వ, లసుమవ్వ, దుబ్బయ్య, మల్లిగాడు, గోపాలరావు దొర, రామపోసు, రాజుగాడు, గుడ్డి పోసిగాడు, సుంకరోడు, ఇస్తారిగాడు, నారాయణ పటేల్, కొంగలోడు, రామలింగు, ఎల్లయ్య, మల్లయ్య, మొదలైన పాత్రలు.

కథా విశ్లేషణ : ఈ కథలో ప్రధాన అంశం **"వెట్టి".** వెట్టిని ఆధారంగా చేసుకొని ఈ కథను రూపొందించారు గూడా అంజయ్య. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట నేపథ్యంలో వెట్టి వ్యథలు మనకు బాగా తెలుసు.

కానీ భారతదేశానికి స్వతంత్రం సిద్ధించాక 1980 వరకు కూడా తెలంగాణ పల్లెల్లో వెట్టి విస్తృతంగా ఉండేది. నందమూరి తారక రామారావు గారు కరణాలను, పటేళ్లను, పట్వారీ లను రద్దు చేశాక వెట్టి దాదాపు అంతరించిపోయిందని చెప్పాలి. ఇక కథా విశ్లేషణకి వస్తే పటేల్, పట్వారి, రైత్వారి, జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలకు పెట్టింది పేరు తెలంగాణ ప్రాంతం. ఆ గూడెం యొక్క జాగీర్ గోపాల రావు డబ్బులు ఇచ్చి ఆ డబ్బుల పైన వడ్డీని భారీగా విధిస్తూ తరతరాలు వెట్టిలో బానిసగా పనిచేయడం తెలంగాణ ప్రాంతంలో ఒకప్పుడు సర్వసాధారణం. ఇక్కడ ఆ గూడెం దొర కూడా అదే తంతును కొనసాగించాడు. ఎప్పుడైతే కమ్యూనిస్టు విప్లవ సిద్ధాంతాలు, విప్లవ భావజాలం పెల్లుబికిందో అప్పటినుండి సామాన్య జనాల్లో చైతన్యం వెల్లు విరిసింది. తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ లాంటి ఉత్తర తెలంగాణా ప్రాంతాలు ఈ వెట్టి వ్యవస్థకు లోనయ్యాయి. అత్యంత దుర్మార్గమైన విషయం ఏమిటంటే వీరికి మానవత్వమే ఉండేది కాదు. అమానుషంగా జ్వరం వచ్చిన వ్యక్తి పైన బండలు మోయించి పైశాచికానందాన్ని పొందారు. ఆర్థికంగా హీనస్థితిలో ఉన్నటువంటి మాల, మాదిగలు ఎక్కువగా వెట్టి అనే ఈ సాంఘిక దురాచారానికి గురయ్యారు. నారాయణరావు పటేల్ చెప్పినా కూడా గోపాలరావు అనే పటేల్ వినలేదు. అంటే అక్కడక్కడ ఈ దొరలలో కూడా మానవతా ఛాయలు కనిపిస్తున్నాయి. కానీ అతి తక్కువ. ఈ కథలో బీర్పురిగాడు ఘట్క, సంకటి ఎత్తు కెల్లడం ఆనాటి ఆకలి కేకలకు సాంకేతంగా కనిపిస్తుంది. ఈరవ్వ మంచితనం, లసుమవ్వ మానవత్వం, మల్లిగాడు లాంటి మనసున్న పాత్రలు కథను చదివే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సుంకరోడు, ఇస్తారోడు వంటి అమాయక పాత్రలను సృష్టించడంలో గూడ అంజయ్య తనకు తానే సాటిగా నిలిచాడు. ఈ కథలో కొంగరోని పాత్ర ప్రత్యేకంగా మలిచిన తీరు వైవిధ్య భరితంగా ఉంది. చివరికి కొడుకు చదువు ఆగమవుతుందనే ఉద్దేశంతో కథానాయకురాలు ఐన రామపోసు కొడుకును తీసుకొని గంగను దాటి వెళ్ళిపోతుంది. 20 సంవత్సరాల తర్వాత బీర్పురిగాడు అదే గూడేనికి రావడం కొసమెరుపు. అయితే ఈ కథలో రామపోసు ఏమైంది అన్న విషయం రచయిత తెలియజేయలేదు. బహుశా 20 సంవత్సరాల తర్వాత ఆమె చనిపోయి ఉండవచ్చు అని ప్రేక్షకులు అర్థం చేసుకోవాలి. ఇకనుంచి కథ అంతా కూడా పిచ్చివాడైన బీర్పురి గాడి మీదనే నడుస్తుంది. దొర ఇంట్లో రెండు తులాల బంగారు నగలు దోపిడీకి గురయ్యాయని కనకమ్మ కట్టు కథ అల్లి దొరను రెచ్చగొడుతుంది. ఈ దొంగతనంతో తమకేమి సంబంధంలేని ఈరవ్వ, లసుమవ్వ, దుబ్బమ్మ, పాత్రలను మలిచిన విధానం అమోఘం. ముఖ్యంగా లచ్చుమ్మ పాత్ర ద్వారా దొరల దురాగతాలను ఎండగట్టించి చెప్పించడంలో గూడ అంజయ్య తనకు తానే సాటిగా నిలిచాడు. లచ్చుమ్మ మాటలను తాళలేకే ఈ దొంగతనం నేపథ్యాన్ని అమాయకుడైన బీర్పురి గాడి వైపు మళ్ళించాడు కుట్రపూరితంగా గోపాల్ రావు.

బీర్పురిగాడిని హవల్దార్ వచ్చి గోడ్డును చితకబాదినట్టు చితక బాదుతుంటే, గూడెం జనాలు కన్నీటి పర్యంతమయ్యారు. ఏమి చెయ్యలేని తమ అసహాయ తను అసహ్యించుకున్నారు. తాటి చెట్టు పైన రెండు తులాల బంగారు గొలుసు దాచాను అని ఆ దెబ్బలకు తాళలేక అబద్ధం చెప్పినప్పుడు ఎవరూ నమ్మలేదు. బీర్పురిగాడి పైన అందరికీ నమ్మకం ఉంది వాడు దొంగ కాదని. ఆ దెబ్బలకు తాళలేక దొంగతనం తన పైన వేసుకున్నాడని. ఈ దొంగతనం తెలుసుకోగానే దొర గుండు కొట్టించి గాడిద పైన ఊరేగిస్తూ తాటి చెట్టు దగ్గరకు వెళ్ళగా తాటి చెట్టు ఎక్కిన బీర్పూరి గాడు దొరను తూలనాడడం చూసి అక్కడి గూడెం ప్రజలకు చైతన్యం వచ్చింది. అంతలో దొర భార్య కనకమ్మ మెడలో పోయిన రెండు తులాల బంగారు గొలుసు కనిపించింది. అదే విషయాన్ని లచ్చవ్వ చెప్పడంతో ప్రజలు పట్టరాని ఆగ్రహంతో దొర మీద, దొర పరివారం మీద తిరగబడ్డరు. ఇంతటితో ఆ గూడానికి పట్టిన దొర పీడ విరగడయింది.

కథా వస్తువు : "వెట్టి" ప్రధానంగా కథా వస్తువుగా కనిపిస్తుంది. స్వతంత్రం సిద్ధించాక ఈ దురాచారం ఏ రూపంలో ఉండకూడదు అని రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది కూడా. 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో అక్కడక్కడా ఈ వెట్టి దురాచారం ఇంకా ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ఈ దురాచారం ఏ రూపంలో ఉన్నా దాన్ని అంతమొందించాలి.

కథా నిర్మాణం - శైలి : కథ ఆద్యంతం తెలంగాణ యాస, మాండలికాలతో, పలుకుబళ్ళతో, సామెతలతో, ఆమెతలతో విందు భోజనంగా కథ సాగుతుంది. ఆనాటి దురాచారాలు, దుర్మార్గాలు, దోపిడీ వర్గాలు, భూస్వామ్య వ్యవస్థలు, అగ్రవర్ణాలు సాగించిన అమానవీయమైన, హేయమైన దుశ్చర్యను ఆనాటి ఆకలి పరిస్థితులను, సామాజిక నేపథ్యాన్ని ఈ కథ ప్రతిబింబిస్తుంది. నాకు తెలిసి ఈ కథా సంపుటి ద్వారానే గూడ అంజయ్య భారతదేశ కథకులలో పేరెన్నిక గన్నవాడిగా ఎదిగాడు అనిపిస్తుంది. ఈ కథను నిర్మించిన విధానం, కథ, కథా పద్ధతి ఒకదానికొకటి సంబంధం ఉన్న విధం వర్ణనాతీతం. రామపోసు కొడుకుని తీసుకొని వెళ్ళిపోయాక 20 సంవత్సరాల తర్వాత అదే కొడుకు అదే గూడేనికి బీరుపూరి పేరుతో రావడం విచిత్రం. అయినా ఆ గూడెంలోని ప్రజలు ఎవ్వరు కూడా చిన్ననాటి ఆరు సంవత్సరాల బీర్పురి గాడిని గుర్తించకపోవడం కొసమెరుపు. కథను ఆద్యంతం రక్తి కట్టించి నడిపించాడు. 20 సంవత్సరాల తర్వాత తల్లి ఏమైందో కథకుడు చెప్పలేదు. పాఠకులు ఊహించుకోవాలి తల్లి చనిపోయి ఉంటది అని. అదేవిధంగా కథలోని మాల మాదిగల వ్యథలను వర్ణించిన విధానం వర్ణనాతీతం. కథలోని ఇతర పాత్రల యొక్క మానవీయ కోణం అత్యద్భుతం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 11 (57) హైదరాబాద్ సెప్టెంబర్ : 2025

ఆచార్య గోనానాయక్ మూడు దశాబ్దాల కృషి – 'భారతీయ గిరిజన వీరులు'

బుగడూరు మదన మోహన్ రెడ్డి, తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9989894308

చరిత్రలో స్థూలం నుంచి సూక్ష్మంవైపు చూస్తూ పోతేనే ఎవరెవరికి ఏయే స్థానాలు దక్కాయో? ఏయే గౌరవాలు అందాయో? తెలుస్తుంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చి డెబ్బై ఏడేళ్ళు గడిచాయి. స్వాతంత్య్రం కోసం పోరాడిన వారి లెక్క, వారిలో రాష్ట్రాల వారి లెక్క, ఆఖరికి కులాల వారి లెక్కలు అంచనాతో కూడుకొన్న ఓ లెక్క అంటూ ఉంది. ఒక లెక్కంటూ లేకుండా ఉన్నది గిరిజనులదే. తమవంతుగా స్వాతంత్య్ర పోరాటంలో జీవితాలను త్యాగం చేసిన ఈ గిరిజన వీరులను ఒక చోటుకు చేర్చే ప్రయత్నం ఆచార్య ఎం. గోనానాయక్ గారు నెత్తికెత్తుకొన్నారు. అందులో భాగంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన గిరిజన వీరుల జీవిత విశేషాలతో కూడుకొన్న 'భారతీయ గిరిజన వీరులు' అనే పుస్తకాన్ని తీసుకువచ్చారు.



స్వాతంత్య్ర సమరానికి పునాదులైన గిరిజన తిరుగుబాట్లు

దేశ చరిత్రలో తొలి(సిపాయిల తిరుగుబాటు) – మలిదశ స్వాతంత్య్ర పోరాటాలకు ముందు, మధ్యన జరిగిన తిరుగుబాట్లు చాలా కీలకమైనవి. ఆ తిరుగుబాట్లే స్వరాజ్యకాంక్ష వ్యాప్తికి కారణమయ్యాయి. అడవి ప్రాంతంలో ఉన్న గిరిజన సమూహం వారిపై ఆంక్షలు విధించిన బ్రిటీష్ వారిపై ఎదురు తిరగడం మొదలుపెట్టారు. వారిలో వీరులు వీర బుద్ భగత్ (జార్ఖండ్) కోల్ తిరుగుబాటు (1829–39), సిద్ధు–కన్హు ముర్ము (జార్ఖండ్) హోల్ తిరుగుబాటు (1855), మహువ కోల్ (మధ్యప్రదేశ్) బుందేల విప్లవం (1842), గుండాధుర్ భూమ్కాల్ తిరుగుబాటు (1910), రాణి రోపుయిలియాని (మిజోరం) మిజో తిరుగుబాటు... ఆయా గిరిజన సమూహాలలో పోరాట స్ఫూర్తిని నింపాయి. వాళ్ళే ఇది 'మా నేల' అన్నారు. 'మా నీళ్ళు' అన్నారు. 'మాదేశం' అన్నారు. అలా మొదలైన ఆ నిరసనలు వ్యతిరేక చర్యలకు దారి తీశాయి. ఆ చర్యలు ఆయుధంతో తిరుగుబాట్లకు ప్రాణం పోశాయి. ఆ క్రమంలో జరిగిన ప్రాణ త్యాగాలు జాతి సమైఖ్యత పరిచి పరాయిపాలనను ఎదిరించి దేశానికి స్వేచ్ఛా వాయువులను ఊదాయి.

విల్లు పట్టిన వీరవనితలు

ఆధిపత్యం అన్ని వ్యవస్థల్లోకి ప్రవేశించినప్పుడు అన్ని వర్గాల ప్రజలపైన దాని ప్రభావం పడుతుంది. స్త్రీల భుజలపై నడిచే కుటుంబ వ్యవస్థ కలిగిన భారతదేశంలాంటి దేశంలో అయితే మహిళపై మరింత అణిచివేత కనబడుతుంది. అయినాగానీ మగవాళ్ళతో సమానంగా పోరాడిన వీరవనితలు కూడా ఈ గిరిజన సమూహంలో ఉన్నారు. గొడ్డలి ధరించి గుర్రాలపై తిరుగుతూ 'హోల్ తిరుగుబాటు'లో భాగం అవుతూ ఒక స్త్రీ సైన్యాన్ని ఏర్పాటు చేసి నాయకత్వం వహించిన పూలో–ఝూనో ముర్ములు (జార్ఖండ్), లోయ ప్రాంతాల్లోని పంట పండే పొలాలపై అధికారం చలాయించడాన్ని ప్రశ్నించిన 16 ఏళ్ళ వయసు రాణి మా గైడిన్ల్యూ (మణిపూర్), స్థానికంగా స్వేచ్ఛకు జరుగుతున్న సాయుధ పోరాటంలో భాగమైన రాణి దుర్గావతి (మధ్యప్రదేశ్), సింగదాయి (బీహార్) వీరాంగన లీపా (అండమాన్ నికోబార్), రాణి రోపుయిలియాని (మిజోరం) వంటి గిరిజన వనితల పోరాటాలు ఝాన్సీ లక్ష్మీబాయి సాహసాలకు తీసిపోనిది.

వెలకట్టలేని ప్రాణ త్యాగాలు

ఒక్కో వీరుడిది ఒక్కో స్ఫూర్తి గాథ. బాల్యంలో కోతి కొమ్మచ్చి ఆడిన చెట్టుకే ఉరితీయబడ్డ తిల్కా మాంఝీ (బీహార్), జాతికోసం జంటగా ప్రాణం వీడిన జంట మామిడి పళ్ళలాంటి అన్నదమ్ములు సిద్ధు–కన్హు ముర్ములు (జార్కండ్), 17 ఏళ్ళకే కాలాపానీ లాంటి శిక్ష అనుభవించిన భీమానాయక్ (మధ్యప్రదేశ్), ఎదురు తిరిగినందుకు బహిరంగంగానే కాల్చబడ్డ యూ కియాంగ్ నోంగ్బా (మేఘాలయ), చిక్కకుండా పోరాడినందుకు కాలు చచ్చుబడేలా చిత్రహింసలకు గురై మరణించిన మాద్రి కాలో (ఒడిశా), బహిరంగంగా రచ్చబండ చెట్టుకు ఉరి తీయబడ్డ రాంజీ గోండు (తెలంగాణ) ఇలా పరాయిపాలనపై నిరసనగా సాయుధం పోరాటం చేసినందుకు వారికి దక్కిన 'త్యాగఫలం' అమరశయ్య. కట్టడాలు కట్టితేనే చరిత్రలో సజీవంగా ఉండిపోతున్న అవకాశం ఉన్న తరుణంలో ఇంతటి ఘోరంగా జీవితాలను ధారపోసిన వాళ్ళకు కూడా ఓ పదిలమైన చోటు ఉండాలి కదా?

తెలుగు నేల నుంచి...

తెలుగు నేల పోరాటాల పురిటిగడ్డ. అన్ని ఉద్యమాలలోను, అన్ని పోరాటాలలోను తనదైన సహకారం ఈ దేశానికి ఎప్పుడూ ఇస్తూనే

ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా నిలిచే 'జల్, జమీన్, జంగిల్' నినాదాన్ని దేశపు నినాదంగా నిలిపిన కొమరం భీమ్ (తెలంగాణ), పీడించే కల్నల్ రాబర్ట్‌ను నిర్మల్ నగరంలో తల నరికిన రాంజీ గోండ్ (తెలంగాణ), పండించిన పంటనే మీది కాదంటున్న కాలంలో 'దున్నే వాడిదే భూమి' అనే నినాదాన్ని పల్లెల్లో పంచి పెట్టిన జాటోతు ఠాను నాయక్ (తెలంగాణ), 'రంప పితూరి'తో అలజడి సృష్టించిన అల్లూరికి అండగా నిలిచిన మర్రి కామయ్య (ఆంధ్రప్రదేశ్), అల్లూరి కంటే ముందే మన్యం కొండల్లో పోరాట సెగ రాజేసిన ద్వారా బంధనాల చంద్రయ్య దొర (ఆంధ్రప్రదేశ్), చింతలపల్లిలో ప్రజలతో ఉద్యమాన్ని నడిపించిన మల్లుదొర (ఆంధ్రప్రదేశ్) ఇలా తెలుగు నేల నుంచి ఈ పుస్తకంలో ఆరుగురు గిరిజన వీరులను పొందుపరచడం జరిగింది. ఇక్కడ జాతీయ గిరిజన కమీషన్ లెక్కలలోకి చేరని కొందురు గిరిజన వీరులు ఉండడం విశేషం.

గోనానాయక్ రచించిన ఈ పుస్తకంలో మొత్తంగా 56 మంది గిరిజన వీరుల సంక్షిప్త జీవిత పరిచయాలున్నాయి. ఈ పుస్తకం తేవడానికి పడ్డ కష్టం గురించి చెబుతూ **"తీగ లాగితే డొంకంతా కదులుతుంది. పరిశోధనలో కూడా అంతే. మూడు దశాబ్దాల క్రితం దేశం నలుమూలల గిరిజన సాహిత్యం కోసం తిరుగుతున్న క్రమంలో ఈ వీరుల ప్రస్తావన టూకీగా నా పరిశీలనలోకి వస్తూ ఉండేది. మొదట్లో ఒకటి, రెండు అలవోకగా దొరికితే మిగిలిన వీరుల కోసం ప్రత్యేకంగా మ్యూజియాలకి, ప్రసిద్ధ గ్రంథాలయాలకు, ఇండియన్ హిస్టరీ ఆర్కైవ్స్‌కు వెళ్ళి వెలికి తీయాల్సి వచ్చింది. అది నిన్న మొన్నటి వరకు జరుగుతూనే ఉంది. మొత్తంగా ఈ పుస్తకంలో 56 మంది గిరిజన వీరుల జీవిత పరిచయాలున్నాయి. ఒకరు మొఘలులతో పోరాడారు. మరొకరు బ్రిటీష్ వారితో పోరాడారు. ఇంకొకరు నిజాంతో పోరాడారు. వీరి ప్రత్యర్థులు వేరువేరుగా ఉండొచ్చు కానీ వీరు పోరాడిన తీరు మాత్రం 'ఇది మానేల...' అనే ఏకాత్మతోనే"** అన్న రచయిత మాటల్లో చారిత్రక కోణం లేకపోలేదు. తొలినాళ్ళలో గిరిజన సాహిత్యం పొందుపరుచుకోవడంపై చిన్నచూపు ఏర్పడినట్లే గిరిజనుల చరిత్ర పోరాటాలపై పడి ఉంటుందనడంలో ఏ విధమైన సందేహం లేదు.

"మొఘల్ కాలం నుంచి నిన్న మొన్నటి వరకు స్వాతంత్ర్య దేశంలో కూడా స్వేచ్ఛ కోసం పోరాడిన గిరిజన వీరులున్నారు. అధికారికంగా బ్రిటీష్ గెజిట్లో 142 మంది ఉన్నారు. NCST వారి గణాంకాల ప్రకారం 50 మంది పోరాటాలకు సంబంధించిన వివరాలు కనబడుతున్నాయి. వాటిని ప్రాతిపదికగా చేసుకుని స్థానికంగా మరికొన్ని సేకరించి మొత్తంగా 56 మంది ఈ నేలకోసం ప్రాణత్యాగం చేసిన గిరిజన వీరుల జీవిత విశేషాలతో కూడుకొన్న ఈ గ్రంథం ఎన్నో చారిత్రక ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. కొత్త ప్రశ్నలను పుట్టిస్తుంది. శ్రీశ్రీ అన్నట్టు

'చరిత్ర అట్టడుగున
పడివున్న కథలన్నీ
కావాలిప్పుడు

దాచేస్తే దాగని సత్యం' మాత్రమే కాకుండా 'ఊరుకోని సమాజం ఆదివాసి సమాజం' కూడా. చరిత్ర ఎప్పుడు పరిపూర్ణం కాదు. పూరణం చెయ్యవలసిన ఖాళీలు మిగిలే ఉంటాయి. ఈ గ్రంథాన్ని ఆకరంగా, ఆధారంగా చేసుకొని భవిష్యత్తులో మరిన్ని గ్రంథాలు రావడానికి తప్పకుండా దారులు వేస్తుందన్న నమ్మకం నాకు కలిగింది" (పుట:05) – దనసరి సీతక్క (తెలంగాణా మంత్రివర్యులు), 'The book is like a signpost. It is for us to follow the signpost and search for the hidden histories and explore the existing histories from different perspectives. I congranulate Prof. Gona Naik for bringing out this book which is helpful for students and researchers wishing an extensive reach to the book (పుట:06) ఆచార్య కె.సునీతారాణిల ముందుమాటలు పుస్తక ఆవశ్యకతకు అద్దం పడుతున్నాయి.

చక్ర బిషోయ్ వీర తిలకం దిద్దడానికి బొటనవేలు కోసుకున్న ప్రాంతం 'టీకబలి'. స్థానికంగా సబర్మతి ఆశ్రమమంత గొప్పగా పర్యాటకంగా ప్రసిద్ధి కావాలి. 'స్వరాజ్యం నా జన్మ హక్కు' – తిలక్, 'నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను' –నేతాజీలు ఇచ్చిన వాటితో సమానంగా 'అబుఆ దిశోం – అబుఆ రాజ్' (మన దేశం – మన పాలన) – బిర్సాముండా, 'జల్–జమీన్–జంగల్' (నీళ్ళు, భూమి, అడవి) – కొమరం భీమ్ నినాదాలుగా కూడా దేశ అస్తిత్వ చరిత్రలో భాగం కావాలి. దీనికి ప్రభుత్వం బాధ్యతగా, గిరిజనేతర సమూహాలు దేశ చరిత్రగా ఆరాధించాలి. అప్పుడే దేశ సమిష్టికి, సమగ్రతకు ఒక పరిపూర్ణత చోటు చేసుకొంటుంది.

చరిత్రకు అందకుండా జారిపోయిన వీరులలో, జానపదాల్లో మౌఖికంగా వినిపించే వీరులలో, స్థానికంగా పుక్కిట పురాణంగా నిలిచిపోతున్న వీరులలో ఎక్కువగా ఉన్నది గిరిజన వీరులే. వీరిని వెలికితీసి భావి తరాలకు అందించే మార్గంలో ఈ పుస్తకం ఒక ఆకారంగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

పుస్తకం : భారతీయ గిరిజన వీరులు

రచయిత : ఆచార్య ఎం. గోనా నాయక్

వెల : 250 రూపాయాలు

దొరుకు స్థలం : రచయిత (98490 93300) అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక   సంపుటి -28 : సంచిక - 11   హైదరాబాద్   సెప్టెంబర్ : 2025

స్ఫూర్తిదాయక జీవనగాథ కావేరి ఛటోపాధ్యాయ "ఆటుపోట్ల కావేరి"

డా. వై. రామకృష్ణారావు, (ఆస్ట్రేలియా) ఫోన్ : 8985743964



ఆచార్య వెలుదండ నిత్యానందరావు అనువదించిన శ్రీమతి కావేరి చటోపాధ్యాయ స్వీయ చరిత్ర "ఆటుపోట్ల కావేరి". ఎవరీ కావేరి? ప్రఖ్యాతిలో రవీంద్రనాథ్ ఠాగూరు, బంకించంద్ర, శరత్ బాబు, సరోజినీనాయుడు వంటి వ్యక్తి కాదు. మరెవరు? సంగీత సాహిత్యాలపై గాఢమైన అభినివేశమున్న ఒక సామాన్య గృహిణి, ఒక అధ్యాపకురాలు, ఒక మిలిటరీ ఆఫీసర్ గారి ఇల్లాలు. మరి ఈమె ఎందుకు తన జీవిత గాథను అక్షరీకరించుకున్నది అనే ప్రశ్నకు సమాధానం Peeping through my window అనే పుస్తకాన్ని ఆసాంతం చదివినప్పుడు అవగతం అవుతుంది.

స్వీయచరిత్ర రాసుకోవడానికి కళాకారులు, సంఘసంస్కర్తలు, ఉద్యమకారులు వగైరా వ్యక్తులు మాత్రమే కానవసరం లేదు. తన వైయక్తిక జీవితం తన తోటివారికి స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించే లక్ష్యంతో విజేతలైన ఎవరైనా తన కథను ఒక ఉదాహరణగా మార్గదర్శిగా రాయవచ్చు. తనదైన సామాన్య జీవనగమనంలో తటస్థపడిన అనూహ్యమైన ప్రతికూలతలను, వైపరీత్యాలను ఎదిరించి, నిలిచి ధైర్యంతో గెలిచిన వైనం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమే ఇదే శ్రీమతి కావేరి చటోపాధ్యాయ జీవనసారం.

జీవితమన్నాక ఆటుపోట్లు ఎవరికైనా తప్పవు. సముద్రానికీ ఆటుపోట్ల ఆగం తప్పదు. మరి అలవాటు పడిన ఆటుపోటులే ఒక్కోసారి భయంకరమైన సునామీగా పరిణమిస్తే అంతటి గొప్ప సముద్రం కూడా అల్లకల్లోలమై విరుచుకు పడుతుంది. ఆగ్రహం చల్లారాక యథావిధిగా గంభీరంగా నవ్వుల నురగలతో అలరిస్తుంది.

మనుషులందరూ ఒకేలా ఉండరు. కొందరు చిన్నపాటి కష్టానికే, చిన్నపాటి ఆశాభంగానికే విలవిల్లాడిపోతారు. కుమిలి పోతారు. కార్యశూన్యులు అవుతారు. **"మృత్ పిండము వలె క్రిందం బడి"** అణగి ఉంటారు. అరుదుగా స్థితప్రజ్ఞులు ఉంటారు. మిన్ను విరిగి మీద పడ్డా అదరక, బెదరక ధైర్యంతో ఎదురొడ్డి నిలబడతారు. జయిస్తారు. **"క్రిందంబడి మీదికిన్నెగయు"** సుజనులు వీరు. వారే బలహీనులకు, భీరువులకు ఆదర్శవంతులు. తన జీవితానికి తానే ప్రేక్షకత్వం వహించే గవాక్ష వీక్షణప్రాయులవుతారు. సుఖదుఃఖాలు, మానావమానాలు, చందన లేపనాలు బురద మరకలు అన్నీ కిటికీ ఆవలి దృశ్యాలవుతాయి వారికి .

శ్రీమతి కావేరి చటోపాధ్యాయ అనుక్షణం అనివార్యంగా ఎదురైన మోయలేని బాధ్యతలను, మరణశాసనం వంటి భయంకరమైన క్యాన్సర్ వ్యాధిని భరించి, ఎదిరించి 2024 వ సంవత్సరం మార్చి నెల 12వ తేదీ నాడు డాక్టర్ నిత్యానందరావు స్వగృహంలో మన మధ్య కూర్చొని ముచ్చటించారు!. ఇదొక అపురూప సన్నివేశం. దీని సంధానకర్త మన నిత్యానందరావే .

ఇటువంటి జీవనపోరాట విజయగాథను తాము చెప్పకపోతే లోకంలోని బాధాతప్తులకు వాటిని నిగ్రహించే స్ఫూర్తి ఎలా వస్తుంది? శ్రీమతి కావేరి లాంటి వారి జీవన పోరాట విజయగాథ **"జీర్ణమంగే సుభాషితం"** కారాదు కదా! పసితనంలోనే చెల్లి, తమ్ముళ్ల ఆలనా పాలన, మంచానబడ్డ తల్లికి 14 ఏళ్ల పాటు మలమూత్రాల నెత్తిపోస్తూ సేవ చేయడం, మానసిక వైకల్యం గల తమ్ముడిని 25 ఏళ్ళపాటు పోషించడం, అన్నీ దాటుకొని జీవితం కాస్త ఒడ్డున పడుతున్నది అనుకున్నంతలో భయంకరమైన రొమ్ము క్యాన్సర్ విషమించడం, కీమోలు, రేడియో థెరపీలు...కావేరి ధైర్యం ముందు క్యాన్సర్ పరాజయం పాలయ్యింది . కావేరి గెలిచింది. జయహో!! అవును ఆమె విజేత .

ఆంగ్లంలో తన స్వీయచరిత్రకు Peeping through my window అని పేరు పెట్టింది. ఇదొక అద్భుతమైన అర్థవంతమైన శీర్షిక. మనం కిటికీలో నుంచి ఏవేవో చూస్తుంటాం. అక్కడ మనం ప్రేక్షకులం మాత్రమే. శ్రీమతి కావేరి కూడా తన జీవితాన్ని ఆత్మాశ్రయంగా (subjective) కాక కిటికీలో నుండి బాహ్యమైనదిగా వస్త్వాశ్రయకోణం (objective)లో దర్శించింది. జీవితంలోని సుఖదుఃఖాల నన్నింటినీ కిటికీలో నుంచి చూసే ప్రేక్షకురాలిగా, ఒక spectator గా

నిలిచింది. అదే కావేరి సాధించిన విజయం. సంక్షిప్తంగా ఇది ఈ పుస్తక సారాంశం. ఈ Peeping through my window అనేది చాలా గాఢమైన తాత్వికమైన శీర్షిక.

ఇది షడ్దర్శనాలలోని కపిలమహర్షి సాంఖ్యసిద్ధాంతానికి సన్నిహితంగా ధ్వనిస్తుంది. సర్వజ్ఞుడని ప్రశంసించబడే కపిలమహర్షి ప్రతిపాదించిన సాంఖ్యయోగదర్శనం స్థూలంగా ఆత్మానాత్మ విచార సంబంధమైంది. భగవద్గీత ద్వితీయ అధ్యాయం పేరు "సాంఖ్య యోగమే". అర్జునుడు తాను, తనవంశం, తనవారు అనే మాయలో చిక్కుకొని చంపినా, చచ్చినా తానే కర్తననీ, భోక్తననీ విషాదయోగంలో మునిగి ఉన్నపుడు భగవానుడు ఆత్మానాత్మ విచారమైన రీతిలో బోధ చేస్తాడు. జీవుడు వేరు. ఆత్మ వేరు. ఆత్మకు ఏవీ అంటవు. అది సాక్షి మాత్రమే. ఉపాధి అయిన శరీరం నశించడంతో జీవుడు నశిస్తాడు. ఆత్మ నశించదు ఇత్యాదిగా. సాంఖ్యదర్శనం ప్రథమ అధ్యాయం 52వ సూత్రం. "నా కర్మణాపి అతద్ధర్మత్వాత్" అని చెబుతుంది. అంటే మంచీ, చెడూ ఏ కర్మ చేసిన ఆత్మను బంధించ లేము. ఎందుకంటే. అవి ఆత్మ యొక్క ధర్మం కాదు అని భావం. జీవుడు, ఇంకా ఆత్మసంబంధంగా ముండకోపనిషత్తులో ఈ క్రింది విధంగా చెప్పబడింది.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం సాద్వత్తి
స అన్యో అనశ్నన్ అన్యో అభిచాక శీతి

అంటే స్నేహితులైన రెండు పక్షులు ఒక చెట్టును ఆశ్రయించి ఉన్నాయి. వాటిలో ఒక పక్షి పండును తింటున్నది. మరొకటి తినకుండా చూస్తున్నది. పండ్లు తినే పక్షి అవి తీయగా ఉంటే సుఖాన్ని, చేదుగా ఉంటే దుఃఖాన్ని పొందుతున్నది. కానీ ఏమీ తినకుండా ప్రేక్షక పాత్ర వహించి కూర్చున్న పక్షి సుఖదుఃఖాలకు అతీతంగా ఉండిపోయింది .

ఇక్కడ శరీరం చెట్టు. తింటున్న పక్షి జీవుడు. తినకుండా చూస్తున్న పక్షి ఆత్మ (పరమాత్మ). ఈ ఉపనిషత్ వాక్యం కూడా సాంఖ్యసిద్ధాంత సన్నిహితమైంది. ఈ దృష్ట్యా శ్రీమతి కావేరి చటోపాధ్యాయ తన జీవిత కథనాన్ని Peeping through my window అనడం అన్వర్థమే కదా!

డాక్టర్ వెలుదండ నిత్యానందరావు "ఆటుపోట్ల కావేరి" అనే పేరుతో ఈ ఆంగ్లగ్రంథాన్ని అనువదించి దాని కింద ఉపశీర్షికగా బాగా ప్రచారంలోనున్న "స్వీయచరిత్ర" అని అనకుండా "ఆత్మకథ" అనడంలో కూడా సాంఖ్యస్పర్శ గోచరిస్తుంది. మూలగ్రంథాన్ని నిలువెల్లా ఆకళింపు చేసుకున్న వాదవడం వలన ఆత్మకథ అనగలిగాడు. "గవాక్ష వీక్షణ" స్ఫూర్తి ఆత్మకథ అనడంలో దర్శన మిస్తుంది. డాక్టర్ నిత్యానందరావుకు ఈ ఆత్మకథ యాదృచ్ఛికంగా లభించింది. చదువుతున్నంత సేపు ఒక తీవ్రమైన భావోద్వేగానికి లోనయ్యాడు. నిత్యానందరావు సహజంగానే సున్నిత హృదయుడు. చల్లగాలి సోకితే జలజలా వర్షించే మబ్బు లాంటివాడు. అందుకే స్ఫూర్తిదాయకమైన అటుపోట్లకావేరి జీవితం కదిలించింది. కావేరి ఆత్మకథను తెలుగులోకి తేవాలని ఆ క్షణంలోనే నిర్ణయం జరిగిపోయింది. అనువదించడంలో ఇదే తన తొలి ప్రయత్నం. ఇప్పటిదాకా వేలపుటల పరిశోధనాత్మక వ్యాసాలు, సమీక్షలు నిర్విరామంగా వెలువరించినా, ఇంకా ఆ యజ్ఞాన్ని కొనసాగిస్తూనే ఉన్న సాహిత్య యాజ్ఞికుడు, అలుపెరుగని కృషీవలుడు నిత్యానంద రావు. ఇక శ్రీమతి కావేరి చటోపాధ్యాయ ఆత్మకథను అనువదించడానికి ఉపక్రమించి రెండునెలల్లో అద్భుతంగా పూర్తిచేశాడు. అనువాదం మూలవిధేయంగా ప్రవాహశైలిలో సాగిపోతుంది. ఇది అనువాదం అనిపించనంతటి తెలుగుదనంతో, నుడికారంతో రచన పరమ పఠనీయంగా ప్రవహిస్తుంది. కొన్ని ఉద్వేగపూరితమైన సన్నివేశాలలోని ఆక్రోశం, ఆవేదనలను మూలంలో ఎంత బలంగా రచయిత్రి వర్ణించిందో, అదే ప్రతిస్పందన నిత్యానందరావు అనువాదంలో నిరూపించాడు.

తన జీవితంలోని ఆహ్లాదకరమైన/ విషాదకరమైన సంఘటనలు, యాత్రా విశేషాలు ఇటువంటి సందర్భాలలో రచయిత్రి ప్రదర్శించిన భావావేశాన్ని అదే ఆవేశంతో అనువాదశిల్పంలో పరివర్తింపజేసి నిక్షిప్తం చేశాడు. మనిషి తన జీవితంలో తానే ఒక పాత్రగా కాక జీవితాన్ని ఒక ప్రేక్షకుని(రాలి)గా గవాక్షం లోంచి వీక్షించాలని నిబ్బరాన్ని అందించడంలో శ్రీమతి కావేరీ చటోపాధ్యాయ ఆత్మకథ ఒక ప్రేరకమైన పుస్తకం. అదే స్ఫూర్తిని అక్షరాలా ప్రతిబింబించడంలో నిత్యానందరావు అనువాదం సఫలీకృతం అయింది.

❖ ❖ ❖ ❖ ❖

మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

స్వ'కృతి'



చిరునామా

మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com



అక్షరాకాశం (ఆచార్య కసిరెడ్డి సాహిత్య సమాలోచనం)
ప్రచురణ : మూసీ సాహిత్య మాస పత్రిక
వెల : 500/-
ప్రతులకు: 2-2-1109/బికె-ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్ పేట, హైదరాబాద్ - 500 013. ఫోన్ : 934 797 1177

లఘుకవిత్వంలో 'నానో' ప్రస్థానం
ఎస్.ఆర్. పృథ్వి
వెల : 50/-అ
ప్రతులకు : శ్రీమతి పి. ఉషారాణి, కేరాఫ్ పి.వి.వి.ఎన్. శివప్రసాద్, ఇం.నెం. 5-12-100/325, సాయి అంబిక కాలనీ, ఫేజ్ -1, రోడ్ నెం.14-బి, బ్లాక్-సి, అమీన్ పూర్ - 502 033. సంగారెడ్డి జిల్లా.
ఫోన్ : 99892 23245

అగ్నిధార
డా. దాశరథి కృష్ణమాచార్య
వెల : 150/- ద్వితీయ ముద్రణ .జులై 2025
ప్రతులకు : వున్న అంజయ్య, ఇం.నెం. 6-2-954/2, మీర్‌బాగ్ కాలనీ, హైదరాబాద్ రోడ్, నల్లగొండ - 508 001.
ఫోన్ : 9396610639



వ్యాస భారతి
ఆచార్య తూమాటి దొణప్ప
వెల : 250 /-
ప్రతులకు : టి. సుధాకర్, 6-1-68/1, ఫ్లాట్ నెం. 502, సాయి హెూమ్, సైఫాబాద్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.



మదనాగమము (కామశాస్త్ర గ్రంథము)
అజ్ఞాత కర్తృకము
వెల : 150
ప్రతులకు: బి.వి.ఎస్. మూర్తి, 13-23-49/3, నేతాజీ నగర్, హైదరాబాద్ - 500 060.
ఫోన్ : 9440915210



విశ్వ నియమాలు
విశ్వ రహస్యాలు
డా. నిర్మల లక్కరాజు
వెల : 500 /-
ప్రతులకు : ప్రఫుల్లా మెమోరియల్ ట్రస్ట్, హౌస్ నెం. 12-13-830/15
స్ట్రీట్ నెం. 1, తార్నాక, సికింద్రాబాద్ - 17.
ఫోన్ : 98484 68782



గీతా సూక్తులు (తెలుగు-ఆంగ్లము-హిందీ)
డా. బి. బాలనారాయణ
వెల : 300/-
ప్రతులకు : డిప్యూటీ సివిల్ ఇంజనీర్ (విశ్రాంత), శ్రీనివాస హాస్పిటల్, అచ్చంపేట, నాగర్ కర్నూల్ జిల్లా. ఫోన్ : 94408 34632



డా. గుంజి వెంకటరత్నం గారి 'సాహిత్య దర్శనము'
సంపాదకుడు : డా. టి. శ్రీరంగస్వామి
వెల : 300/-
ప్రతులకు : ఎమెస్కో బుక్స్ ప్రై. లిమిటెడ్. 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, దోమల్ గూడ, హైదరాబాద్ - 500 029.

ఆజాద్

నలిమెల భాస్కర్

ఫోన్ : 97043 74081

మనమలా బండి మీద
నిదానంగా వెళుతుంటాం
ముందున్న బండివాడో లేక
ఆటోవాలానో లేదా అందులో ఉన్న వాలానో
మనస్ఫూర్తిగా ముఖస్ఫూర్తిగా
ఏం మేస్తాడో గానీ
ఘూమ్మంటూ ఉమ్మేస్తాడు
ఉన్నపళంగా మనకో చిన్నపాటి
ముందస్తు ఎంగిలి హోళీ

ఓసారి బ్యాంకుకు వెళతాం
అచ్చోట క్యూ లైన్
అతి పొడవైన నది ఈజిప్టు నైలులా ఉంటుంది
ఇంతలో ఓ ఆగంతకుడు
ఓ గెంతు వేసి కౌంటర్ ముందుకొస్తాడు
'పదండి ముందుకు'ను మా బాగా
ఆచరిస్తున్న శాల్తీ వీడు

మనం ప్రశాంతంగా నిద్రిస్తుంటాం
మన వీధిలో పెళ్ళేమో...
హఠాత్తుగా మన గుండెల మీదనే ఏకంగా
డీజేల దంపుడు పాటల కచేరీ మొదలవుతుంది
టపాసులు టపా కడితే వచ్చినట్లు చెవుల్లో పేలుతాయి
ఇది కూడా అడ్వాన్స్ దీపావళి..టపాసుల ఆవళి

మనం బస్సెక్కడానికి పోతాం
దొబ్బుడు నెట్టుడు తోపులాటల బలప్రదర్శనల్లో
గెలిచిన వీరహనుమాన్ వారసులు
'కంద కలవాడేను మనిషోయ్' అన్నట్లు
మనల్ని అవలీలగా తోసుకుపోతారు తొక్కుతూపోతారు

అసలు స్వాతంత్ర్యం రావటం
ఎంత మంచి పనో!
లేకపోతే
ఈ ముందస్తు హోళీ, పదండి ముందుకు దూకుళ్ళూ
ఈ పాటల కచేరీ,అడ్వాన్స్ దీప టపాసులావళులూ
ఈ బలప్రదర్శనలకు
అవకాశమెక్కడిది?ఆస్కారమెక్కడిది?

సృష్టి బంధం

మునుగూరి పురుషోత్తం

నింగికీ నేలకీ
నీటికీ నిప్పుకీ
వెలుగుకీ వెన్నెలకీ
అమావాస్యకీ పౌర్ణమికీ
ఇలా
ఒక్కో ప్రకృతిది ఒక్కో బంధం

మానవునిలోనూ
ఓ బంధముంది
అది
ఆద్యంతాలు లేని
అరమరికలు లేని బంధం.
విచిత్రమైన మనుషులైన
విడ్డురమైన మనసులైన
ఆ బంధంతో
ఇట్టే కలసిపోతారు

ఆ బంధం
కర్ణుడు కౌరవాగ్రజుడు
కృష్ణుడు కుచేలుడు
రఘురాముడు సుగ్రీవుడుల
బంధాలతో నిరూపితం

త్యాగాల పునాదిపై
నమ్మకమనే స్తంభాలపై
ఆనందాల సౌధాన్ని
నిర్మించుకుంటుంది
ఆ బంధం

విభిన్న భావాలతో
విలువైన సాయాలతో
సింగిడీలో రంగులవలె
చిగురిస్తూ ఉంటుంది..
నిత్య సంతోషమై
మురిపిస్తూ ఉంటుంది.

మౌనంలోని మాటను
నవ్వులోని బాధను
కోపంలోని ప్రేమను
అర్థం చేసుకొని నీ
రహస్యాలను
తన మనసులో భద్రపరిచి,
తప్పులను మాత్రం
హెచ్చరిస్తూ ఉంటుంది..

అది నీ
వేలు విడిచిన బంధమో
మూడు ముళ్ల బంధమో
రక్త సంబంధమో
కానే కాదు..
అద్భుతమైన మలినంలేని
స్వచ్ఛమైన బంధం
మమతానురాగాల
'స్నేహబంధం..'

ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

7416 106 106
www.ferty9.com

IUI | **IVF** | **ICSI** | **IMSI** | **HSG**

ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner